**28-04-2024**
**ఆదివారం**
**హైదరాబాద్**
**సంపుటి 26, సంచిక: 308**
**పేజీలు: 12 | ఖమ్మం : 8+8**
**కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 12**
**వెల రూ. 5.00**

Published from:
**Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



గాంధీజీ కథావళి
రూ॥130/-
పేజీలు: 160




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.


### ఐదు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో
## వాటా ఉపసంహరణ




**న్యూఢిల్లీ:** ఐదు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వాటాను తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. 2017 నుండి 2022 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో ప్రభుత్వం ఈ బ్యాంకులన్నింటికీ చాలా మూలధనం అందించింది. దీంతో ఇప్పుడు ఈ బ్యాంకుల్లో ప్రధాన వాటా ప్రభుత్వం వద్ద ఉంది. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఈ బ్యాంకుల ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తులు) తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది, తద్వారా వాటి బ్యాలెన్స్‌షీట్‌లు మెరుగుపడతాయి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, తరువాయి 2లో

## సురేఖ, అభిషేక్ జోడీ అదుర్స్
### భారత్' ఖాతాలో మూడు పసిడి పతకాలు

**షాంఘై :** ఆర్చరీ ప్రపంచకప్ 2024లో భారత ఆర్చర్లు తమ సత్తా చాటారు. తాజాగా జరిగిన ఫైనల్స్‌లో పోటాపోటీగా ఆడి భారత్‌కు మూడు స్వర్ణ పతకాలు అందించారు. శనివారం జరిగిన కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో వరల్డ్‌కప్ స్టేజ్ 1 ఫైనల్‌లో భారత మహిళల టీమ్ జ్యోతి సురేఖ, అదితి స్వామి, ప్రణీత్ కౌర్‌లతో కూడిన జట్టు ప్రత్యర్థి ఇటలీ టీమ్‌పై 236–225 తేడాతో నెగ్గి గోల్డ్ మెడల్ పట్టేశారు. ముఖ్యంగా తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ఈ ఫైనల్‌లో తనదైన శైలిలో ఆడి సత్తా చాటింది. మిక్స్‌డ్ డబుల్ ఈవెంట్ మహిళా జట్టు స్వర్ణాలు గెలవడంలో జ్యోతి సురేఖ కీలక పాత్ర తరువాయి 2లో




## బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య
# చీకటి ఒప్పందం

బిజెపికి ఐదు సీట్లు తాకట్టుపెట్టిన బిఆర్‌ఎస్

మల్లారెడ్డి వ్యాఖ్యలే అందుకు నిదర్శనం

ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి

కోటా పెంచుతామని మేనిఫెస్టోలో బిజెపి ఎందుకు చెప్పలేదు

మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



మల్కాజిగిరి ఎంపిగా బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తారని సాక్షాత్తూ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ బహిరంగంగా చెప్పడం దేనికి సంకేతమని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బిజెపికి ఐదు సీట్లను బిఆర్‌ఎస్ తాకట్టు పెట్టారనేందుకు మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యాలే నిదర్శనమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల రిజర్వేషన్లు ఉండాలంటే, వాటిని పెంచాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని, రిజర్వేషన్లను రద్దు చేయాలంటే బిజెపికి ఓటు వేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపితో బిఆర్‌ఎస్‌కు ఒప్పందమే లేకపోతే ఎంఎల్‌ఎ మల్లారెడ్డిని బిఆర్‌ఎస్ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని, కనీసం షోకాజు నోటీసులు ఇవ్వకపోగా మల్లారెడ్డి వ్యాఖ్యాలను కెటిఆర్ సమర్థించడం దేనికి సంకేతమన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య చీకటి ఒప్పందం లేకపోతే మేడ్చల్ ఎంఎల్‌ఎ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపిని గెలిపించేందుకు బిఆర్‌ఎస్ అభ్యర్థికి కనీసం బూతుల ఖర్చులను కూడా ఇవ్వలేదని, మరోవైపు ఈటల రాజేందర్‌కు వ్యతిరేంగా కెటిఆర్‌మాట్లాడడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చించేందుకు సభకు రాని కెసిఆర్,టివి చానల్‌కు మాత్రం వెళ్లారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కెసిఆర్ బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కెసిఆర్ మానిసిక ఆందోళనలో ఉన్నారన్నారు. అధికారం కోల్పోయి, బెల్లు కొడితే కూడా ఎవ్వరూ రావడంలేదని, చివరకు 'సంతు' కూడా సెలవు పెట్టారని ఎద్దేవా చేశారు. మోదీ,అమిత్‌షాలను ప్రత్యక్షం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. టెలిఫోన్ ట్యాపింగ్‌లో నివేదిక వచ్చిన తర్వాతానే తాను స్పందిస్తానని స్పష్టం చేశారు

**రిజర్వేషన్లపైన బిజెపి విధానం చెప్పండి :** ఒబిసిల జనాభా లెక్క గట్టి, రిజర్వేషన్లు పెంచుతామని మోదీ, అమిత్‌షాలు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. రిజర్వేషన్లను పెంచుతామనే అంశాన్ని బిజెపి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎందుకు పొందపర్చలేదన్నారు. దీనిపైన బిజెపి జాతీయ నాయకులతో కిషన్‌రెడ్డి, ఈటల, తరువాయి 2లో

### 'బిడ్డ' కోసం రిజర్వేషన్లను తాకట్టు పెట్టారా?

ఆర్‌ఎస్‌ఎస్ భావాజాలానికి కెసిఆర్ ప్రభావితులయ్యారా? లేదా 'బిడ్డ' కోసం రిజర్వేషన్లను తాకట్టు పెట్టారా అని కెసిఆర్‌ను సిఎంరేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రిజ్వేషన్లపైన బిఆర్‌ఎస్ తన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిజెఉపి రిజర్వేషన్ల రద్దు చేస్తే బిఆర్‌ఎస్ పోరాట కార్యాచరణ ఏమిటో స్పష్టం చేయాలన్నారు. వంద రోజుల ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కార్యాచరణతో బస్సు యాత్ర చేస్తున్న కెసిఆర్, మోదీపై పోరాటం చేసేందుకు ఎందుకు కార్యాచరణ లేదని ప్రశ్నించారు. పదేళ్లు సిఎంగా పనిచేసి, ప్రధానప్రతిపక్ష నేతకు అబద్ధాలు ఎందుకని, అసహనం ఎందుకని కెసిఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారం లేకపోతే ఊపిరి ఆగిపోతుందా? అని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసి, రిజర్వేషన్లను రద్దు చేసేందుక కుట్ర పన్నుతున్న ప్రధాని మోదీని ప్రశ్నించకుండా, వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని తెలంగాణ రాష్ట్రానికి వచ్చినకేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానిస్తే, దీనిపైన కూడా కెసిఆర్ స్పందించడం లేదని విమర్శించారు.

# కలిసి పనిచేస్తాం

బిజెపిని ఓడించేందుకు అన్నిరకాలుగా ముందుకెళ్తాం

కాంగ్రెస్, సిపిఐ(ఎం) నిర్ణయం

ముఖ్యమంత్రిని కలిసిన సిపిఐ(ఎం) నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్

లోకసభ ఎన్నికల నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిపిఐ(ఎం) నాయకులు శనివారం భేటీ అయ్యారు. ఈ బేటీలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డితో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్రంలోని తాజా రాజకీయాలు, లోక్‌సభ ఎన్నికలు తదితర అంశాలపై వారి మధ్యచర్చ జరిగింది. సమావేశం అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షుల ఆదేశాల మేరకు సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకత్వంతో చర్చించామని, కొన్ని రాజకీయ ప్రతిపాదనలు పెట్టామని వివరించారు. ఇతర స్థానాలతో పాటు భువనగిరి లోక్‌సభలో కూడా కాంగ్రెస్‌కు సంపూర్ణ తరువాయి 2లో



## కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షమే

కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు

సిపిఐలోకి భారీ చేరికలు

ప్రజాపక్షం/సుజాతనగర్

కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షమే ఉంటుందని, ఏ కష్టం వచ్చినా పేద ప్రజలను ఆదుకుంటామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని మరి తండా గ్రామం నుండి 100, సుజాతనగర్‌లోని జండాల సెంటర్ నుంచి 40 కుటుంబాలు, నాయకులగూడెం గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నుండి సిపిఐలో చేరారు. వారందరికీ ఎర్ర కండువాలు కప్పి మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొన్ని పార్టీలు అధికారం ఉన్నప్పుడే కనిపిస్తాయని, కమ్యూనిస్టు పార్టీ అధికారం ఉన్నా లేకపోయినా పేదల న్యాయం కోసమే పోరాడుతుందన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ సాధ్యమైనంతవరకు ఏ కష్టమైనా, నష్టం వచ్చిన సహాయం అందిస్తామన్నారు. గురు ప్రసాద్, కుమారి రామయ్య నాటి నుంచి నాయకులగూడెం గ్రామంలో పార్టీకి అనుబంధం ఉందన్నారు. సుజాతనగర్ మండలంలో సిపిఐకి చాలా బలంగా ఉందని, మరి కొద్ది రోజుల్లో మరింత బలంగా తరువాయి 2లో

## బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే
# రాజ్యాంగాన్ని మార్చడం ఖాయం



కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీ

**ధరంపూర్ :** అధికార బిజెపి అగ్రనాయకత్వం ప్రస్తుతం తిరస్కార ధోరణిలో ఉన్నట్లు నటిస్తోందని, అయితే ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని ప్రియాంక విమర్శిస్తూ ఆయనను 'మెహెంగాయ్' వ్యక్తిగా అభివర్ణించారు. ఒకవైపు రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నేతలు, అభ్యర్థులు బహిరంగంగా చెబుతుంటే మరోవైపు మాత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దానిని కొట్టిపారేస్తున్నారన్నారు. ఇదీ వారి వ్యూహంమని అన్నారు. ఎస్‌సి రిజర్వ్‌డ్ వల్సాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి అనంత్ పటేల్‌కు మద్దతుగా గిరిజనులు తరువాయి 2లో



## వీడని సస్పెన్స్

ఆమేథీ, రాయ్‌బరేలి పోటీపై స్పష్టతకు మరికొన్ని రోజులు ఆగాల్సిందే: ఖర్గే

**గువహటి :** ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మొదట్నించీ పట్టు ఉన్న అమేథి, రాయబరేలి నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎవరిని తమ అభ్యర్థులుగా బరిలోకి దింపనుందనే సస్పెన్స్ వీడడం లేదు. ఈ నియోజకవర్గాల్లో మరికొన్ని రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. శనివారం ఆయన గువహటిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అవినీతిపరులను జైళ్లలో పెడుతామని బిజెపి చెబుతోందని, మరి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలను ఆ పార్టీలో ఎందుకు చేర్చుకుంటుందని ప్రశ్నించారు. పైగా వారిని రాజ్యసభకు, అసెంబ్లీలకు పంపుతున్నారని మండిపడ్డారు. ఆమేథి, రాయ్‌బరేలి నుంచి పార్టీ అభ్యర్థులుగా ఎవరిని ప్రకటిస్తున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఖర్గే సమాధానమిచ్చారు. మరికొన్ని రోజులు ఆగాలని, ప్రజల నుంచి అభ్యర్థుల పేర్లు తనకు అందిన తరువాత, నోటిఫికేషన్‌పై తాను సంతకం చేస్తానన్నారు. నియోజక వర్గాలను మార్చడంపై కాంగ్రెస్ నేతలను ప్రశ్నిస్తున్న వారు (అటల్ బిహారీ) వాజ్‌పేయి, తరువాయి 2లో

## అక్కరకురాని చుట్టం బిజెపి

అడ్డగోలు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి

బిఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో ఉమ్మడి పాలమూరుజిల్లా ధాన్యం రాశులతో కళకళలాడేదని, అడ్డగోలు అబద్ధపుహామీలతో అధికారంలోకి వచ్చిన నాలుగునెలలకే పాలమూరు జిల్లా తాగునీరు, సాగునీరుకు హరిగోసపడుతుందని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టిఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా శనివారం నాగర్‌కర్నూల్ మండలం ఉయ్యాలవాడనుండి జిల్లాకేంద్రంవరకు టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ రోడ్‌షో నిర్వహించారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్నర్‌మీటింగ్‌లో టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ మాట్లాడుతూ బిజెపిపార్టీ తెలంగాణరాష్ట్రానికి అక్కరకురాని చుట్టంలాంటిదని, దేశప్రధాని మోదీ వందనినాదాలు చేశారని అందులో ఏఒక్కటి నెరవేర్చలేదని, పాలమూరుజిల్లాకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా ఇవ్వలేదని కొత్త రాష్ట్రం ఏర్పడిన తెలంగాణకు నవోదయ పాఠశాలలు తరువాయి 2లో

## రెచ్చిపోయిన మిలిటెంట్లు

సిఆర్‌పిఎఫ్ శిబిరంపై కాల్పులు : ఇద్దరు సిబ్బంది మృతి



**ఇంఫాల్ :** రెండు తెగల మధ్య ఘర్షణతో గత ఏడాది అట్టుడుకిపోయిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున బిష్ణుపూర్ జిల్లాలోని భద్రతా సిబ్బంది శిబిరంపై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ సిబ్బంది తరువాయి 8లో



## గుజ్జుల, దాసరి ఆశయాలతో ముందుకు

యల్ల మందారెడ్డి, నాగభూషణరావుకు సిపిఐ నేతల ఘననివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు గుజ్జుల యల్లమందారెడ్డి, దాసరి నాగభూషణ రావు ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకుపోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. రైతు కుటుంబంలో పుట్టిన ఇద్దరు నాయకులు వ్యవసాయ రంగంలో పనిచేసే వ్యవసాయ కార్మికులు, దినసరి కూలీలు, పేదలను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడారని, తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని ఆయన కొనియాడారు. గుజ్జుల యల్లమందారెడ్డి, దాసరి నాగభూషణరావుల వర్ధంతి తరువాయి 8లో

## సీట్లు ఎక్కువ.. పాసైనోళ్లు తక్కువ!



ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారికన్నా సీట్లు ఎక్కువ

డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసి సహా ఇతర కోర్సుల్లో లక్షల్లో సీట్లు

అడ్మిషన్లు పొందేందుకు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల అగచాట్లు

సీట్లు అమ్ముకుంటున్న వివిధ కళాశాలల యాజమాన్యాలు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

తెలంగాణ ఉన్నత విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోతున్నాయి. అందుకు ఇంటర్మీడియట్‌లో పాస్ అయిన వారి కంటే తదుపరి ఉన్నత విద్యలో సీట్లు ఎక్కువగా ఉండడమే నిదర్శనంగా స్పష్టమవుతోంది. డిగ్రీ, ఇంజనీరింగ్ , ఫార్మసీ సహా ఇతర కోర్సుల్లో లక్షల్లో సీట్లు ఉండగా అందుకు తగిన విధంగా ఇంటర్మీడియట్ పాస్ పర్సంటేజీ ఉండడం లేదు. ఫలితంగా డిగ్రీ, ఇంజనీరింగ్ లో లక్షల్లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ఈ క్రమంలో సీట్లు భర్తీ చేయడానికై ఆయా కళాశాలలు విద్యార్థులకు ఎన్నికలకు మించిన హామీలతో పాటు నయానో బయానో ఇచ్చి అడ్మిషన్లు చేసుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోవడానికి కారణమవుతున్నారు. తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలు బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా రెగ్యులర్, వొకేషనల్, ప్రైవేట్ కలిపి మొత్తంగా 5,02,280 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయగా ఫలితాలలో కేవలం 3,22,432 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వందలో 64.19 శాతం ఉత్తీర్ణత తరువాయి 8లో

## ట్రంప్ సవాల్ స్వీకరించిన బైడెన్

### ముఖాముఖీ చర్చకు రంగం సిద్ధం



వాషింగ్టన్ : రాజకీయాల్లో సవాళ్ళు ప్రతి సవాళ్ళు మామూలే. పైగాఎన్నికల సమయంలో ఈ సవాళ్ళు పరాకాష్టకు చేరతాయి. అమెరికాలో కూడా అంతే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ విసిరిన సవాలును అధ్యక్షుడు జో బైడెన్ స్వీకరించారు. ప్రజా సమస్యలపై ముఖాముఖీ చర్చలు జరిపి ట్రంప్ ఢీకొట్టేందుకు బైడెన్ సంసిద్ధత వ్యక్తం చేశారు. దీంతో అమెరికా ఎన్నికల్లో మొదటిసారి ఇద్దరు వృద్ధ నాయకులమధ్య వాగ్వాదానికి రంగం సిద్ధం అవుతున్నది. తనతో వచ్చి ముఖాముఖీ చర్చల్లో పాల్గొనాలని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, దేశ మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సవాలు చేశారు. ట్రంప్ వయసు 77 కాగా, బైడెన్ వయసు 81 సంవత్సరాలు. ఐతే ట్రంప్ చేసిన సవాలును స్వీకరించడంతో బైడెన్ సహాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 81 ఏళ్ళ వయసులో ట్రంప్ లాంటి వ్యక్తిని ఎదుర్కోగలరా? అనే విషయంలో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ట్రంప్ ఆయనను చీల్చి చెండాడతారని రిపబ్లికన్ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. దేశంలో అత్యంత వృద్ధుడైన అధ్యక్షుడుగా బైడెన్ రికార్డు సాధించారు. దేశ ప్రజలుకూడా ఆయనను అత్యంత వృద్ధుడుగా భావించి అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో ప్రతి నాలుగేళ్ళకు ఒకసారి అధ్యక్ష ఎన్నికలు జరిగినప్పుడు రెండు పార్టీల అధ్యక్ష అభ్యర్థులూ ఒకేవేదికపై ప్రజా సమస్యల గురించి పరస్పరం చర్చించడం, వాగ్వాదం పడటం, తమ సత్తా నిరూపుంచుకునే ప్రయత్నం చేయడం ఒక పెద్ద సంప్రదాయంగా మారింది. 1976 నుండీ దేశంలో ఈ సంప్రదాయన్ని పాటిస్తున్నారు. ''నేను ఎక్కడైనా ఎప్పుడైనా బైడెన్‌ను ఢీ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాను'' అని ట్రంప్ బైడెన్ ప్రకటన అనంతరం స్పందించారు.

## కేన్సర్ నుంచి కోలుకున్న బ్రిటన్ రాజు ఛార్లెస్



ఎడింబర్గ్ : బ్రిటన్ రాజు ఛార్లెస్–3 క్యాన్సర్ వ్యాధి నుండి కోలుకున్నారు. ఆయన కేన్సర్ వ్యాధి కారణంగామూడు నెలలు విరామం తీసుకున్నారు. ఈ వారంలోనే ఆయన తిరిగి రాజరిక బాధ్యతలను అధికారికంగా చేపడతారు. జూన్ నెలలో జపాన్ చక్రవర్తికి అధికారికంగా ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తిరిగి అంతర్జాతీయ కార్యకలాపాల్లో బాహ్యజీవితంలోకి పునఃప్రవేశం చేస్తారు. ఛార్లెస్ వయసు 75 సంవత్సరాలు. ఆయన భార్య కేమెల్లా వయసు 76. వీరిద్దరూ గడచిన గురువారంనాడు క్యాన్సర్ కేంద్రానికి వెళ్ళి అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఈనెల 10వ తేదీనే ఈ జంట తమ 19వ వివాహ వార్షికోత్సవం చేసుకుంది. బకింగ్‌హామ్ ప్యాలస్ అధికార వర్గాలు ఈ విషయం తెలియజేశాయి. ఆయన క్యాన్సర్ వ్యాధికి గురయ్యారని సమాచారం తప్ప శరీరంలో ఏ భాగంలో క్యాన్సర్ గుర్తించారు? చికిత్స ఎలా జరిగిందన్న వివరాలు వెల్లడి కాలేదు.

## కెన్యా, బురుండీలో వరదలు

### 200 మంది మృతి

నైరోబీ : కెన్యా, బురుండీ లలో భారీ వరదలు ముంచెత్తుతున్నాయి. కెన్యాలో ఇప్పటివరకూ 70 మంది మరణించారు. వేలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మురికివాడలో నివసించే ప్రజల ఇళ్ళు కొట్టుకుపోయాయి. వారిని ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలించింది. జాతీయ యూత్ ఫోర్స్ రంగంలోకి దిగిందని కెనా అధ్యక్షుడు రూతో చెప్పారు. దక్షిణ కెన్యా మకౌనీ కౌంటీలో వరద బాధితులను తీసుకువెళుతున్న లారీ భారీ వరద నీటిలో చిక్కుకుని ప్రవాహంలో కొట్టుపోయింది. వారిలో చాలామంది మరణించారు. సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# హమాస్ శాంతి ప్రతిపాదనకు నేతన్యాహు తిరస్కృతి

### గాజాలో బాంబుదాడుల ఉధృతి

### 32 మంది మృతి

ప్రపంచం

టెల్ అవీవ్ : యుద్ధ విరమణకు, శాంతి చర్చలకు హమాస్ అగ్రనాయకుల ప్రతినిధి చేసిన ప్రతిపాదనను ఇజ్రాయిల్ ప్రభుత్వం తిరస్కరించింది. రఫా నుండి హమాస్‌ను తుడిచిపెట్టడమే తమ ధ్యేయమని మరోసారి ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహు పునరుద్ఘాటించారు. అదే సమయంలో ఇజ్రాయిల్‌తో శాంతి చర్చలకు ఒప్పించేందుకు ఈజిప్టుకు చెందిన మధ్యవర్తి బృందం శనివారంనాడు ఇజ్రాయయిల్ రాజధాని టెల్ అవీవ్‌కు చేరుకుంది. తమ శాంతి ప్రయత్నాలను కొనసాగిస్తామనని ఈ ప్రతినిధి బృందం స్పష్టం చేసిది. మరోవైపు నేతన్యాయహూ మొండిపట్టు వీడలేదు. అందుకు తగ్గట్టుగానే గాజాస్ట్రిప్‌లో గడచిన 24 గంటలుగా బాంబు దాడులను ఐడిఎఫ్ (ఇజ్రాయిల్ డిఫెన్స్‌ఫోర్స్) ఉద్ధృతం చేసింది. 24 గంటలుగా జరుగుతున్న దాడుల్లో 32 మంది పాలస్తినా ప్రజలు మరణించారు. మరో 69 మంది గాయపడ్డారు. రఫాలో ఓ ఇంటిపై జరిపిన దాడిలో పిల్లల్తో సహా ఒకే కుటుంబంలో ఐదుగురు సభ్యులు మరణించారు. ఖాన్ యూనిస్ నజైరత్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యంరహస్యంగా ఖననం చేసిన మృతదేహాలు ఇంకా ఏమైనా ఉన్నాయేమో అని వెలికి తీసేందుకు పౌర రక్షణ బృందాలు తవ్వకాలు కొనసాగిస్తున్నాయి. గాజా స్ట్రిప్‌లో ఆసుపత్రులపై దాడులు కొనసాగుతున్నాయి. రఫాలో పాలస్తినా ప్రజలు 15 లక్షలమంది తలదాచుకున్నారు. వారికి తాత్కాలికంగా నిర్మించిన శిబిరాల్లో దుర్భర పరిస్థితులు నెలకుని ఉన్నాయి. స్థానిక నివేదికల ప్రకారం తాత్కాలిక ఆవాసాల్లో టాయిలెట్స్ లేవు. మంచినీటి సరఫరా లేదు. వందలమందికి కలిపి ఒకే టాయిలెట్ ఉందని అక్కడ సహాయ శిబిరాల్లో వైద్య సేవలు అందించిన సర్జన్ ఒకరు చెప్పారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు చాలా వేగంగా విస్తరించే ప్రమాదం ఉందని, గ్యాస్, నీటి సరఫరా లలేదని





భోజనం ఒక మనిషికి వారంలో రెండు సార్లు దొరకడం చాలా కష్టంగా మారిందనీ డాక్టర్ జునైద్ సుర్లాన్ అనే వాస్కులర్ సర్జన్ వెల్లడించారు. కాగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ లో కూడా సైనికులు, ఇజ్రాయిల్ పౌరులు పాలస్తీనియన్లపై దాడులు చేస్తున్నారు. జెనస్ మీపం సాలెం చెక్ పాయింట్ వద్ద సైన్యం ఇద్దరు పాలస్తినా యువకులను కాల్చి చంపింది. రమల్లా, హెబ్రాన్, నెబ్లస్ లలో దాడులు కొనసాగుతున్నాయి. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతలో వందలాదిమంది పాలస్తినా ప్రజలను సైన్యం అరెస్టు చేసింది.

### ఇతర దేశ యూనివర్సిటీకు విస్తరించిన ఆందోళనలు

పాలస్తినాకు సంఘీభావంగా అమెరికా యూనివర్సిటీలలో ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు ప్రపంచవ్యాప్తంగా ఇతర విశ్వవిద్యాలయాలకు కూడా వ్యాపిస్తున్నారు. అమెరికాలోని కొలంబియా, కాలిఫోర్నియా, న్యూయార్క్, టెక్సాస్ విశ్వవిద్యాలయాలలో గడచిన పది రోజులుగా పాలస్తినాకు అనుకూలంగా పది రోజులుగా ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. విద్యార్థులు టెంట్‌లు వేసుకుని నిరసనలు చేస్తున్నారు. ఈ నిరసనలు బ్రిటన్‌లో కూడాగతంలో జరిగాయి. ఇప్పుడు మళ్ళీ బ్రిటన్ విశ్వవిద్యాలయాల్లో కూడా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాలలో విశ్వవిద్యాలయాలకు కూడా ఈ నిరసనలు, సంఘీభావ ప్రదర్శనలు విస్తరించాయి. సెంట్రల్ లండన్‌లో శనివారం జరిగిన నిరసన ప్రదర్శనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంపెన్ ఎగెనెస్ట్ యాంటీ సెమెటిజం (సిఎఎ) పేరుతో విడిగా కూడా ప్రదర్శనలు జరుగుతున్నాయి. రఫాలో యుద్ధాన్ని ఆపాలని ఆ దాడులు చేస్తే మానవ విలయం మరింతగా విస్తరిస్తుందని విద్యార్థులు నినాదాలు చేశారు. కాగా అట్లాంటా ఎమోరీ యూనివర్సిటీలో శనివారంనాడు మరో 11 మందిని అరెస్టు చేశారు.





# దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్యానికి 30 ఏళ్ళు

### పేదరికం–నిరుద్యోగం మధ్య రేపు సార్వత్రిక ఎన్నికలు

జోహన్నెస్‌బర్గ్ : దక్షిణ ఆఫ్రికాలో శనివారం 30వ ప్రజాస్వామ్య దినోత్సవం ఘనంగా జరిగింది. దేశ నాయకులు, ప్రజాసమూహాలు నెల్సన్ మండేలాను గుర్తుచేసుకుని నివాళులు అర్పించారు. ప్రతి ఏడాదీ ఏప్రిల్ 27ను ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిన దినోత్సవంగా, ఫ్రీడమ్ డే గా ప్రజలు పాటిస్తారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన యోదుడు, దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి మొట్టమొదటి ప్రభుత్వంలో అధ్యక్షుడుగా నెల్సన్ మండేలా అధికారం చేపట్టి శనివారంనాటికి 30 సంవత్సరాలు గడిచింది. దక్షిణాఫ్రికాలో 1994 ఏప్రిల్ 27వ తేదీన ప్రజాస్వామ్యయుతమైన పద్ధతులలో మొదటిసారి ఎన్నికలు జరిగాయి. ఆనాడు కొత్త రాజ్యాంగ రాసుకుని జాతి వివక్షనిర్మూలించి దేశంలో ప్రజలందరికీ సమాన హకక్కులు ప్రకటించారు. దక్షిణాఫ్రికా నేషనల్ కాంగ్రెస్ పార్టీ 11వ అధ్యక్షుడుగా, ఆ దేశ తొలి ప్రజాస్వామ్య ప్రభుత్వ అధ్యక్షుడుగా ఆనాడు మే 10వ తేదీన బాధ్యతలు చేపట్టారు. ఆ పరంపరలో భాగంగా ఈనెల





29వ తేదీ సోమవారంనాడు దక్షిణాఫ్రికాలో మరోసారి పార్లమెంటుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల పోలింగ్ జరగనున్నది. 30 ఏళ్ళ క్రితం దేశంలో అందరికీ నెల్సన్ మండేలా ఓటు హక్కు ఇచ్చి ప్రజాస్వామ్య పరిపాలన ప్రాధాన్యతను రుచి చూపించారు.

కానీ ఈనాడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీ ఈనాడు దేశాధ్యక్షుడు సిరిల్ రామఫోసా సారథ్యంలో తీవ్ర సమస్యల్లో ఉంది. సోమవారం జరిగే ఎన్నికల్లో ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీ భారీ మెజారిటీలో తిరిగి అధికారం చేపట్టే అవకాశాలు



లేవని సర్వే నివేదికలు పేర్కొన్నాయి. చిన్నా చితకా పార్టీలను కలుపుకుని ఏప్రిల్ 29 తర్వాత సంకీర్ణ ప్రభుత్వాన్ని వీలైతే ఏర్పాటు చేయగలదని దక్షిణాఫ్రికాలో రాజకీయ పరిశీలకులు అంచనావేశారు. దేశంలో ప్రపంచలోనే ఎక్కడా లేనంతగా 32 శాతం మేరకు నిరుద్యోగం నమోదైంది. 15–24 మధ్య వయస్కులు దేశంలో 60 శాతం మంది ఉన్నారు. దారిద్ర్యం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, పెరిగిన నేరాలు, భద్రతలేమి సహా ముఖ్యంగా అవినీతి వంటి అనేక సమస్యలు అధికారపార్టీపై ప్రజల్లో తీవ్ర ఆసంతృప్తిని పెంచాయి.

## భారీ జలచరం సముద్ర ఆవు మృతి

మియామి : ప్రచంచంలో అరుదైన దక్షిణ ఫ్లోరిడాలోని సముద్ర ఆక్వేరియంలో 65 ఏళ్ళ వయసుగల నీటి ఆవు(సీకౌ) కన్నుమూసింది. ప్రపంచంలో చాలాఅరుదుగా ఉన్న జలచరాల్లో ఇది ఒకటి. ఆరోగ్య కారణా ల రీత్యా తంపా జూలో ఈనీటి ఆవు మరణించిందని అధికారులు ప్రకటించారు. ప్రపంచంలో చాలా ఎక్కువకాలం జీవించిన నీటి ఆవుగా పేర్కొన్న ఈ భారీ సముద్ర జలచరానికి జూలియట్ అని పేరు పెట్టి పిలుస్తారు. ఎంతోమంది సందర్శకులు, వెటర్నరీ డాక్టర్లకు ఈ ఈ సీ కౌ (సముద్రఆవు) ఎంతో సన్నిహితమైనది. మియామీలోని సీఆక్వేరియంలో దుర్భరపరిస్థితుల్లో ఉండగా డ్రోన్ ద్వారా చూసి దీనిని రక్షించి గత డిసెంబరు నుండి జాగ్రత్తగా కాపాడుతూవచ్చారు. 3,045 పౌండ్లు బరువుగల అతి భారీ ఈసముద్ర ఆవును పురాతన జలచరం జాబితాలో ఉంది. క్రిష్టఫర్ కొలంబస్ సముద్ర సాహసయాత్రలు చేసినప్పుడు మొదటిసారి ఈవిధమైన భారీజలచర నీటిఆవులు మూడింటిని చూసినట్లు తన డైరీల్లో రాసుకున్నారు.

## తక్షణమే కొత్త ఉత్తర్వులు విడుదల చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ వ్యతిరేకించిన పాత జివోనే ప్రభుత్వం మళ్లీ అమలు చేయాలని చూస్తోందని, వెంటనే కొత్త ఉత్తర్వులను విడుదల చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ కుమారి డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు పోరాటాలకు సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు. సమస్యలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు కొత్త జీవోను ఇవ్వాలని ఆమె శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్‌మెంట్‌కు సంబంధించిన జివో నంబర్ 10ని రద్దు చేయాలనిడిమాండ్ చేశారు. సమ్మెకాలానికి వేతనాలు ఇస్తామని, ఐఆర్. ఐదు శాతం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పిఆర్‌సి వర్తింపచేస్తామని, ఆసరా పెన్షన్‌ను ఇస్తామని గత అక్టోబర్ 4న మంత్రి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో జరిగిన చర్చలో హామీనిచ్చారనికరుణకుమారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారంటీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.1లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షమే

(మొదటి పేజీ తరువాయి)

తయారవుతుందని తెలిపారు. పార్టీలకతీతంగా ఎన్నికల్లో ప్రజలు తమపై అభిమానం చూసి ఆదరించారన్నారు. కొంతమంది నాయకులు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే కనిపిస్తారని ప్రజల్లో కష్టాలు ఉన్నప్పుడే వారిని గుర్తించి ఆదుకోవాలని తెలిపారు. అనంతరం జండాల సెంటర్లో నూతనంగా ఎన్నికైన భూక్య పద్మావతిని సిపిఐ నాయకులు బొడ్డు కేశవరావు ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. పార్టీలో చేరిన వారిలో తాజా మాజీ సర్పంచ్ మండ నాగ రాజరాజేశ్వరి, వీర రావు, బాలు లక్ష్మీ నారాయణ, మండే నాగేశ్వరరావు, మూడు శీను, శంకర్, గుగులోతు శ్రీను, భూక్య వినోద్, మూడు అస్లీ, చిట్టెమ్మ, బొడ్డు నాగమణి, ఎస్.కె హమీబి, కళావతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంత రావు, జక్కుల రాములు, సహాయ కార్యదర్శి పొదిల శ్రీను, వేల్పుల భాస్కర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, రైతు సంఘం నాయకులు తాళ్లూరి పాపారావు, ధర్మారావు, తాళ్ల వెంకటేశ్వర్లు, కుమారి కృష్ణ, ఎంపీటీసీ గణేష్ , మాజీ ఉప సర్పంచ్ బాగం కృష్ణ, వీర్ల దుర్గాప్రసాద్, లింగేష్, దండి నరసింహారావు, మాజీ ఎంపీటీసీ ముక్కెర మురళి, దండు నాగేశ్వరరావు, మండే నాగేశ్వరరావు, మంగ్యా లక్ష్మ, గడ్డం రాజేందర్, నాగేశ్వరరావు, కాత్రవుల రాములు, లావుడియా గోపి, భూక్య కృష్ణ, దండు సురేష్, భాగం మోహన్ రావు, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సురేఖ, అభిషేక్ జోడీ అదుర్స్

(మొదటి పేజీ తరువాయి)

పోషించింది. ఇక కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురేఖ అభిషేక్ వర్మ జోడీ ఫైనల్‌లో 158–157 తేడాతో ఎస్తోనియా జట్టుపై గెలుపు సాధించింది. పురుషుల టీమ్ ఈవెంట్‌లో అభిషేక్ వర్మ, ప్రియాన్ష్, ప్రథమేశ్‌తో కూడిన ఇండియన్ టీమ్ నెదర్లాండ్‌కు చెందిన మైక్ స్కాలోసెర్, సిల్ పటెర్, స్టెఫ్ విలిమ్స్ టీమ్‌పై 238–231 తేడాతో అలవోకగా చిత్తు చేశారు. దీంతో స్వర్ణం ఆ జట్టు సొంతమైంది. ఇదిలా ఉండగా, మహిళల జట్టు విభాగంలో ఇటలీకి చెందిన టీమ్‌పై మన భారత్ అమ్మాయిలు అద్భుత విజయాన్ని సాధించారు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఫైనల్స్‌లో స్వర్ణం సాధించారు. వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్నీత్ కౌర్‌తో కూడిన ఈ టీమ్‌ఇండియా జట్టు 236–225 తేడాతో ఇటలీ ఆర్చర్లు మార్సెల్లా టినిలి, ఐరెనె ఫ్రాంచిని, ఎలీసా రోనెర్‌ను చిత్తు చేసి ఘన విజయాన్ని సాధించడం విశేషం. దీంతో ఇటలీ ప్లేయర్లు ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. మరోవైపు రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో అంకిత బాకత్ బొమ్మదేవర ధీరజ్ జోడీ మెక్సికతో తలపడనుంది. మరో విశేషం ఏంటంటే మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్టార్ ఆర్చర్ దీపిక కుమారి సెమీ ఫైనల్లోకి ఎంట్రీ ఇచ్చింది.

## అక్కరకురాని చుట్టం బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

మంజూరుచేయాలని ఎన్నిసార్లు లేఖలురాసినపట్టించుకున్న పాపానపోలేదని దుయ్యబట్టారు. అలాంటిపార్టీకి ఓట్లు ఎలా వేస్తాం అని యువత ఆలోచించాలని ఆయన యువతను కోరారు. 50ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్‌హయాంలో రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు ఇవ్వలేదని టిఆర్‌ఎస్‌పాలనలో జిల్లాకు మెడికల్‌కాలేజి ఇచ్చామని, వలసలజిల్లా వలసలుపోయిన పాలమూరు జిల్లాను ధనరాశులతో కళకళలాడే విధంగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ నాలుగునెలల పాలనలో 27మంది రైతులు మరణించారని మాజీ సిఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో 24గంటలు విద్యుత్ ఇస్తున్నామని ముఖ్యమంత్రి మంత్రులు ప్రకటనలు ఇస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌నివాసంలో భోజనం చేస్తుండగా రెండుసార్లు కరెంటుపోయిందని ఆసందర్భంగా మాజీ ఎంఎల్‌ఎలు రాష్ట్రంలో రోజుకు పదిసార్లు కరెంటుపోతుందని తనదృష్టికి తీసుకువచ్చారని కెసిఆర్ అన్నారు. టిఆర్‌ఎస్‌పాలనలో రైతుబంధు టింగ్‌టింగ్ అని పడిందని, ప్రస్తుతం అధికారంలోఉన్నకాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాటలతో పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంనుండి టిఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్‌ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుర్ గురుకుల కార్యదర్శిగా పనిచేసి తెలంగాణ గురుకులాలు అంటే ఇంటర్నేషనల్ స్కూళ్లతో సమానమని ఆయన అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కెసిఆర్ నాకు అవకాశం ఇచ్చారని మీరు గెలిపిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ను ప్రపంచపటంలో ఉండేలా కృషిచేస్తానన్నారు. రోడ్‌షో మాజీమంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగంజనార్దన్‌రెడ్డి, అలంపూర్ ఎంఎల్‌ఎ విజయుడు, ఎంఎల్‌సి చల్లావెంకట్రాంరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు గువ్వలబాల్‌రాజు, మర్రిజనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, ఉప్పలవెంకటేష్, జిల్లా మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపసంహరణ

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంక్ ఆఫ్‌మహారాష్ట్ర, యూకోబ్యాంక్, పంజాబ్‌అండ్ సింథ్ బ్యాంక్‌లలో ఉపసంహరణ ఉండనుంది. ఈ బ్యాంకుల్లో 75 శాతం వాటా ఉంది. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నియమానికి అనుగుణంగా ఉండేలా చూసుకోనుంది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నిబంధనల ప్రకారం ఏ కంపెనీ అయినా లిస్టింగ్ అయిన 3 సంవత్సరాలలోపు కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్ 25 శాతం నిర్వహించాలి. ఈఐదు బ్యాంకులకు ఎంపీఎస్ నియమాన్ని పాటించడానికి ఆగస్టు 2024 వరకు సమయం ఉందని నివేదికలు పేర్కొన్నాయి. ఎంపీఎస్ నియమానికి అనుగుణంగా ఈక్విటీని విక్రయించడానికి సిద్ధం కావాలని ప్రభుత్వం ఈ బ్యాంకులన్నింటికీ తెలియ జేసింది. ఈబ్యాంకులు తమ మార్కెట్ విలువ పెంచుకోవడంలో ఇది సహాయ పడుతుంది.

ఎంపీఎస్ రాక పోవడం మార్కెట్‌కు తప్పుడు సందేశం పంపుతుందని సీనియర్అధికారి ఒకరు తెలిపారు. నాలుగు బ్యాంకుల్లో ప్రభుత్వం 90 శాతం వరకు వాటా కల్గివుంది. ప్రస్తుతం పంజాబ్ అండ్ సింథ్ బ్యాంక్‌లో పబ్లిక్ హోల్డింగ్ 98.25 శాతం, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 96.38 శాతం, యూకో బ్యాంక్ 95.39 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 93.8 శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 86.46 శాతం ప్రభుత్వం కలిగి ఉంది.

## వీడని సస్పెన్స్

(మొదటి పేజీ తరువాయి)

(లాల్ కృష్ణ) అద్వానీలు ఎన్నిసార్లు సీట్లు మార్చుకున్నారో కూడా చెప్పాలన్నారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ గురించి స్పష్టంగా ప్రస్తావించిన ఖర్గే, 'పార్టీలో ఎదిగి, ఆ తర్వాత దానిని విడిచిపెట్టిన' వ్యక్తుల వల్ల కాంగ్రెస్‌పై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రవహించే నదిలాంటిదని, కొందరు వ్యక్తులు దానిని విడిచిపెట్టడం వల్ల ప్రభావితం కాదన్నారు. అదే విధంగా ప్రధాని మోడీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిబిఐ, ఇడి లేదా ఇతర దర్యాప్తు సంస్థల ద్వారా అందరినీ భయపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు అని ఆరోపించారు. మోదీ, గత పిఎం మన్మోహన్‌సింగ్ పాలనపై ప్రస్తావిస్తూ... గతంలో పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్ ఎప్పుడైనా మంగళసూత్రాలను లాక్కోవడం గురించి మాట్లాడడం విన్నారా అని అడిగారు. అతను ఎవరి గురించైనా చెడుగా మాట్లాడారా అని ప్రశ్నించారు. మన్మోహన్‌సింగ్ ప్రకటన చేస్తే అది ప్రపంచం వ్యాప్తంగా ప్రచురణ అవుతుందని, కానీ మోదీ మాటలకు విశ్వసనీయతే లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లింలను మభ్యపెట్టేలా ఉందని ప్రధాని మోదీ చేసిన ఆరోపణపై ప్రశ్నించిన ఖర్గే, యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల వరకు అందరికీ హామీలు ఇచ్చే పత్రంగా పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని కాపాడడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమ్మేని ఖర్గే పేర్కొన్నారు.

## కలిసి పనిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సహకారం అందించాలని, అందుకు ఇతర రాజకీయ ప్రతిపాదనలు కూడా సిపిఐ(ఎం) నాయకుల ముందు పెట్టామని వివరించారు. స్థూలంగా ఇండియా కూటమి గెలువాలని, బిజెపి ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు సిపిఐ(ఎం) నాయకులు అంగీకరించారన్నారు. స్థానికంగా కొన్ని ప్రత్యేక పరిస్థితులతో కొన్ని అంశాలలో భిన్నభ్రిప్రాయాలు ఉన్నప్పటికీ, రాబోయే ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు, బిజెపిని ఓడించేందుకు అన్ని రకాలుగా కలిసి ముందుకెళ్తామని సిపిఐ(ఎం) , కాంగ్రెస్ నిర్ణయించుకున్నదని చెప్పారు. ఒక ట్రెండు అంశాల్లో సందిగ్ధత ఉన్నప్పటికీ అధిష్టానంతో చర్చించి రేపటిలోగా ఏకాభిప్రాయానికి వస్తామన్నారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ భువనగిరి ఎంపి పోటీ అంశంలో సందిగ్ధత ఉన్నప్పటికీ మిగతా 16 ఎంపి స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతునివ్వాలని, ఆ పార్టీని గెలిపించాలని తాము నిర్ణయం తీసుకున్నామని అన్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ అంశంలో మార్పు జరగాలంటే, జాతీయ, రాష్ట్ర కమిటీతో చర్చించాల్సి ఉంటుందని, ఆ తర్వాత తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని ఆయన తెలిపారు.

## రాజ్యాంగాన్ని మార్చడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

అధికంగా ఉండే వల్సాద్ జిల్లాలోని ధరంపూర్ గ్రామంలో జరిగిన బహిరంగ ర్యాలీలో ప్రియాంక పాల్గొని మాట్లాడారు. బిజెపి నాయకులు మొదటిగా వారు ఏం చేయాలనుకుంటున్నారో వాటిని తిరస్కరిస్తారని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేస్తారని విమర్శించారు. అయితే ఇప్పుడు సామాన్య ప్రజలను నిర్వీర్యం చేసేలా రాజ్యాంగాన్ని మార్చాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ 'సూపర్‌మ్యాన్' తరహాలో రంగ ప్రవేశం చేస్తారని, ఆయనను 'మెహంగాయ్' (ద్రవ్యోల్బణం)' వ్యక్తిగా గుర్తుంచుకోవాలని ప్రజలకు సూచించారు. బిజెపి నాయకులు ప్రధానమంత్రిని శక్తివంతంగా అభివర్ణిస్తారని, వేళ్లతోనే రష్యా–ఉక్రేయిన్ యుద్ధాన్ని ఆపగలుగుతారని అంటారని, అలాంటప్పుడు పేదరికాన్ని ఎందుకు నిర్మూలించలేకపోతున్నారని ప్రశ్నించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, తక్కువ వేతనాలు, భూమిని కోల్పోవడం, మహిళలపై హింస, ఇతర అఘాయిత్యాల వంటి సమస్యల కారణంగా మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో, దేశంలోని గిరిజన జనాభా ఇబ్బంది పడుతున్నారని ప్రియంకా ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన జనాభా ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రస్తావించామన్నారు. తమ పార్టీ పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధిహామీ లాంటి పథకాన్ని తీసుకువస్తుందని హామీనిచ్చారు. దాదాపు 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి, మత్స్యకారులకు సబ్సిడీ డీజిల్ అందించడానికి, కనీస వేతనం రూ. 400, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల కోసం సబ్ ప్లాన్ రూపొందించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆమె అన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక బడ్జెట్, గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించేందుకు కూడా సిద్ధంగా ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల కారణంగానే ప్రధాని మోదీ ఎల్‌పిజి సిలిండర్ల ధరలను తగ్గించారని, ఆయనకు ప్రజలపై ఎలాంటి సానుభూతి లేదని మండిపడ్డారు. విద్య, ఆరోగ్యం, ద్రవ్యోల్బణం గురించి ప్రధాని మోదీ ఎప్పుడూ మాట్లాడరన్నారు. మరో ఐదేళ్ల వరకు ప్రజలు దీనిని సహించగలరని తాను అనుకోవడం లేదన్నారు. ప్రధానమంత్రి ప్రజలకు ఉపాధి లేదా తాగునీరు ఇవ్వలేకపోతే చర్చలు అర్థరహితమని ఆమె అన్నారు. అబద్ధాలు మాట్లాడే మన దేశానికి మొదటి ప్రధాని ఆయనేనని, తన తల్లి, అమ్మమ్మ, తాత, సోదరుడు (రాహుల్ గాంధీ), తన భర్త ఇలా తమ కుటుంబం మొత్తాన్ని దుర్భాషలాడారన్నారు.

## చీకటి ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ సమాధానం చెప్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ కలిపి 400ల సీట్లు వస్తే దేశానికి, రాష్ట్రానికి ఏం చేస్తారో విధానపత్రాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలకు ఆస్తులను కూడబెడితే, వాటిని మోదీ ప్రభుత్వం పల్లి బఠానీల తర హా అమ్మేస్తోందని, ఇటువంటి విధానాలను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

### ఈటలవి చిలుక పలుకులు...

భూములు అమ్మి రుణమాఫీ చేయొద్దని ఈటల చిలుక పలుకులు పలుకుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ చుట్టు ఉన్న భూములను ఆక్రమించుకుటున్న సమయంలో ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్నారని, అప్పుడు ఆయన ఏం చేశారని నిలదీశారు. భూముల ఆక్రమణ చేశారని, కెటిఆర్, ఈటల రాజేందర్ పరస్పరం ఆరోపణలు చేసుకున్న విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు. రేతులకు రుణమాఫీ చేయొద్దా, ఉన్న భూములను 'మీరే' ఆక్రమించుకుంటారా? అని ఈటలను నిలదీశారు. రైతులకు రుణమాఫీ చేయొద్దా? భూములు మీరే ఆక్రమించుకంపటారా? అని దుయ్యబట్టారు.

### బిసి జనాభా లెక్క చారిత్రక అవసరం

బిసిల జనాభాను లెక్క కట్టడం చారిత్రక అవసరమని సిఎంరేవంత్ రెడ్డి అన్నారు. బిసి, ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేయబోమని మోదీ, అమిత్‌షా ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. మోదీ, అమిత్‌షా రిజర్వేషన్లను రద్దు చేయబోమని, జానాభా ధమాషా ప్రకారం మాట్లాడడం లేదని తెలిపారు. జనాభాను లెక్కించినప్పుడే 50 శాతానికి మంచిన రిజర్వేషన్లను అమలు చేసేందుకు అవకాశం ఉన్నదని కోర్ట్ చెబుతుందని వివరించారు. బిసి జనాభాను లెక్కించకుండానే అన్ని రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు.

### రుణామాఫీపై ప్రణాళిక ఉన్నది

పంద్రాగాస్టులోపు పెద్దమ్మ సాక్షిగా రుణమాఫీ చేస్తామని,ఇందుకు తన వద్ద ఒక్క ప్రణాళిక ఉన్నదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమకు ఆర్థిక ప్రణాళిక ఉన్నదదని, రుణమాఫీని పకడ్బందీగా అమలు చేస్తామని వివరించారు.దోపిడీ చేయకుండా ఉంటే రుణమాఫీ జరుగుతుందన్నారు. రైతులు పండిం ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రుణమాఫీ చేస్తామని గతంలో కెసిఆర్ ప్రకటించారని, కెసిఆర్ లాంటి చరిత్ర తనది కాదన్నారు.

### ఇండియా కూటమికి దక్షిణాదిలో వంద సీట్లు

దక్షిణాది నుండి వందకు పైగా ఇండియా కూటమి సీట్లు వస్తాయని, కెసిఆర్ తరహాలనే మోదీ ఓటమిని అంగీకరించబోతున్నారిన, గతంలో కెసిఆర్ ఇలాగే చెప్పారని, ఇప్పుడు మోదీ అలాగే చెబుతున్నారన్నారు. ఎవరి ఆస్తులను ఎవరు తీసుకోలేరని, రాజ్యాంగం రక్షణ ఉన్నదని తెలిపారు.

### రాహుల్, కాంగ్రెస్‌పై బిజెపి కుట్ర

రిజర్వేషన్ల రద్దు కుట్రను తిప్పకొట్టేందుకు కాంగ్రెస్, రాహుల్ గాంధీ ప్రయత్నిస్తుంటే, మరోవైపు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా కుట్ర చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ గెలిస్తే హిందూవుల తాళి పుస్తెలను, ఆస్తులను గుంజుకుంటారని, రెండు ఇండ్లు ఉంటే, ఒకటి గుంజుకుంటారని, విచక్షాణరహితంగా,బాద్యతాయుతంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.ఒప్పంద పత్రాలపై సంతకాలు లేకపోతే సొంత తండ్రి, సోదరుల నుండే ఆస్తులను తీసుకునేందుకు వీలు లేదని, భార్య ఆస్తిని భర్త తీసుకునే హక్కు లేదని ఇటీవల కోర్ట్ కూడా తీర్పు ఇచ్చిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎలాగైనా నాలుగువందల సీట్లు గెలిచేందుకు బిజెపి వికృత రాజకీయ క్రీడకు తెర లేపిందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని, దీనికిమోదీ,అమిత్‌షానే బాధ్యత వహించాలన్నారు.



# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## 30 లోక్‌సభ, 19 అసెంబ్లీ స్థానాల్లో సిపిఐ పోటీ



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా లోక్‌సభ, రెండు రాష్ట్రాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను సిపిఐ శనివారం విడుదల చేసింది. అదే విధంగా ఉత్తరప్రదేశ్‌లో ఒక అసెంబ్లీ స్థానంలో ఉప ఎన్నిక జరుగుతుండగా నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థిని కూడా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మొత్తం 30 పార్లమెంట్ స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, ఒడిశాలోని 11 శాసనభ స్థానాల్లో కూడా సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు.

### లోక్‌సభ ఎన్నికల బరిలో సిపిఐ అభ్యర్థులు – 2024

| రాష్ట్రం | సీట్ల సంఖ్య | నియోజకవర్గం పేరు | అభ్యర్థి పేరు |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 1 | గుంటూరు | జంగాల అజయ్‌కుమార్ |
| అస్సాం | 1 | లఖింపూర్ | ధీరిన్ కొసాహరి |
| బిహార్ | 1 | బిగుసారాయ్ | అవదేశ్‌కుమార్ రాయ్ |
| ఛత్తీస్ఘఢ్ | 1 | బస్తర్ (ఎస్‌టి) | పూల్‌సింగ్ కచ్‌లం |
| జార్ఖండ్ | 1 | చాత్ర | అర్జున్‌కుమార్ |
| | 2 | దుంక (ఎస్‌టి) | రాజేష్‌కుమార్ కిస్కు |
| | 3 | హజరీబాగ్ | అనిరుధ్‌కుమార్ |
| | 4 | లోహదఘ (ఎస్‌టి) | మహేంద్ర ఒరాన్ |
| కేరళ | 1 | మావిలిక్కారా (ఎస్‌సి) | సిఎ అరుణ్‌కుమార్ |
| | 2 | త్రిసూర్ | విఎస్ సునీల్‌కుమార్ |
| | 3 | తిరువనంతపురం | పణ్ణియన్ రవీంద్రన్ |
| | 4 | వయనాడ్ | అన్నీ రాజా (డబ్ల్యు) |
| మధ్యప్రదేశ్ | 1 | ఖార్గోన్ (ఎస్‌టి) | దేవీ సింగ్ నార్గవి |
| | 2 | సిద్ధి | సంజయ్‌కుమార్ నామ్‌డీ |
| | 3 | శహదోల్ (ఎస్‌టి) | సమర్ షా సింగ్ |
| మహారాష్ట్ర | 1 | పరభాని | రాజన్ రామచంద్ర క్షీర్‌సాగర్ |
| ఒడిశా | 1 | జగట్‌సింగ్‌పూర్ (ఎస్‌సి) | రమేశ్‌చంద్ర సేథి |
| పంజాబ్ | 1 | అమృత్‌సర్ | దస్వింగర్ కౌర్ (డబ్ల్యు) |
| | 2 | ఫరీద్‌కోట్ (ఎస్‌సి) | గురుచరణ్ సింగ్ మాన్ |
| | 3 | ఖాదూర్‌సాహిబ్ | గుర్దియాల్ సింగ్ |
| తమిళనాడు | 1 | తిరుప్పూర్ | కె.సుబ్బరాయన్ |
| | 2 | నాగపట్టిణం (ఎస్‌సి) | వి. సెల్వరాజ్ |
| ఉత్తర్‌ప్రదేశ్ | 1 | బాండ | రాంచంద్ర యాదవ్ సారాస్ |
| | 2 | దౌరాహ్రా | జనార్దన్ ప్రసాద్ మిశ్రా |
| | 3 | ఫైజాబాద్ | అరవింద్ సేన్ |
| | 4 | లాల్‌గంజ్ | గంగా డీన్ |
| | 5 | ఘోసి | వినోద్ రాయ్ |
| | 6 | రాబర్ట్స్‌గంజ్ (ఎస్‌సి) | అశోక్‌కుమార్ కనూజియా |
| పశ్చిమబెంగాల్ | 1 | ఘటాల్ | తపన్ గంగూలీ |
| | 2 | మేదినిపూర్ | బిప్లాబ్ భట్టా |

### అసెంబ్లీ ఎన్నికల బరిలో సిపిఐ అభ్యర్థులు – 2024

| రాష్ట్రం | సీట్ల సంఖ్య | నియోజకవర్గం పేరు | అభ్యర్థి పేరు |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 1 | అనంతపురం అర్బన్ | సి. జాఫర్ |
| | 2 | ఏలూరు | బండి వెంకటేశ్వరరావు |
| | 3 | కమలాపురం | గాలి చంద్ర |
| | 4 | పట్టికొండ | పి.రామచంద్రయ్య |
| | 5 | రాజంపేట్ | భుక్యా విశ్వనాథ నాయక్ |
| | 6 | తిరుపతి | పి. మురళి |
| | 7 | విజయవాడ వెస్ట్ | జి.కోటేశ్వరరావు |
| | 8 | విశాఖపట్నం వెస్ట్ | అత్తిలి విమల (డబ్ల్యు) |
| ఒడిస్సా | 1 | బాలికుడ – ఇరసమ | అభిజిత్ సాహు |
| | 2 | భువనేశ్వర్ నార్త్ | శంకర్‌సాన్ బారిక్ |
| | 3 | బ్రజారాజ్‌నగర్ | రమేశ్ సిహెచ్ త్రిపాటి |
| | 4 | ఛత్రపూర్ (ఎస్‌సి) | గురునాథ్ ప్రదాన్ |
| | 5 | కబీసూర్యానగర్ | ప్రబినా దాస్ |
| | 6 | నిమపాడ | మనోరంజన్ పరిద |
| | 7 | కాంటాబంజి | పందాబ్ బాయ్ |
| | 8 | లక్ష్మి పూర్ (ఎస్‌టి) | కుమార్ జాని |
| | 9 | నీలగిరి | అజయ్ పట్నాయక్ |
| | 10 | పారాదీప్ | జిన్మయి సహాని (డబ్ల్యు) |
| | 11 | సుందర్‌గర్ (ఎస్‌టి) | రాజేంద్రనాయక్ |
| ఉత్తర్‌ప్రదేశ్ ( ఉప ఎన్నిక) | 1 | దుద్ది (ఎస్‌టి) | దినేశ్‌కుమార్ గోండ్ |

## మూడుసార్లు గెలిచింది ఒక్కరే... ఈసారి గెలుపు ఎవరిదో ?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** చైతన్యపు ఖిల్లా, విప్లవోద్యమాల గుమ్మం ఖమ్మం విలక్షణ తీర్పులకు నిలయం. రాష్ట్ర, దేశ ప్రజల భావాలకు ఖమ్మంజిల్లా ప్రజల భావాలకు ప్రతి ఎన్నికలలోను తేడా కనిపిస్తుంది. అవి శాసనసభ ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా ఖమ్మం తీరు ఎప్పుడూ విలక్షణమే. ఖమ్మం పార్లమెంటుకు ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా ఒక్కరు మినహా మూడోసారి విజయం సాధించిన వారు లేకపోవడం గమనార్హం. తొలినాళ్లలో కమ్యూనిస్టులకు ఆ తర్వాత కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ప్రజలు 2009 నుండి ఒక్కోసారి ఒక్కో రకమైన తీర్పును ఇస్తూ ఉత్కంఠకు తావిస్తున్నారు. 18వ పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు ప్రధానంగా పోటీ పడుతుండగా బిజెపి అభ్యర్థి సైతం పోటీలో ఉన్నారు. 1952లో తొలిసారి జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకుడు టిబి విఠల్ రావు విజయం సాధించారు. 1957లోను ఆయన గెలుపొందారు. 1962, 1967, 1971లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తేళ్ల లక్ష్మి కాంతమ్మ హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. ఆ తర్వాత జలగం కొండలరావు, జలగం వెంగళరావు, రేణుకాచౌదరి, నామ నాగేశ్వరరావులు రెండేసి సార్లు ఖమ్మం పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. పివి రంగయ్య నాయుడు, తమ్మినేని వీరభద్రం, నాదెళ్ల భాస్కర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక్కోసారి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. లక్ష్మి కాంతమ్మ తర్వాత మూడు సార్లు విజయం సాధించిన వారు లేకపోవడం గమనార్హం. మూడోసారి ప్రయత్నం చేసిన రేణుకాచౌదరి 2009లోను, 2019లోను ఓటమి చెందింది. మూడోసారి విజయం సాధించ లేకపోయింది. 2009, 2019లో రెండుసార్లు పార్లమెంటుకు ఎన్నికైన నామ నాగేశ్వరరావు ఒకసారి టిడిపి పక్షాన, మరోసారి బిఆర్‌ఎస్ పక్షాన పోటీచేసి గెలుపొందారు. 2004లోను 2014లోను ఆయన ఓటమి చెందారు. ఇప్పుడు మూడోసారి పార్లమెంటుకు ఎన్నికయ్యేందుకు ఆయన మరోసారి బరిలో నిలిచారు. బిఆర్‌ఎస్ పక్షాన నామ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నుంచి రామసహాయం రఘురాంరెడ్డి, బిజెపి నుంచి తాండ్ర వినోద్‌రావు పోటీ పడుతున్నారు. నామాకు అజాతశత్రువుగా పేరుంది. ఎక్కడ, ఎప్పుడు వివాదాలకు తావివ్వని రీతిలో వ్యవహరిస్తుంటారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి సనాతన కాంగ్రెస్ కుటుంబానికి చెందిన వారు. తండ్రి సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యునిగా, శాసన సభ్యునిగా పనిచేశారు.




ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో జన్మించిన రఘురాంరెడ్డి హైదరాబాద్‌లో స్థిర పడడంతో కొందరు ఆయనను నాన్ లోకల్‌గా ప్రచారం చేస్తున్నారు. ఓడిపోయి క్లిష్ట దశలో బిఆర్‌ఎస్ ఉండగా ఖమ్మం పార్లమెంటు పరిధిలోని ఆరు శాసన సభ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ శాసన సభ్యులు ఉండడం, మరోచోట కాంగ్రెస్‌ను బలపరుస్తున్న సిపిఐ శాసన సభ్యులు ఉండడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అంశం.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కూనంనేని కొత్తగూడెంకు ప్రాతినిథ్యం వహిస్తుండగా రాష్ట్ర మంత్రి వర్గంలో ఆర్థిక, విద్యుత్ శాఖను నిర్వహిస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిథ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజక వర్గాలు ఈ పార్లమెంటు పరిధిలోనే ఉన్నాయి. రఘురాంరెడ్డి మంత్రి పొంగులేటికి స్వయనా వియ్యంకుడు కావడంతో కాంగ్రెస్ గెలుపు నల్లేరు మీద నడకే అని భావిస్తున్నారు. అయితే బిఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నీ తానుగా వ్యవహరిస్తున్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఖమ్మం ప్రజలు ఎటువంటి తీర్పును ఇవ్వబోతున్నారన్నది వేచి చూడాల్సిందే. 14.26 లక్షల మంది ఓటర్లు ఉన్న ఖమ్మం నియోజక వర్గ ఓటర్లు మరోసారి విలక్షణ తీర్పును ఇస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

## బెంగళూరులో సగం మంది ఓటెందుకు వేయలేదు?

**న్యూఢిల్లీ:** దేశంలో లోక్‌సభ ఎన్నికల రెండో దశ పోలింగ్ శుక్రవారం ముగిసింది. 13 రాష్ట్రాల్లో 88 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం రెండో దశలో మొత్తం 68.49 శాతం ఓటింగ్ జరిగింది. ఇది గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే రెండు శాతం తక్కువ. అయితే కర్నాటక రాజధాని బెంగళూరులో దాదాపు సగం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు. కర్నాటకలోని 14 నియోజకవర్గాల్లో 69.23 శాతం ఓటింగ్ నమోదైంది. మీడియాకు అందిన వివరాల ప్రకారం బెంగళూరులోని మూడు అర్బన్ నియోజకవర్గాలు, బెంగళూరు సెంట్రల్, నార్త్, సౌత్‌లలో ఓటింగ్... రాష్ట్ర సగటు కంటే చాలా తక్కువగా ఉంది. సెంట్రల్‌లో 52.81 శాతం, నార్త్‌లో 54.76, సౌత్‌లో 53.70 శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎండ వేడిమి కారణంగా బెంగళూరులో సగం మంది తమ ఓటు హక్కు వినియోగించుకోలేదని విశ్లేషకులు చెబుతున్నారు. బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 67.29 శాతం ఓటింగ్ జరిగింది. మండ్యలో 81.48 శాతం, కోలార్‌లో 78.07 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపట్టింది. ఓటరు స్లిప్‌లలో క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్ చిరునామాను సులభంగా తెలుసుకోగలిగారు. ఎన్నికల సంఘం పోలింగ్ బూత్ వద్ద పార్కింగ్ సదుపాయాన్ని కూడా కల్పించింది. ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఓటరు హెల్ప్‌లైన్, 'నో యువర్ క్యాండిడేట్' యాప్‌లను అందుబాటులో ఉంచారు.

## గూగుల్‌లో రాజకీయ ప్రకటనల కోసం బిజెపి రూ.100 కోట్ల ఖర్చు

**న్యూఢిల్లీ:** గూగుల్, యూట్యూబ్‌లలో రాజకీయ ప్రకటనల కోసం బీజేపీ 100 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలుస్తోంది. గూగుల్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో డిజిటల్ ప్రకటనల ప్రచారానికి ఇంత మొత్తం ఖర్చు చేసిన మొదటి పార్టీ బీజేపీ మాత్రమే. ఈ మొత్తం 2018 మే 31 నుంచి 2024 ఏప్రిల్ 25 వరకు ఖర్చు చేసినట్లు గూగుల్ నివేదిక స్పష్టం చేసింది. ఈ ఖర్చు ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, డీఎంకే, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ 'ఐ ప్యాక్' ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువ. లోక్‌సభ ఎన్నికల వేళ గూగుల్‌లో ప్రచురించిన 2,17,992 రాజకీయ ప్రకటనలలో 1,61,000 ప్రకటనలు బీజేపీకి చెందినవే. దాదాపు 73 శాతం ప్రకటనలను బిజెపినే ఆక్రమించింది. ఒక్క కర్నాటకలోనే ప్రకటనల కోసం బీజేపీ రూ.10.8 కోట్లు ఖర్చు చేసింది. యూపీలో రూ.10.3 కోట్లు, రాజస్థాన్‌లో రూ.8.5 కోట్లు, దిల్లీలో రూ.7.6 కోట్లు ప్రకటనల కోసం బీజేపీ వెచ్చించింది. కాంగ్రెస్ రూ.45 కోట్లు, డీఎంకే రూ.42 కోట్లు ఖర్చు చేశాయి. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రూ.12 కోట్లు ఖర్చు చేసినా అధికారం దక్కించుకోలేకపోయింది. ఐపాక్ వైసీపీపై రూ.6.4 కోట్లు ఖర్చు చేసింది. తణమూల్ కాంగ్రెస్ మొత్తంగా రూ.4.8 కోట్లు ఖర్చు చేసింది. లోక్‌సభ రెండో దశలో గూగుల్ యాడ్స్‌లో బీజేపీ కంటే కాంగ్రెస్ ముందుంది. ఇప్పటి వరకు రూ.5.7 కోట్లు వరకు కాంగ్రెస్ ప్రకటనల కోసం ఖర్చు చేసింది. బీజేపీ రూ.5.3 కోట్లు ఖర్చు పెట్టగా, మూడో స్థానంలో ఉన్న వైసీపీ రూ.1.76 కోట్లు ఖర్చు చేసింది.

## ఒక్కో కాంగ్రెస్ కార్యకర్త..ఒక రఘురాంరెడ్డి కావాలి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఎన్నికల పోలింగ్‌కు 14రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున ఒక్కో కాంగ్రెస్ కార్యకర్త ఒక రఘురాంరెడ్డిగా ప్రజల్లోకి వెళ్లి కష్టపడిపనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివా రం ఖమ్మం రూరల్ మండలంలోని సత్యనారాయణపురంలో గల టిసివి రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సిపిఐ, సిపిఎం పార్టీలతో కలిసి కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రాంసహాయం రఘురాంరెడ్డి, సిపిఐ,సిపిఎం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ...ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని 10సంవత్సరాలు పాలించిన ఓ ప్రబుద్ధుడు 7లక్షల కోట్లు అప్పుచేసి ప్రజలపై భారం మోపాడన్నారు. అధికారాన్ని కేవలం తన స్వలాభం కోసం వాడుకుని లక్షల కోట్ల రూపాయాలను దండుకున్నాడని ధ్వజమెత్తారు. తనకు పదవి ఉన్నప్పుడు గుర్తుకు రాని ప్రజలు ఇప్పుడు గుర్తుకువచ్చి బస్సు యాత్రలు చేస్తుండటం సిగ్గు చేటన్నారు. తప్పకుండా ఈ ఎన్నికల తర్వాత బిఆర్‌ఎస్ పార్టీ ఇక తుప్పు సామాన్లకు వెలుతుందన్నారు. ప్రధాని మోడీ తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమి లేదని, కానీ మర ల కుల,మత రాజకీయాలను రెచ్చగొడుతూ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... మోడీ అంబానీ, అదానీల కోసం ప్రధానమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని తగ్గిస్తూ అబద్ధాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళల మంగళసూత్రాలు, లాక్కుంటారని అడ్డగోలు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. ఇప్పటికే దేశంలో మోడీ గ్రాఫ్ పడిపోయిందని, రాముడు, అయోధ్య పేరు చెప్పిన ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. అనూహ్యంగా ఇండియా కూటమికి దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఓటమి భయం తోనే ఇష్టానుసారంగా అబద్ధాలాడుతున్నారన్నారు. శ్రీ శైలానికి బొక్క పెట్టి నీటిని తోడుకుపోతుంటే మిన్నకుండి పోవడమే కాకుండా ప్రాజెక్టులను ధ్వంసం చేసి పిచ్చి పిచ్చి ప్రేలాపనలు చేయడం మానుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ...తనపై మాజీ ముఖ్యమంత్రి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మొద్దన్నారు. మీకు గడీల పాలన కావాలో లేక ప్రజల పాలన కావాలో తేల్చుకోవాలని పరోక్షంగా నన్ను విమర్శిస్తున్నారన్నారు.

ఖమ్మం జిల్లా ప్రజలు నన్ను మనుస్ఫూర్తిగా ఆశీర్వదిస్తే తన జీవితాన్ని వారికే అంకితం చేస్తానన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ...బిజెపి మరో మా రు అధికారంలోకి వస్తే దేశం విధ్వంసం అవుతుందన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు అధికారాన్ని చేజిక్కించుకుని, దేశ సంపదను కొల్లగొట్టారన్నారు.



ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, ఖమ్మం జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువాళ్ళ దుర్గాప్రసాద్, పాలేరు నియోజకవర్గ పరిశీలకులు,పిసిసి సభ్యులు అశోక్‌గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, పిడమర్తి రవి, సాధు రమేష్‌రెడ్డి, మద్ది మల్లారెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, మద్ది కిషోర్‌రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, యువజనకాంగ్రెస్ నాయకులు తమ్మినేని నవీన్, టిపిసిసి రాష్ట్ర కోకన్వీనర్ ధరావత్ రామ్మూర్తినాయక్, తిరుమలాయపాలెం జడ్‌పి టిసి బెల్లం శ్రీను, ఎంపిపి బోడ మంగీలాల్, నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య, సిపిఎం నాయకులు యర్రా శ్రీకాంత్, విక్రమ్, జబ్బార్, నవీన్‌రెడ్డి, మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, పెరుమాళ్లపల్లి మోహన్‌రావులు పాల్గొన్నారు.

## త్రిముఖ పోటీలో గెలుపు ఎవరిది?







**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులు వ్యూహ ప్రతి వ్యూహాలతో పావులు కదుపుతున్న పరిస్థితి ఉంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిలో హుస్నాబాద్, మానకొండూరు, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. బిఆర్‌ఎస్ పార్టీ నుండి ఎంపి ఎన్నికలలో పోటీ చేస్తున్న వినోద్ కుమార్ గతంలో కరీంనగర్ ఎంపిగా పనిచేశారు. కరీంనగర్ ఎంపిగా వున్న బండి సంజయ్ కుమార్ మరోమారు బిజెపి అభ్యర్థి గా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు బరిలో ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో నాలుగు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎంఎల్‌ఎ లుగా గెలుపొందగా, మరో మూడు నియోజకవర్గాల్లో తనపట్టు నిరూపించుకుంటుందా చూడాల్సిందే మరి. బిఆర్‌ఎస్ పార్టీకి ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందగా, ఇటీవల కాలంలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి చోటామోటా నాయకులు పార్టీలు మారడంతో మరో నాలుగు నియోజకవర్గాల్లో తన పట్టు ఉంటుందా చూడాలి. పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో బిజెపి నుండి ఒక ఎంఎల్‌ఎ అభ్యర్థి లేకపోయినప్పటికీ బండి సంజయ్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ, బిఆర్‌ఎస్ పార్టీలను ఎలా తట్టుకుంటాడో చూడాలి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రకటించడంలో జాప్యం కావడంతో పార్టీ నాయకులు కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించలేదు. ప్రచారంలో వెనుకబడి వుంది. ఏది ఏమైనా జూన్ 4 న ముగ్గురి అభ్యర్థుల భవిష్యత్తు బయటపడనుంది. త్రిముఖ పోటీలో గెలుపు ఎవరిదో?

## ఆ పార్టీకి ఓట్లడిగే అర్హత లేదు

### మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి ఓట్లు అడిగే అర్హత లేదని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం హన్మకొండలోని ఆయన స్వగృహంలో వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి ఏర్పాటైన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే గుడ్డిగా వ్యతిరేకించి తెలంగాణ ఉద్యమాన్ని అవహేళన చేసిన మోదీ ఏ మొఖం పెట్టుకుని ఇక్కడ ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చకుండా, ఏ ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుం డా, పరిశ్రమలు, జాతీయ వైద్య, విద్య సంస్థలు నెలకొల్పకుండా తీరని ద్రోహం చేసిన మోదీని, బిజెపిని తెలంగాణ ప్రజలు తరిమి కొట్టాలని అన్నారు. గడిచిన పదేళ్ల మోదీ హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులు, లౌకికత్వం, సామాజిక న్యాయం వంటి అంశాల్లో అనేక సవాళ్లు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక సార్వభౌమ త్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఓటుతో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బద్ధంగా రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రాంతీయ పార్టీలను విచ్చిన్నం చేసే విధంగా ప్రయత్నాలు చేసి ఆ రాష్ట్రాల్లో అధికారాని కి రావడానికి బిజెపి కుంట్రలు చేసిందన్నారు. దళితులు, మైనారిటీలపై మూకదాడులు విపరీతంగా బిజెపి పాలనలో పెరిగాయన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఇడి, సిబిఐ, ఇన్‌కంటాక్స్ దాడులు చేయించి అక్రమంగా కేసులు బనాయించి జైల్లోకి నెట్టేస్తుందన్నారు. ఈసారి అధికారం ఇస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం ప్రైవేటుపరం అయ్యాయని అన్ని రంగాలు ..రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానయానాలు, బ్యాంకింగ్, టెలికాం రంగాలన్నీ ప్రయివేటీకరణ చేస్తున్నారన్నారు. కాగా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద క్రిష్ణ బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రచారకర్తగా మాట్లాడుతున్నాడని, ఎన్నికల తరువాత ఆయన పశ్చాత్తాపపడి తనను క్షమాపణ కోరతాడని అన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఖచ్చితంగా బిజెపి, బిఆర్‌ఎస్‌లను ఓడించి కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించి తీరుతారన్నారు




## దేశంలో బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ఎజండా

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శ



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అందుకే ఆ పార్టీని ఓడించాలి, ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే తప్పక భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం జనగామలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ జరిగింది. అంతకు ముందు కాంగ్రెస్ కార్యాలయం నుండి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ యువకులకు అవకాశం ఇస్తున్నాడన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోమటిరెడ్డి కుటుంభం అండ ఉందని, జనగామలో భారీ మెజార్టీ ఇవ్వాలన్నా రు. గతంలో ఐదేండ్లు ఎంపిగా పనిచేసిన బిజెపి అభ్యర్థి ఏం వెలగబెట్టాడని మండిపడ్డారు. దేశంలో బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను కొనసాగిస్తుందని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు రిజర్వేషన్లు రద్దుచేయడం ఖాయమన్నారు. కులం, మతం పేరుతో ప్రజల్ని విభజిస్తున్నారని, దాడులు చేస్తున్నారన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించడం కోసం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎంతో కష్టపడుతున్నాడన్నారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ దోచుకొని దాచుకోవడంతోనే ఆ పార్టీని ఇంటికి పంపారని అదే తరహాలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్న మోదీని ఇంటికి పంపాలన్నారు. భువనగిరి పార్లమెంట్‌లోనే కాంగ్రెస్ బలం, బలగం ఉన్న ప్రాంతం జనగామ అన్నారు. మునుగోడు ఎంఎల్‌ఎ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి కాబోయే ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డియే అన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా కాంగ్రెస్ గెలుపు ఖాయమని, కార్యకర్తలు అందరు కష్టపడి ఒకే కుటుంబంగా పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలన్నారు. మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ దేశంలోని మోదీ సర్కారు రైతులు ఆందోళనలు చేస్తే వెయ్యి మందిని చంపిందని, కార్మిక చట్టాలను హరించిందని మండిపడ్డారు. దేశ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తుందన్నారు. అలాంటి వారిని ఓటు వేయొద్దని, కేంద్రంలో ఇండియా కూటమిని గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిది దొంగ గెలుపన్నారు. జనగామలో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీ రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి నాగపురి రాజలింగం, టిపిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులురాలు భవనారెడ్డి, వై సుధాకర్, లింగాజీ, కంచె రాములు, మేడ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగా కళ్యాణి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# తెలుసుకుందాం

## విశ్వంలో జీవం ఉనికి?



విశ్వంలో మరెక్కడైనా జీవులు ఉన్నాయా? ఉంటే.. అవి కూడా భూగోళంలోని జీవజాలం మాదిరి ఉంటాయా? లేక మరేదైనా రూపంలో కనిపిస్తాయా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం కనుక్కోవడానికి శాస్త్రవేత్తలు నిరంతరం ప్రయత్నిస్తునే ఉన్నారు. అమెరికా అంతరిక్ష కేంద్రం 'నాసా' అత్యంత శక్తివంతమైన 'జేమ్స్ వెబ్' టెలిస్కోప్‌ను అంతరిక్షంలోకి పంపిన తర్వాత, దాని ద్వారా భూమికి చేరుతున్న ఫొటోలు ఆసక్తిని రేపుతున్నాయి. జీవ ఉనికి విశ్వంలో ఎక్కడో ఒకచోట ఉంటుందని చాలామంది శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇంతకీ జీవుల గురించి తెలిపే శాస్త్రం ఏమిటి? 'జీవ శాస్త్రం'. ఈ శాస్త్రానికి కొన్ని వేల ఏళ్ల చరిత్ర వుంది. జంతువులని వేటాడి పొట్టపోసుకోవడం నేర్చిన మానవుడికి జంతు శరీరం నిర్మాణం గురించి తెలియకపోలేదు. తన శరీరానికి ఏవో వ్యాధులు సోకుతాయని గుర్తించిన మానవుడు, వాటి నివారణ కోసం ఏదో ఒక రకమైన వైద్యాన్ని ఎప్పుడో కనిపెట్టి ఉంటాడు. కాని అతినెమ్మదిగా, అనిశ్చితంగా సహస్రాబ్దాల పాటు పురోగమించిన జీవశాస్త్రంలో కొన్ని శతాబ్దాల క్రితం ఓ విప్లవం మొదలైంది. గెలీలియో తదితరులు సాధించిన ఆధునిక వైజ్ఞానిక విప్లవం వల్ల భౌతిక శాస్త్రం మాత్రమే కాక, జీవశాస్త్రం కూడా వేగంగా పురోగమించింది. శాస్త్రీయ పద్ధతులతో చేసిన అధ్యయనాల వల్ల క్రమంగా దేహనిర్మాణ శాస్త్రం, జీవక్రియాశాస్త్రం, కణ శాస్త్రం, మొదలైన ముఖ్యమైన జీవశాస్త్ర రంగాలు ఊపిరి పోసుకున్నాయి. సమస్త జీవరాశిని భగవంతుడు సృష్టించాడు అనే భావం నుంచి, కొన్ని కోట్ల సంవత్సరాలు సాగిన జీవపరిణామం వల్లే జీవరాశులు ఏర్పడ్డాయనే భావనకు ఈ అధ్యయనం ఊపిరి పోసింది. విప్లవాత్మక మార్పులకు రాచబాట వేసింది. దీని ఆధారంగానే విశ్వంలో జీవం ఉనికి కోసం అన్వేషణ కొనసాగుతున్నది.

## సీతాకోక చిలుక ఘన చరిత్ర



సీతాకోక చిలుకలు అందానికే కాదు.. జీవ పరిణామ చరిత్రకు కూడా ఆనవాళ్లని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ యార్క్, హార్వర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల తాజా పరిశోధనల్లో స్పష్టమైంది. సుమారు 200,000 సంవత్సరాల క్రితం సంతానోత్పత్తి చేసిన రెండు జాతుల ద్వారా ఏర్పడిన జాతిగా అమెజోనియన్ సీతాకోకచిలుకను ఈ శాస్త్రవేత్తల బృందం నిర్ధారించింది. జీవజాతులు తరచు ఎన్నో మార్పులకు లోనవుతాయి. ఇప్పుడు మనం చూస్తున్న వివిధ రకాల జీవజాలం మూలాలు కొన్ని వేలు, లక్షల సంవత్సరాలంటే ఆశ్చర్యం కలగక మానదు. కానీ, ఇది అక్షర సత్యం. సైన్స్ సిద్ధాంతాలను అనుసరించి, ఒక కొత్త జాతి ఏర్పడడానికి జరిగే ప్రక్రియ కొన్ని లక్షల సంవత్సరాల సమయం పడుతుంది. దీనిని 'హైబ్రిడ స్పెసియేషన్' ప్రక్రియ అంటారు. అయితే, జన్యుపరంగా భిన్నమైన పూర్తిగా కొత్త జాతి ఏర్పడటానికి కారణమైందని శాస్త్రవేత్తలు నిరూపించడం చాలా కష్టం. సరైన వివరాలుగానీ, సాక్ష్యాలు గానీ లభించవు. చాలా వరకూ శిలాజాల ఆధారంగా కొంత మేర అవగాహన ఏర్పరచుకుంటారు. ప్రస్తుతం మన చూస్తున్న సీతాకోక చిలుకలు హెలికోనియస్ మెల్పోమెన్, హెలికోనియస్ పార్డలినస్ జాతులకు చెందినవి. ఈ జాతుల మూలాలను శాస్త్రవేత్త బృందం గుర్తించింది. అమెజాన్‌లోని ప్రకాశవంతమైన రంగుల హెలికోనియస్ సీతాకోకచిలుకలలో హైబ్రిడ్ జాతికి ఉదాహరణను కనుగొంది. జీవ పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయడంలో ఈ పరిశోధన కొత్తదారులను చూపుతుందని అంటున్నారు.

## వై-ఫై అంటే ఏమిటి?

నేటి సమాజంలో వైఫై పాత్ర కీలకం. వైర్లెస్ వ్యవస్థలైన వీటి ద్వారా సమాచారాన్ని వేగవంతంగా షేర్ చేసుకోవచ్చు. రెండు డివైజ్‌ల మధ్య నిర్ణీత దూరం వరకు వైర్ల సాయం లేకుండా సమాచారాన్ని షేర్ చేస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని 'బ్లూటూత్' అంటాం. ఇది పరిమిత స్థాయిలో పనిచేస్తుంది. వైఫై విషయానికొస్తే.. ఈ వ్యవస్థ సామర్థ్యాన్ని బట్టి చేరువలో ఉన్న ఎన్ని పరికరాలనైనా కనెక్ట్ చేసుకోవచ్చు. వైఫై పద్ధతిలో పరికరాల మధ్య సమాచారాన్ని మరింత వేగవంతంగా షేర్ చేసుకోవచ్చు. వైఫై కనెక్టివిటీ గురించి పలు ఆసక్తికర వాస్తవాలు. వైర్లెస్ ఫిడిలిటీని సూక్ష్మంగా వైఫై అంటారు. ఇది కనిపించని తాడు లాంటిది. ఈ వ్యవస్థ మీ కంప్యూటర్ లేదా స్మార్ట్‌ఫోన్‌ను ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేస్తుంది. వైఫై టెక్నాలజీ రూపకల్పనకు అవసరమైన సాంకేతికతను హెడీ లామర్ర్ కనుగొన్నాడు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు అన్ని ప్రముఖ హోటళ్లు ఉచితంగా వైఫైను అందిస్తున్నాయి. అయితే ఈ వైఫై పరిధి వంద మెగా బైట్లు మాత్రమే. హోమ్ వైఫై బలహీనంగా ఉంటే ఓ వైర్లెస్ రిపీటర్‌ను కొనుగోలు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. వైఫై రేడియో సిగ్నల్స్ ఆధారంగా స్పందిస్తుంది. వైఫై పరిధిలో సెక్యూరిటీ కోడ్ నిబంధన లేనట్లయితే ఏ వైఫై ఆధారిత పరికరమైనా ఇంటర్నెట్ సౌకర్యాన్ని పొందొచ్చు. వైఫై వ్యవస్థను 24 గిగాహెర్ట్జ్ నుంచి 5 గిగా హెర్ట్జ్ వరకు ఫ్రీక్వెన్సీ రేంజ్ గల రేడియో తరంగాలను వినియోగిస్తారు.

## ఎలా పని చేస్తుంది?



ఇప్పుడైతే గూగుల్ మ్యాప్‌లు.. ప్లేస్ ట్రాక్టర్‌లు ఉన్నాయి గానీ, ఒకప్పుడు బాటసారులకు, నావికులు, యాత్రికులకు ఉత్తర, దక్షిణ దిక్కులను చూపించే 'దిక్సూచి' (compass) ఒక్కటే దిక్కు. ఆ రోజుల్లో అదో అద్భుత ఆవిష్కరణ. ముఖ్యంగా నావికులు ఇప్పటికీ దిక్సూచిని వాడుతున్నారంటే, దీని విలువ ఏమిటో అర్థమవుతుంది. ఇంతకీ, ఇది ఎలా పని చేస్తుందో తెలుసా? భూమి అయస్కాంత క్షేత్రంవల్లనే దిక్సూచి పనిచేస్తుంది. ఈ దిక్సూచిలో అయస్కాంతీకరించిన, సులువుగా తిరగగలిగే ఉక్కు ముల్లు ఉంటుంది. దీని అడుగు భాగం పారదర్శకంగా ఉంటుంది. దాని డయల్ కదిలేంచుదుకు అనువుగా ఉంటుంది. ఉత్తరం, దక్షిణం, తూర్పు పడమరలను గుర్తించేందుకు వీలుగా దిక్సూచిపై ఎన్, ఎస్, ఇ, డబ్ల్యు అనే గుర్తులు ఉంటాయి. డయల్ మీద నంబర్లు ఉంటాయి. అవి వృత్తాన్ని కొలిచేందుకు అనువైన డిగ్రీలు. వృత్తంలో 360 డిగ్రీలు ఉంటాయి. దిక్సూచిలోని సూది పారదర్శకమైన ద్రవంలో కదులుతూ ఉంటుంది. ఈ ద్రవపదార్థం సూది త్వరగా ఆగేందుకు ఉపయోగపడుతుంది. దిక్సూచిలోని సూది సాధారణంగా ఎర్రగా ఉంటుంది. అది ఉత్తర దిక్కును సూచిస్తుంది. దిక్సూచిలోని ముల్లు అయస్కాంత ఉత్తర దిశను సూచిస్తుంది. దాని ఆధారంగా మనం ఉత్తర దిశగా వెళ్లవచ్చు. దానికి పూర్తి వ్యతిరేక దిశను దక్షిణంగా అర్థం చేసుకోవచ్చు.

## విస్తరిస్తున్న హిమనదీయ సరస్సులు



హిమనదీయ సరస్సులు 27 శాతం విస్తరించాయి. ఉపగ్రహ చిత్రాలను అనుసరించి, ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిణామాలు తీవ్ర పర్యావరణ మార్పులకు కారణమవుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైనప్పటి నుంచి, ప్రపంచవ్యాప్తంగా హిమానీ నదాలు తిరోగమనం ప్రారంభమైంది. హిమాలయ ప్రాంతంలో కొత్త సరస్సులు ఏర్పడడానికి ఈ మార్పులే కారణం. హిమానీ నదాలు కరగడం ద్వారా ఏర్పడిన ఈ నీటి సరస్సులను హిమనదీయ సరస్సులు అంటారు. వాటి నిర్మాణ ప్రక్రియలను అనుసరించి, వీటిని నాలుగు రకాలు (మొరైన్‌డ్యామ్డ్ /మొరైన్ ద్వారా ఆనకట్టబడిన నీరు, ఐస్‌డ్యామ్డ్/మంచుతో ఆనకట్టబడిన నీరు, ఎరోషన్ /కోత ద్వారా ఏర్పడిన డిప్రెషన్లలో నీరు ఆనకట్టబడింది, ఇతర హిమనదీయ సరస్సులు)గా వర్గీకరిస్తారు. ప్రస్తుతం 676 సరస్సులు విస్తరిస్తున్నట్టు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తున్నది. వీటిలో మొరైన్‌డ్యామ్డ్ సరస్సులు 307 ఉన్నాయి. 1984 నుండి 2023 వరకు భారతీయ హిమాలయ నదీ పరీవాహక ప్రాంతాలను కవర్ చేస్తూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) యొక్క దీర్ఘకాలిక ఉపగ్రహ చిత్రాలు హిమనదీయ సరస్సులలో గణనీయమైన మార్పులను చూపించాయి.

## ఇ-మెయిల్ పేరుకో చరిత్ర

ఈ రోజుల్లో ఇ మెయిల్ గురించి తెలియనివారుగానీ, ఉపయోగించని వారుగానీ లేరనడం అతిశయోక్తి కాదు. ఇంతకీ ఇ–మెయిల్ అనే పేరు ఎలా ఖరారైందో తెలుసా? ఇంగ్లీషులో వచ్చిచేరే కొత్తకొత్త పదాలకు విస్తృత అర్థాలతోపాటు పాత పదాల అంతరార్థాలనూ శోధించి, ప్రపంచానికి వెల్లడించే ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీ (ఒఇడి) చేసిన కొత్త పరిశోధనే నేడు అందరి జీవితాల్లో భాగమైంది. ఆ పదమే 'ఇ మెయిల్'. ఎలక్ట్రానిక్ మెయిల్ ప్రక్రియకు ఇ మెయిల్ షార్ట్ ఫామ్ అని అందరికీ తెలిసిందే. అయితే ఆ ఫామ్‌ని మొట్టమొదట ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ప్రయోగించారు అన్నది ప్రశ్న. ఆక్స్‌ఫర్డ్ శోధనను అనుసరించి, 1975లోనే ఎలక్ట్రానిక్ మెయిల్ అనే పదాన్ని గుర్తించినప్పటికీ దానికి షార్ట్ ఫామ్‌గా భావించే ఈ మెయిల్ మాత్రం 1979లో గానీ వెలుగులోకి వచ్చింది. 1979లో విడుదలైన కొటేషన్లు అంతకు ముందే మనుగడలో ఉన్న పదాలను వెలుగులోకి తెచ్చిందని 'యుఎస్ఎ టుడే' పేర్కొంది. అలా చూస్తే 'ఇ మెయిల్' అనే పదం 1979 కన్నా ముందే ఉండి ఉండాలి. అయితే, ప్రస్తుతానికి ఈ వివరాలు తెలియవు. ఒఇడి పరిశోధనలు ఎలాంటి వివరణ ఇస్తాయో చూడాలి.

సేకరణః బిఎస్ఎస్ మైత్రేయి

# ఓటింగ్ యంత్రాలకే 'సుప్రీం' ఓటు!

మానవ ప్రమేయమున్న ఓటింగ్ పద్ధతులకన్నా సాంకేతిక విజ్ఞానంతో పనిచేసే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లు కచ్చితత్వంలో, వేగంలో ఎప్పటికీ మేలే. మన దేశంలో ఎన్నికల వ్యవస్థలోకి 1982లో ప్రయోగాత్మకంగా ప్రవేశించిన ఇవిఎంలు స్వల్పకాలంలోనే బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లను అటకెక్కించి ఏకైక మార్గంగా స్థిరపడ్డా యి. అయితే వాటిలో నమోదైన ఓట్లను తారుమారుచేసే అవకాశముందన్న అనుమానాలూ ఇవిఎంలతోపాటే వ్యక్తంకాసాగాయి. యంత్రాలను పనిచేయించటంలో మనుష జోక్యానికున్న అవకాశమే అందుకు హేతువు. సాంకేతిక సమస్యలతో ఇవిఎంలు మొరాయించటం, ఒక గుర్తుకు వేసిన ఓటు వేరు గుర్తుకు పడటం, ఫలితాలు ఏకపక్షంగా ఒక పార్టీకి అనుకూలంగా రావటం వంటివి ఇవిఎంల పనితీరుపై అనుమానాలు పెంచాయి. తాను ఏ గుర్తుకు ఓటు వేశాడో అది కచ్చితంగా దానికే నమోదైనట్లు రూఢి చేసుకోవటం ఓటరు హక్కు. అది బ్యాలెట్ పత్రాల పద్ధతిలో తప్ప ఇవిఎం వినియోగంలో సాధ్యం కాదు. బ్యాలెట్ పత్రాల పద్ధతిలో ఎన్నో అక్రమాలు – పోలింగ్ కేంద్రాల స్వాధీనం, ఓట్ల రిగ్గింగ్, తమకు ఓటుచేయని దళితవాడలపై భూస్వామ్య, పెత్తందారీ ముఠాల దాడులు వగైరా దౌర్జన్య, హింసాకాండలను దేశం చూసింది. యంత్రాలను సందేహాలకు అతీతం చేసేందుకు గతంలోకూడా పలు విజ్ఞప్తులు సుప్రీంకోర్టుకు చేరాయి. వాటి పర్యవసానంగా, తానువేసిన గుర్తుకే ఓటు పడినట్లు ఓటరును సంతృప్తి పరిచే విధంగా వివిపాట్ (పేపరు స్లిప్) పద్ధతిని 2003లో

ప్రజాపక్షం
28-04-2024, ఆదివారం

సుప్రీంకోర్టు ఆదేశంపైనే ప్రవేశపెట్టారు. ఓటరు బటను నొక్కగానే కొద్ది సెకండ్లపాటు ఓటువేసిన గుర్తు స్క్రీన్‌పై కనిపిస్తుంది, పేపరు స్లిప్పు వస్తుంది. అవి సక్రమంగానే ఉన్నట్లు రుజువు పరిచే నిమిత్తం ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పోలింగ్ బూత్‌లను రాండమ్‌గా ఎంపికచేసి వాటిలో ఉపయోగించిన ఇవిఎంల నమోదును ముందుగా లెక్కించి, ఆ సంఖ్యలను వివిపాట్ స్లిప్పులతో సరిపోల్చే పద్ధతి అమలులోకి వచ్చింది. అయినా అనుమానాలు వెంటాడుతున్నందున బ్యాలెట్ పద్ధతికి తిరిగి వెళ్లాలని లేదా వివిపాట్ స్లిప్పులను నూరుశాతం లెక్కించేటట్లు ఆదేశించాలని అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫామ్స్ అనే సంస్థ ...అరుణ్ కుమార్ అగర్వాల్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లను సుప్రీంకోర్టు శుక్రవారం పరిష్కరించింది.

ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా విడివిడిగా తీర్పులు రాసినా పేపర్ బ్యాలెట్‌ను తిరస్కరిస్తూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సిస్టంలో ఉన్న అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ భద్రతలను ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు సమీక్షించారు. అవి లోపరహితంగా నిర్ధారించుకున్నారు. ఇతర తీవ్రమైన ఆందోళనల నివృత్తికిగాను కోర్టు ఎన్నికల కమిషన్‌కు రెండు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల గుర్తు లోడింగ్ యూనిట్లను వివిపాట్‌లలోకి సింబల్స్ లోడింగ్ పూర్తయిన తదుపరి సీలు చేయాలి. వాటిని ఫలితాలు ప్రకటించిన తదుపరి 45 రోజుల వరకు భద్రంగా, సురక్షితమైన కస్టడీలో ఉంచాలి. ఇది 2024 మే 1 నుండి ఆచరణలోకి రావాలి. ఓడిపోయిన అభ్యర్థుల్లో మొదటి ఇద్దరు 5 శాతం ఇవిఎంలలో మైక్రో కంట్రోలర్స్ తనిఖీని కోరవచ్చు. ఏదైనా టాంపరింగ్ జరిగితే తెలిసిపోతుంది. వివిపాట్‌ల ఓటరు స్లిప్పులను లెక్కించే "ఎలక్ట్రానిక్ యంత్రం" రూపొందించే అవకాశాన్ని పరిశీలించాలని కూడా సూచించింది.భవిష్యత్‌లో టెక్నాలజీ ఇంకా అధునాతన నం కావచ్చు. బార్‌కోడింగ్ కూడా రావచ్చు. సుప్రీంకోర్టు తాజా తీర్పు అనుమానాలన్నిటినీ నివృత్తి చేసి ఉండకపోవచ్చు. సాంకేతికంగా మరింత మెరుగుదల ఆవశ్యకతను గుర్తించింది. అయితే యంత్రాలకన్నా యంత్రాలు నిర్వహించే వారి నిజాయితీపట్ల సందేహాలనుంచే అనుమానాలు తలెత్తుతున్నాయి. కాబట్టి ఎన్నికల కమిషన్ తమ నిష్పాక్షికతను ప్రదర్శించటం ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఓటర్ల విశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

# ప్రత్యర్థులకు సింహస్వప్నంలా రేవంత్‌రెడ్డి ప్రచారం

నామినేషన్‌ల ప్రక్రియ గడువు ముగిసే సమయానికి రాష్ట్రంలో అన్ని పార్టీల అగ్ర నాయకులు ప్రచార రంగంలో కదం తొక్కుతున్నారు. అలుపెరుగకుండా తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కష్టపడుతున్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఉన్న ఎనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరుపున తురుపుముక్కగా తెలంగాణ అంతటా సుడిగాలిలా తిరుగుతున్నారు. నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుండే కొన్నిచోట్ల నామినేషన్‌ల కార్యక్రమంలో పాల్గొంటూ, మరికొన్ని చోట్ల ప్రచార సభల్లో పాల్గొంటూ, కాంగ్రెస్‌లో ఎన్నికల జోష్ నింపారు. ఒకవైపు బిఆర్ఎస్, బిజెపిలపై విరుచుకుపడుతూనే, మరోవైపు తమ స్వంత పార్టీ నాయకులను ఆకాశానికెత్తుతూ ఉత్సాహపరుస్తున్నారు. అదే కోవలో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీలో ఉన్న తన సన్నిహితుడైన చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచార సభలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిపై – సిఎం రేవంత్ రెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. తనతోపాటు ముఖ్యమంత్రి అయ్యే అర్హత కోమటిరెడ్డికే ఉందంటూ ఆయన కితాబు నివ్వడం అందరికీ ఒకింత ఆశ్చర్యం కలిగించింది. అంతకు కొద్ది రోజుల ముందే సిఎంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదేళ్ళు కొనసాగుతారని కోమటిరెడ్డి కూడా అన్నారు. ఒకప్పుడు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుకున్న ఈ నేతలు, పరస్పరం సమర్థతలను బహిరంగంగానే ప్రస్తుతించుకోవటం కాంగ్రెస్ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తమ నేతల్లో గ్రూపు విభేదాలు సమసిపోయాయనే సంకేతాలు వెళ్లాయి. అలాగే నిజామాబాద్ అభ్యర్థి జీవన్ రెడ్డి ప్రచార సభలో, ఆయన గెలిచి కేంద్రంలో వ్యవసాయ మంత్రి అవుతారని టిపిసిసి అధ్యక్షులు స్వయంగా ప్రకటించడం ద్వారా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి కంటే ప్రజల్లో కాంగ్రెస్‌ను ఒకడుగు ముందుంచారు. సికిందరాబాద్ ఎన్నికల ప్రచారంలో సైతం అభ్యర్థి దానం నాగేందర్ గెలిస్తే , కేంద్ర మంత్రి అవుతారనడం ద్వారా ఆషామాషీ అభ్యర్థి కాదనే సంకేతాలు పంపారు. ఇలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు రెండు నుండి మూడు సభలు, రోడ్ షోలు నిర్వహిస్తూ కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారాన్ని ఉచ్ఛ స్థితిలో ఉంచుతున్నారు. ఎన్నికల పోలింగ్ జరిగే మే 13 నాటికి మొత్తం 17 నియోజకవర్గాలకు కనీసం మూడు సార్లు వెళ్లేలా సిఎం ప్రచార ప్రణాళిక రూపొందించబడింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజు వివిధ వర్గాల నివేదికలు, సర్వేలను పరిశీలిస్తూ, ఎక్కడ లోటు పాట్లు ఉన్నాయో అప్పటికప్పుడు సంబంధింత పార్టీ నాయకులను అప్రమత్తం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోకి చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికలకు ముందు పార్టీని వీడిన అనేక మంది నాయకులు గాంధీ భవన్‌కు క్యూ కట్టారు. అధికారంలోకి వచ్చిన తదుపరి తొలి టిపిసిసి కార్యవర్గ సమావేశమే పార్టీ వీడిన వారిని తిరిగి రావాలని పిలుపునిచ్చింది. శాసనసభ ఎన్నికలకు చివరి నిమిషంలో పార్టీ నుండి ఇతర పార్టీలకు చేరిన వారిని తిరిగి చేర్చుకునే విషయంలో ఆరంభంలో కొంత మీన మేషాలు లెక్కబెట్టారు. అనేక సంవత్సరాలు పార్టీలో ఉండి, క్షణికావేశంలో పార్టీ వీడిన వారు చాలా మంది ఉన్నారని, వారి అనుబంధాన్ని మరవరాదనే అభిప్రాయంతో కాంగ్రెస్ చేరికల కమిటీ వేసి, అందులో మహేశ్‌కుమార్ గౌడ్, జగ్గారెడ్డి, కోదండరెడ్డి వంటి ఉద్దండ నేతలను సభ్యులుగా నియమించింది. దీంతో గాంధీభవన్ సందడిగా మారింది. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మానవతారాయ్ వంటి అనేక మంది స్వంత గూటిలోకి అడుగుపెట్టారు. మరికొందరు అదే బాటలో సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో బిజెపి పుంజుకుంటున్నదని, పలు చోట్ల రెండవ స్థానంలో ఉన్నదనే వార్తలతో రెండు వారాల కింద ఎఐసిసి సంస్థాగత ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ అకస్మాత్తుగా హైదరాబాద్ వచ్చి, ముఖ్యనేతలకు హితోపదేశం చేశారు. ఉత్తరాదిని బిజెపి పరిస్థితి బాగోలేదని, దక్షిణాదిలో ఆ పార్టీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వవద్దని 'మిషన్ 15' లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆయా నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు మంత్రులే బాధ్యులని చెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో మంత్రులంతా తమ జిల్లాలో నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌గా ఉన్న నియోజకవర్గాలలో ఎన్నికల బాధ్యతలను భుజాన వేసుకున్నారు. అలాగే ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సిపిఐ, సిపిఐ(ఎం) కార్యాలయాలకు ఉప

### రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పంపి కాంగ్రెస్‌కు మద్దతు కోరగా సానుకూల స్పందన లభించింది.

### సవాళ్ళ రాజకీయం

రాజకీయ ప్రచార సభల్లోనే సవాళ్ళ వేడి రాజుకుంది. ఆగస్టు 15 లోగా తమ ఎన్నికల వాగ్దానమైన రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేసారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతిస్పందిస్తూ ఒకవేళ అలా చేయలేకపోతే సిఎం పదవికి రాజీనామా చేస్తారా? అని సవాలు విసిరారు. సవాలును స్వీకరిస్తూనే, ఆగస్టు 15లోగా రుణమాఫీ ఖాయమని, అలా చేస్తే బిఆర్ఎస్‌ను కెసిఆర్ రద్దు చేయాలని, హరీశ్‌రావు రాజీనామా సిద్ధం చేసుకోవాలని ప్రతి సవాలు విసిరారు. దీనికి స్పందనగా హరీశ్ రావు మరో అంశాన్ని అదనంగా చేర్చి రుణమాఫీతో పాటు, ఆరు గ్యారంటీలను ఆగస్టు 15 కల్లా అమలు చేయాలనే షరతు పెడుతూ అమరవీరుల స్థూపం వద్ద రాజీనామా పత్రంతో డ్రామా చేశారు. కడుపుకొట్టుకోనైనా రుణమాఫీ చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి తన హామీని పునరుద్ఘాటన చేశారు.

### ప్రచార రంగంలోకి కెసిఆర్

బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ ఎన్నికల తరువాత వివిధ కారణాలతో విరామం తరువాత లోక్‌సభ ఎన్నికల ప్రచార రూపంలో జనంలోకి వెళ్తున్నారు. వచ్చే నెల 11 వరకు నిర్విరామ బస్సు యాత్ర పెట్టుకున్నారు. బస్సు యాత్రకు ముందు రోజు ఒక తెలుగు 24 గంటల న్యూస్ ఛానల్‌లో నాలుగు గంటల పాటు సుదీర్ఘ సమయం లైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పదేళ్ల క్రితం తెలంగాణ ఉద్యమ సమయంలో కెసిఆర్ నిత్యం టివి ఛానల్ లైవ్ కార్యక్రమాలలో పాల్గొని ప్రజలతో టెలిఫోన్ కాల్స్‌లో మాట్లాడుతూ ఉండేవారు. అప్పట్లో కెసిఆర్ లైవ్‌కు విపరీతమైన స్పందన, ఉభయ ప్రాంతాల నుండి అమితాసక్తితో భారీ వ్యూవర్‌షిప్ కూడా ఉండేది. రోజుల తరబడి చర్చనీయాంశంగా ఉండేలా ఆయన లైవ్ కార్యక్రమానికి ప్రాధాన్యత లభించేది.

తెలంగాణ ఏర్పడిన తరువాత స్వంత మీడియాలో లైవ్‌లో పాల్గొన్నప్పటికీ, అవి కొంత ఏకపక్షంగా సాగాయనే అభిప్రాయం. ప్రతిపక్షంలోకి వచ్చాక తొలిసారిగా ఇతర మీడియా ఛానల్‌కి కెసిఆర్ ప్రత్యక్ష ప్రసారం కోసం వెళ్ళడంతో అందరూ ఆసక్తిగా చూశారు. అయితే, సుదీర్ఘంగా లైవ్ సాగినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఇప్పటి వరకు చెప్పిన విషయాలే తప్ప, కొత్త అంశాలు లేవనే అభిప్రాయం నెలకొన్నది. గతంలో లాగా సంచలన విషయాలు లేకపోవడం కూడా నిరాశపరిచింది. మిర్యాలగూడెం నుండి బిఆర్ఎస్ ప్రచార యాత్రను ప్రారంభిస్తూ కెసిఆర్ చేపట్టిన బస్సు యాత్ర.. ఆ పార్టీ క్షేత్రస్థాయి శ్రేణులు, నాయకులకు కొంత ఎడారిలో ఒయాసిస్సులా మారింది.

### అగ్రనేతలతో బిజెపి ప్రచారం

బిజెపి ప్రచారంలో ఇప్పటికే పలువురు జాతీయ నాయకులు వస్తూ పోతున్నారు. కేంద్రమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, ఆ పార్టీ ముఖ్యమంత్రులు పలు చోట్ల సభల్లో పాల్గొంటూ, బిజెపికి మద్దతు కోరుతున్నారు.

ప్రధానంగా ప్రధాని మోదీ ఆకర్షణ శక్తిపైనే ఆ పార్టీ ప్రచారాన్ని కేంద్రీకరించింది. ఈ నెలాఖరులో ప్రధాని మోదీ తెలంగాణలో ప్రచారం చేయనున్నారు. ఏప్రిల్ 30న జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఆందోల్‌లో ప్రచార సభతో పాటు, అదే రోజు సాయంత్రం శేరిలింగంపల్లిలో ఐటి ఉద్యోగులతో చర్చాగోష్ఠిలో మోదీ పాల్గొంటారు.

ఆ తరువాత మే 3న వరంగల్, 4న మహబూబ్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలలో జరిగే సభలకు హాజరవుతారు. ప్రధాని ప్రచార సభల తరువాత రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కే అవకాశాలు ఉన్నాయి.

# ఎన్నికలు... ఎత్తులకు పైఎత్తులు

లోక్‌సభ ఎన్నికలు ఈసారి ఏడు దశల్లో జరగాల్సి ఉండగా, ఇప్పటికే రెండు విడతల పోలింగ్ పూర్తయింది. తెలంగాణలోని 17 స్థానాలకు మే 13న, నాలుగో విడతలో పోలింగ్ జరగనుంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్, బిజెపి ఈ ఎన్నికల్లో రాణించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో 'మైండ్ గేమ్ పాలిటిక్స్'కు తెరలేపాయి. హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారంలో జయాపజయాలు ఎలావున్నా, పోటీ తీవ్రంగానే ఉంటుందని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత, 2014లో అసెంబ్లీ, లోక్‌సభలకు కలిపి జరిగిన ఎన్నికల్లో ఉద్యమ పార్టీగా చెప్పుకుంటున్న టిఆర్ఎస్ (నేటి బిఆర్ఎస్) 63 అసెంబ్లీ, 11 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. తిరిగి 2019లో ఎన్నికలు జరగవలసి ఉండగా 6 నెలల ముందుగానే రాష్ట్ర అసెంబ్లీనీ రద్దు చేసుకొని టిఆర్ఎస్ 2018లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్ళింది. 84 స్థానాలలో విజయం సాధించి రెండోసారి అధికారం చేపట్టింది. 2019జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'సారు.. కారు.. పదహారు' నినాదంతో ఎన్నికలబరిలోకి దిగిన టిఆర్ఎస్, శాసనసభలో ఉన్న బలంమేరకు కనీసం 12 లోక్‌సభ స్థానాల్లో గెలవాల్సి ఉండింది. కానీ, 9 స్థానాలకే పరిమితమైంది.. మిగతా 8 స్థానాలలో 4 బిజెపి, 3 కాంగ్రెస్, ఒకటి ఎంఐఎం గెల్చుకున్నాయి. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 39 స్థానాలకె పరిమితమైంది. 64 స్థానాలు గెల్చుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాగా, దేశవ్యాప్తంగా జరుగుతున్న 18వ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు మొత్తం స్థానాలకు పోటీ పడుతున్నాయి. రాష్ట్రంలో కనీసం 14 స్థానాలైనా సాధించాలని కాంగ్రెస్, గతంలో పొందిన 9 స్థానాలైనా మరోసారి దక్కించుకోవాలని బిఆర్ఎస్ భావిస్తుంటే, మోదీ చెరిష్మాతో తెలంగాణాలో బలం పెంచుకొని, రాష్ట్రంలో డబల్ డిజిట్ స్థానాలు పొందాలని బిజెపి ఉవ్విళ్లూరుతున్నది. ఈ దిశగా ముమ్మర ప్రచారం కూడా చేస్తున్నది. గత శాసనసభ ఎన్నికలలో 8 స్థానాలు దక్కించుకున్న బిజెపి, ఈ లోక్‌సభ ఎన్నికలలో 10 నుండి 12 స్థానాలు ఆశిస్తున్నది.

లోక్‌సభ ఎన్నికలవేళ రాష్ట్రంలో నెలకొన్న తాజా కరువు పరిస్థితి ఆయా పార్టీలకు ప్రచార అస్త్రంగా మారింది. సరిగ్గా మండే ఎండాకాలంలో ఎన్నికలు రావడం, అదే సమయంలో రాష్ట్రంలో తాగునీటికి కటకట ఏర్పడడం అన్ని పార్టీలకూ కలిసి వచ్చింది. కరువు కారణం మీరంటే మీరేనని ఆరోపణలు చేసుకుంటున్నాయి. పరనిందల స్వరం పెంచాయి. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఒక వైపు బిఆర్ఎస్ ఆరోపిస్తున్నది. అయితే, ఈ మాటలను కాంగ్రెస్ కొట్టిపారేస్తున్నది. గత ప్రభుత్వ అసమర్థ విధానాలు, ఆలోచనా రాహిత్యం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని ప్రతిదాడికి దిగిం ది. కాగా, కరువుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలే కారణమని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ఆలోచించకుండా, కార్యాచరణకు పూనుకోకుండా, పరస్పర విమర్శలతో కాలంగడుపుతున్నాయని బిజెపి విమర్శిస్తున్నది. మొత్తంమీద తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం కరువు చుట్టూ చక్కర్లు కొడుతున్నది.

నిజానికి, గత సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నుండి వర్షాలు లేకపోవడం రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోయాయి. కృష్ణా, గోదావరి బేసిన్లలో, రాష్ట్రంలోని 14 ప్రధాన రిజర్వాయర్లు దాదాపు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. దీనిపై దృష్టిపెట్టిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నది. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రాజెక్టులలో నీటి మట్టం తగ్గుతూ వస్తున్నది. నాగార్జునసాగర్ లాంటి ప్రాజెక్టు క్రింద యాసంగి పంటకు నీరు లేకపోవడం, శ్రీశైలంతో పాటు శ్రీరామ్‌సాగర్‌లోనూ గత సంవత్సరం కంటే తక్కువ నీరు ఉండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి, మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కృంగిపోవడం వివాదాన్ని సృష్టిస్తున్నది. నిర్మాణ లోపాలతోపాటు, కమిషన్లు దండుకొని బిఆర్ఎస్ నాసిరకమైన పనులకు ఆమోద ముద్ర వేసిందని, ఆ పార్టీ వైఫల్యాలే మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి కారణమని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. అయితే, కుంగిన పిల్లర్లను పునఃనిర్మించకుండా, కాంగ్రెస్ కాలయాపన చేస్తున్నదని బిఆర్ఎస్ విమర్శిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లోనూ మేడిగడ్డ అంశం కాంగ్రెస్‌కు ఓ ప్రధానాస్త్రంగా మారింది. రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నప్పటికీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శల దాడి చేస్తున్నారు. దీనితో రాష్ట్ర రాజకీయం మరింత వేడెక్కింది. ప్రభుత్వ అసమర్థత, చేతకానితనం కారణంగానే, రాష్ట్రంలో కరువు పరిస్థితులు వచ్చాయని, కాబట్టి ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చినదేనని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పలు ఎన్నికల ప్రచార సభల్లో అంటున్నారు. సూర్యాపేట, నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తూ, రైతులకు ఓదార్పు మాటలు చెప్తూ, వచ్చిన అవకాశాన్ని విడిచిపెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈనెల 24వ తేదీన ఆయన చేపట్టిన బస్సు యాత్ర మే 10వ తేదీ వరకు కొనసాగనుంది. అంటే, దాదాపుగా ఎన్నికల ప్రచారం ముగిసే సమయం వరకూ ఆయన బస్సు యాత్ర చేస్తూ, రాష్ట్రం నలుమూలలా తిరుగుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు గుప్పించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దిగాలుపడిన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపడం కూడా ఆయన బస్సు యాత్ర కు ఒక కారణం అన్నది బహిరంగ రహస్యం. అయితే, పదేళ్ల పాటు పదవిలో ఉండి, భారీ అవినీతికి పాల్పడి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన కెసిఆర్ ఇప్పుడు బస్సు యాత్రతో మరోసారి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నా రని కాంగ్రెస్ విమర్శిస్తున్నది.

రైతుబంధు, రుణమాఫీతోసహా ఇచ్చిన గ్యారంటీలను ఆగస్టు 15వ తేదీలోగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ వాగ్దానం చేస్తున్నారు. వానాకాలం పంట నుంచి బోనస్ అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటిస్తుండగా, ఒకవేళ అది జరగకపోతే రాజీనామాకు సిద్ధం కావాలని బిఆర్ఎస్ సవాలు విసురుతున్నది. ఇలావుంటే, 'రైతు సత్యాగ్రహ దీక్ష' పేరుతో బిజెపి నేతలు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలతో పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్తున్నారు. రైతు భరోసా, రుణమాఫీ, వరికి బోనస్, పంటల బీమా రైతు కమిషన్ వంటి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి కౌంటర్‌గా కేంద్రంలోని మోదీ సర్కారు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధత కల్పించాల ని ప్రతిపక్ష పార్టీలు అంటున్నాయి. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీచార్జ్, అక్రమ కేసులు బనాయింపు వంటి చర్యలకు బిజెపి సర్కారు పాల్పడుతున్నదని, ఆ పార్టీ ఇక్కడ రైతుల సంక్షేమం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ వ్యాఖ్యానిస్తున్నది. అంతేకాదు... పదేళ్లు ఫామ్‌హౌస్ లో పడుకొని, రైతులను నట్టేట ముంచిన కెసిఆర్, ఇప్పుడు ఎండిన పంట పొలాల సందర్శనకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, బిఆర్ఎస్ ఆరోపణలకు తగిన సమాధానం చెప్తున్న రీతిలో, పంట నష్టానికి, ఎకరానికి రూ.10 వేలు చొప్పున సాయం అందిస్తామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచి, యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లను పూర్తి చేస్తామని కాంగ్రెస్ మంత్రులు ప్రకటిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలిస్తున్నారు. ఏదిఏమైనా, రాష్ట్రం లో ఒకవైపు ఎండలు మండుతుంటే, మరో వైపు ఎన్నికల వేడి మరింత పెరిగింది. బిజెపి 10 సం.లు కేంద్రంలోను, బిఆర్ఎస్ పది సం.లు రాష్ట్రంలోనూ అధికారంలో ఉండి, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి అవినీతి, అరాచక పాలనను కొనసాగించాయని, ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పే రీతిలో 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలు కూడా కోరుతున్నాయి.ఏకమై, పోరాటం ఉధృతం చేస్తున్నాయి.

ఉజ్జిని రత్నాకర్ రావు,
9490942646

## పెండింగ్ వేతనాలివ్వాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడి వర్కర్స్, ఆయాల జీతాలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణి స్త్రీలకు, బాలింతలకు, పసిపిల్లలకు ప్రభుత్వం నుంచి వచ్చే పోషకాహారం అందించడమే కాకుండా ఐదు సంవత్సరాలలోపు చిన్నారులను ఉదయం నుండి సాయంత్రం వరకు అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారుల బాగోగులను చూస్తూ వారి ఆలనాపాలనలో, ఆటపాటలలో ప్రధాన పాత్ర వహిస్తున్న అంగన్‌వాడీలకు రెండు నెలల నుండి జీతాలు రాకపోవడం బాధాకరమని తక్షణమే ప్రభుత్వం స్పందించి వారి జీతాలు విడుదల చేయాలన్నారు.గత ప్రభుత్వం తమ జీతాలు పెంచాలని అంగన్‌వాడిలు సమ్మెబాట పట్టారని కానీ నేడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అంగన్‌వాడిలు, హెల్పర్లు అనేక ఆశలు పెట్టుకుని ఉన్నారన్నారు.రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు పరచి అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సిపిఐ నాయకులు భిక్షం మృతి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు మేకల భిక్షం(65) మృతి చెందారు. భిక్షం గత వారం రోజుల క్రితం ఇంటి నుండి వెళ్ళి కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం ప్రయత్నించినా దొరకక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతని కుమారుడు తన తండ్రి కనబడుటలేదని దరఖాస్తు చేయడం జరిగింది. కాగా శనివారం రోజున భిక్షం మృతదేహం స్థానిక వేణుగోపాల స్వామి వెంచర్‌కు సమీపంలోని కంప చెట్ల పొదలలో కనుక్కోవడం జరిగింది. మృతదేహం కుళ్ళిపోయిన స్థితిలో ఉంది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం చేయించి దర్యాప్తు చేస్తున్నారు.

### పలువురి సంతాపం

సిపిఐ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే భిక్షం మృతి పట్ల పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కమిటి సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శి ఎండి అక్బర్, పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు జిల్లా యాదయ్య, గుండాల సత్తయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నల్లగొండ బరిలో 31 మంది

### ఉపసంహరణకు రెండురోజులే గడువు

**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ హోరా హోరీగా సాగాయి. రాజకీయ పార్టీల అభ్యర్థులు, రెబల్, డమ్మి అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు గడువులోపు దాఖలు చేశారు. చివరి గడువు వరకు 56 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో వివిధ కారణాలు, నామినేషన్లు దాఖలు చేసే సమయంలో సరైన పత్రాలు సమర్పించకపోవడంతో 25 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 31 మంది అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించారు. అయితే ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ ఉపసంహరించుకునేందుకు గడువు ఉండటంతో రాజకీయ పార్టీలలో డమ్మి, రెబల్‌గా నామినేషన్ వేసిన అభ్యర్థుల ఉపసంహారణతో పాటు ఆయా పార్టీలకు ఓట్లు తగ్గే అభ్యర్థులను ఉపసంహరించుకునేందుకు రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటివరకు 31 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన తెలిపారు.

## నూర్జహాన్ మృతిపై పువ్వాడ సంతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ డ్రైవర్ ఎండి అహ్మద్ అలీ (బాబా సోదరి) ఎండి నూర్జహాన్ బేగం (76) మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తీవ్ర సంతాపాన్ని ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శనివారం నగరంలోని మాణిక్య నగర్‌లో నూర్జహాన్ బేగం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## 29న ఖమ్మంలో కెసిఆర్ పర్యటన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈనెల 29న ఖమ్మంలో జరిగే కేసిఆర్ బస్సు యాత్రను జయప్రదం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మమతలోని ఆయన ఇంటి వద్ద జరిగిన బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ 100 రోజుల కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. కేసిఆర్ బస్సు యాత్రకు అపూర్వ మద్దతు లభిస్తుందని ఖమ్మంజిల్లాలో సైతం అదే రీతిలో యాత్రను జయప్రదం చేయాలన్నారు. ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామ నాగేశ్వరరావును గెలిపించుకునేందుకు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని, ఇంటింటికి వెళ్లి బిఆర్‌ఎస్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను, కాంగ్రెస్ వైఫల్యాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మగ్బూల్, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన



**ప్రజాపక్షం /నల్లగొండ :** ఓటు హక్కుపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను నల్లగొండ పార్లమెంటు సాధారణ ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి మనోజ్ కుమార్ మానిక్ రావు సూర్యవంశీ శనివారం సందర్శించారు. జిల్లా పరిషత్ సీఈవో, స్వీప్ నోడల్ అధికారి ఎన్. ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా సమాచార, ప్రచార సంబంధాల శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, సీబీసీ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటి అధికారి కోటేశ్వర రావు, ఐకేపీ డీపీఎం అరుణ్ కుమార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్ శ్యామ్, లైబ్రేరియన్ రాజారాం, బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులుగా నీరు విడుదల

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలానికి డిండి ప్రాజెక్టు నుండి గత మూడు రోజులుగా నీటి విడుదల కొనసాగుతుండడంతో ఉమ్మడి చందంపేట మండలంలోని చెరువులు, కుంటలు నిండి నీటి సమస్య తీరనుంది. వర్షాభావ పరిస్థితుల వలన చెరువులు, కుంటలు నీరు లేక ఎండి పోతున్న తరుణంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, పిఏసిఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేస్తే నీటి కొరత ఉండదని తెలపడంతో ప్రాజెక్టు నుండి గత మూడు రోజులుగా నీటిని విడుదల చేయడం చెరువులు, కుంటలకు నీరు కాలువల ద్వారా తరలడం జరుగుతుంది.

## కేసు నమోదు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట టెంపుల్ పైన యాదగిరి అనే కొబ్బరికాయలు అమ్మే వ్యక్తి దర్శనానికి వచ్చిన 10 మంది భక్తుల దగ్గర నుంచి తొందరగా దర్శనం చేపిస్తాని 1500 రూపాయలు తీసుకుని ఐదు టికెట్లు కొనుక్కొని దర్శనానికి తీసుకెళ్లే సమయంలో టెంపుల్ ఉద్యోగి అయిన మనోహర్ రావు ప్రశ్నించగా అతనితో వాగ్వాదం చేశారు. ఇట్టి అంశాల పైన ఆలయ ఈవో భాస్కర్ గారు దరఖాస్తు ఇవ్వగా చీటింగ్ మరియు విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం అనే అంశాల పైన కేసు నమోదు చేయడం జరిగింది.

# బిజెపిని ఓడించడమే కర్తవ్యం

### డిహెచ్‌పిఎస్ రాష్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్



**ప్రజాపక్షం-/ మిర్యాలగూడ:** బలహీనవర్గాల బద్ధ శత్రువుగా నిలిచిన బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యమని డీహెచ్‌పీఎస్ (దళిత హక్కుల పోరాట సమితి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో వల్లంపట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిది నియంతృత్వ, నిరంకుశ, మతతత్వ పాలన అని ఆరోపించారు. మహనీయులు రాసిన రాజ్యాంగాన్ని అహంకారంతో మార్చడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మోడి తన కార్పొరేట్ మిత్రుల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. మోడి మహిళలను అణిచివేసేవారిని, రేపిస్టులను కాపాడుతుందన్నారు. ఎలక్టోరల్ బాండ్లతో వ్యాపారులనుదోచుకుంటుందన్నారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని ఈడీ, సీబీఐ వంటి ఏజెన్సీలతో బెదిరిస్తుందని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను ధనబలంతో కూలుస్తుందని ఆరోపించారు. నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులు కష్టాలు పడుతుంటే ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తప్పుడు లెక్కలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో దేశం ప్రమాదకరమైన సుడిగుండంలో చిక్కుకుపోయిందన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినప్పుడు బాధితల పక్షాన బీజేపీ ప్రభుత్వం ఏం చేయలేకపోయిందన్నారు.ప్రజల దృష్టిని మళ్లించి బీజేపీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఓటే ఈ యుద్ధంలో గెలుస్తుందన్నారు. నిరుద్యోగం, పేదరికంతో ప్రజలు అల్లాడుతుంటే ప్రధాని మోడి తన కార్పొరేట్ మిత్రుల ప్రయోజనాల కోసం విధానాలనురూపొందిస్తున్నారనిమండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగనాయక్, సీపీఐ మండల కార్యదర్శులు ఎండి.సయిద్, జిల్లా యాదగిరి, నాయకులు సుధీర్, మామిడాల మారతమ్మ, రామలింగం,పోలెపల్లిసైదులు,సుధాకర్‌పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్ వద్ద భారీ భద్రత



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లా కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. శనివారం ఎన్నికల కమీషన్ ఆదేశాలతో స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సంబంధించి సూర్యాపేట జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ ఈవీఎంలను భద్రపరిచినట్లు తెలిపారు. అనంతరం స్ట్రాంరూం వద్ద ఉన్న సిసి కెమెరాలు, ఫైర్ ఆలారం, భద్రతను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డివో మధుసూదన్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, డిఎం మార్కెటింగ్ శర్మ, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రశ్నించే గొంతునవుతా..గళమెత్తుతా

### బిఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/జమ్మికుంట (కరీంనగర్):** రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసి తనను గెలిపిస్తే ఐదేళ్లలో కరీంనగర్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు ట్రిబుల్ ఐటి, నవోదయ పాఠశాలలు తెచ్చి విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతానని.. ప్రజలు ఐదేళ్లు అవకాశం కల్పిస్తే పార్లమెంటులో ప్రశ్నించే గొంతునవుతానని కరీంనగర్ బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో జమ్మికుంట పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, కళాశాల మైదానంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ఎంపిగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. కొత్తపల్లిమనోహరాబాద్ రైల్వేలైన్ తీసుకువచ్చానని, మానేరు నదిపై తీగల వంతెన నిర్మాణం, మానేరు రివర్‌ఫ్రంట్, ఐటి టవర్, శాతవాహన యూనివర్సిటీ దగ్గర నైట్ లైట్ నిర్మాణం చేయడం జరిగిందని పేర్కొన్నారు. టిటిడి నుంచి రూ.25 కోట్ల నిధులు తెచ్చి పది ఎకరాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు రూపాయలు కూడా తీసుకురాలేదని, ఒక్క గుడి తేలేదు.. ఒక్క బడి తేలేదని పేర్కొన్నారు. ఐదేళ్లలో కనీసం బండి సంజయ్ నవోదయ పాఠశాల కూడా తీసుకురాలేకపోయాడని, బండి సంజయ్‌కు పదవి మీద ధ్యాస ఉంది కానీ..ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రాలేదన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, టూరిజం కార్పోరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కెడిసిసి వైస్ చైర్మన్ రమేష్‌ఉన్నారు.

## కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు షాక్

### ఫోర్జరీ పత్రాలతో కాలేజీ అనుమతి పొందారని ఫిర్యాదు

**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు ఫోర్జరీ పత్రాలతో కళాశాల అనుమతులు పొందారని, దీనిపై తాను ఢిల్లీలోని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్,హైదరాబాద్‌లోని జెఎన్‌టియుకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని కోదాడకు చెందిన ఉస్మానియా యూనివర్సిటి జేఏసి నాయకులు డాక్టర్ భట్టు శ్రీహరి రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్ 8843/24పై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణలపై ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్,హైదరాబాద్‌లోని జెఎన్‌టియూ నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసి నాలుగు వారాల్లోగా తగు చర్యలు తీసుకోవాలని,అంత వరకు కళాశాలకు ఎటువంటి అనుమతులను పొడగించవద్దని తన ఆదేశాలలోపేర్కొంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కిట్స ఇంజనీరింగ్ కళాశాల ఇతరుల భూమిని తనదిగా చూపడంతోపాటుఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసి నాలా కన్వర్షన్ సర్టిఫికెట్ పొందినదని దీనిపై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసి నేత జెఎన్‌టియూకి ఫిర్యాదు చేసాడు. దీనిపై యూనివర్సిటి నిపుణలు కమిటీ ఏర్పాటు చేయడంతో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో కళాశాల యజమాన్యం తమదని చెపుతున్న డాక్యుమెంట్ నెంబర్ 9037/ 2007కు సంబంధించి యజమాన్యపు హక్కుల పత్రాలతో పాటు దీనికి ఆర్డీవో ఇచ్చిన నాలా సర్టిఫికెట్లను సమర్పించడంలో విఫలమైందని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా దీనిని సేకరించిన భట్టు శ్రీహరి దీనిపై చర్యలు తీసు కోవాలని ఏఐసిటియు, జెఎన్‌టియూలకు ఫిబ్రవరి 17న ఫిర్యాదు చేశాడు. వారు స్పందించకపోవడంతో మార్చి 18న మరోసారి ఫిర్యాదు చేశాడు. అయినప్పటికి కనీస చర్యలు తీసుకోకపోవడంతో భట్టు శ్రీహరి రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ నెంబర్ 8843/2024 దాఖలు చేశాడు. దీనిపై వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.భాస్కర్‌రెడ్డి ఈ నెల 23న పై ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికైనా ఏఐసిటియు,జెఎన్‌టియూలు చర్యలు తీసుకోవాలని అక్రమాలకు పాల్పడిన కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు భట్ట శ్రీహరి కోరారు.

## 'మేడేను విజయవంతం చేయండి'

**ప్రజాపక్షం/శంకరపట్నం:** భారతదేశంలో కార్పోరేట్ శక్తులకు, అన్ని ప్రభుత్వ సంస్థలకు ఊడిగం చేస్తూ మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకు కొమ్ముకాస్తుందని ఏఐటియూజి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మేడేను విజయవంతం చేయాలని గోడ ప్రతిలను ఆవిష్కరించారు. సమ్మయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోదీ ప్రభుత్వం కార్పోరేట్లకు ఊడిగం చేస్తున్నారని, ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, 29 చట్టాలను సమూలంగా రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తెచ్చిందన్నారు. ఏఐటియూసి మండల సహాయ కార్యదర్శి కన్నం సదానందం, ఉపాధ్యక్షుడు తాడవేని రవి, దొమ్మేటి వెంకటస్వామి, బొజ్జ సంపత్, మేకల రవి, చిట్యాల బిక్షపతి, ఎండి అలీ, పెయింటర్ సంఘం వెంకన్న, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం 13కు నియమించబడిన రాష్ట్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ శనివారం మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలను, ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతోపాటు శెట్టిపాలెం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. పట్టణంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను, ఎన్నికల సామాగ్రి పంపిణి స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఎక్కువ పోలింగ్ అయ్యేలా చూడాలని కోరారు. ప్రతి ఒక్క ఓటరుకు స్లిప్‌లను పంపిణి చేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు హరిబాబు, శ్రీనివాస్‌శర్మ, వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# విద్యాశాఖాధికారి లీలలెన్నో..



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరోనా సమయంలో విధుల్లో జాయిన్ అయిన కరీంనగర్ జిల్లా విద్యాధికారి వైఖరి ఆది నుంచి వివాదాస్పదంగానే కొనసాగుతున్నది. ఇక్కడికి రాకముందు నాగర్ కర్నూల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉపాధ్యాయుల పట్ల వారి వైఖరి పరిపాలనలో లోటుపాట్లు, తప్పుడు నిర్ణయాలతో వేసారిన ఉపాధ్యాయులు ధర్నాలు చేసి ఆయా జిల్లాల నుంచి తరిమివేయగా ఆదిలాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ సైతం ఇవే మితిమీరిన కార్యక్రమాలు చేయడంతో ఏకంగా కార్యాలయ సిబ్బంది టెంట్లు వేసి సాగనంపిన పరిస్థితి నెలకొంది. ఇక కరీంనగర్ విషయానికొస్తే ఆది నుంచి ఇదే వివాదాస్పదమైన నిర్ణయాలు తీసుకుంటూ నాటి మంత్రులు, కలెక్టర్లతో పలు సంధర్బాలలో చివాట్లు పడిన వైఖరి మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది.కరీంనగర్ జిల్లా విద్యాధికారి తన సొంత వ్యవహారం విషయానికొస్తే వారి పుట్టిన తేదీ విషయంలో పొరపాట్లు ఉన్నాయని సర్వీసు రిజిస్టర్‌లో దిద్దారని సమాచార హక్కు మేరకు కొందరు అడిగితే నేటి వరకు దానికి బదులు ఇవ్వకుండా ఏండ్లు గడుపుతూ వచ్చారు. వారి సర్వీసు పుస్తకంలో పదవ తరగతి ఉత్తీర్ణత అని రాసి ఉన్న విద్యార్హతల కాలమ్‌లో హాల్‌టికెట్ నెంబర్ లేదనే విషయాన్ని పలు ఫిర్యాదులు చేసిన స్పందించకుండా, నిరూపించకుండా అడిగిన వారిపై కక్ష సాధింపు ధోరణి ప్రదర్శించే వైఖరి కొనసాగుతోంది. తాజాగా దొంగ అద్దె రశీదులతో ఇన్కమ్ టాక్స్ ఎగ్గొట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. కరీంనగర్ జిల్లా విద్యాధికారి సిహెచ్. వి.ఎస్.జనార్దన్‌రావు రేకుర్తి సమీపంలోని సూర్య నగర్‌లో ఇంటినెంబర్ 2232/4/7లో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుని ఇంట్లో నామమాత్రపు అద్దె చెల్లిస్తూ ఉంటున్నారు. అయితే 2023 24 సంవత్సరపు ఐటి ప్రతిపాదనల్లో మాత్రం తాను కోతిరాంపూర్‌లోని కె.సత్యానారాయణ ఇంటి నెం.85553/2/బి లో అద్దెకుంటున్నట్లు , ప్రతినెల రూ.36 వేలను సంవత్సరానికి రూ.4.32 లక్షలు ఇంటి అద్దె చెల్లిస్తున్నట్లుగా ఇంటి అద్దె రశీదులు సమర్పించారు. వాస్తవానికి జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అద్దెకుంటున్నట్లుగా తెలిపిన ఇల్లు సత్యనారాయణ పేరు మీద లేదు. మున్సిపల్ రికార్డుల ప్రకారం కె.అరుణ పేరు మీద ఉంది. దొంగ రశీదులు సమర్పించి ప్రభుత్వానికి రూ.2 లక్షల 45 వేల 715 రూపాయల టాక్సెబుల్ ఇన్కమ్‌పై చెల్లించాల్సినటాక్స్‌ను 2023/24 ఆర్థిక సంవత్సరంలో ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టారు. ఇదే తంతు గత కొన్నేళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్లు సమర్పించిన ఐటి ప్రతిపాదనలు పరిశీలిస్తే పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎన్ని లక్షల సొమ్మును ఎగ్గొట్టారో తెలుస్తుంది. జిల్లా స్థాయి అధికారిగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులందరికీ ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి ప్రభుత్వానికి ఇన్‌కంట్యాక్స్ ఎగ్గొట్టడం విస్మయానికి గురిచేస్తోంది. సుమారుగా ప్రతి నెల రూ.22450 ఇన్‌కంట్యాక్స్‌కు విధిగా చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.5వేలను మాత్రమే చెల్లిస్తూ ఫైనాన్షియల్ కోడ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. పునర్నియామకంలో పక్షపాతం, నిధుల అవకతవకలకు సంబంధించి గెజిటెడ్ ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం వంటి వివాదాలెన్నో ఆయన ఖాతాలోనే ఉన్నాయి.

### సిబ్బందికి అక్రమంగా వేతనం

సుదూర ప్రాంతమైన ఒక మండలంలో పనిచేసే ఉపాధ్యాయుడు చాలా సంవత్సరాలుగా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డిప్యూటేషన్‌లో పనిచేస్తుండగా వారికి ఇటీవల కాలు విరిగి మెడికల్ సెలవులో ఉన్నప్పటికీ ఆరు నెలలుగా అతనికి యధావిధిగా జీతం అందుతూనే ఉన్నట్లుగా సమాచారం. ఈ విషయంలో ఉపాధ్యాయ లోకం పలురకాలుగా చర్చిస్తున్నా జిల్లా విద్యాధికారి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, తనకు నచ్చిన వారి పట్ల ఉదాసీనంగా ఉండడం సర్వత్రా అనుమానాలకు తావిస్తోంది.

## 30న జమ్మికుంటకు సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం /హుజురాబాద్ :** హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంటకు ఈ నెల 30వ తేదిన సియం రేవంత్ రెడ్డి వస్తున్నట్లు నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ వెల్లడించారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30వ తేదినా జమ్మికుంట కాలేజి గ్రౌండ్‌లోజరిగే భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నారని, సియం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి హుజురాబాద్ నియోజకవర్గానికి వస్తుండడంతో ఇట్టి సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. హుస్నాబాద్, మానకొండూరు నియోజకవర్గం నుండి ప్రజలు వస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను, హామీలను అమలు చేశామని, ప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లోపే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని అన్నారు. మాట ఇచ్చామంటే మాట నెరవేర్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా ఆగస్టు 15 లోగా రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని తెలిపారు. ఫోటోతో ఓట్లు అడగాల్సిన దుస్థితి ఉందన్నారు.

## 'కేసుల పరిష్కారం దిశగా న్యాయవ్యవస్థ కృషి'



**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ రాష్ట్రంలో 100 శాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయ వ్యవస్థ ముందుకు సాగుతున్నదని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే అన్నారు. శనివారం నల్లగొండజిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన అధునాతన 5 కోర్టుల భవనాన్నిప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కోర్టులో నూతనంగా నిర్మించిన 5 కోర్టుల అదునాతన భవనంలో డిజిటలైజేషన్ తో పాటు, అన్ని రకాల సౌకర్యాలను కల్పించడం జరిగిందని, ప్రత్యేకించి లైబ్రరీ, రిక్రియేషన్‌వంటిసౌకర్యాలుఉన్నాయన్నారు. కోర్టుల డిజిటలైజషన్ లో నల్లగొండ రెండవదని పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాల కల్పనతో న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు మంచి అవకాశం కలుగుతుందన్నారు.రాష్ట్రంలో అన్ని జిల్లా కోర్టులను డిజిటలైజేషన్‌కు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. చాలామంది పౌరులకు న్యాయవ్యవస్థతో సంబంధం ఉంటుందని, ఎప్పటికప్పుడు వచ్చే మార్పులకు అనుగుణంగా న్యా యవ్యవస్థ పని చేసినట్లయితే చట్టాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. అడ్వకేట్లు న్యాయాధికారులకు ఎప్పటికప్పుడు సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని, సుప్రీంకోర్టు సైతం సామర్థం పెం పుదలకుఉత్తర్వులు ఇచ్చిందన్నారు. న్యాయం కోసం కోర్టుకు వచ్చేవారికి అందుబాటులో ఉన్న చట్టాలు, సౌకర్యాలతో నాణ్యమైన న్యాయాన్నిఇచ్చేందుకు న్యాయవ్యవస్థకు ఇది మంచి అవకాశం కలుగుతుందనితెలిపారు. ఇకపై జిల్లా కోర్టులో కేసులన్నింటిని డిజిటలైజేషన్ చేసే అవకాశం ఉంద న్నారు.హైకోర్టు జడ్జి వినోద్ కుమార్, లక్ష్మణ్, విజయ్‌సేన్ రెడ్డి ,జిల్లా ప్రిన్సిపల్ ,సెషన్స్ జడ్జి నాగరాజు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జిల్లా ఎస్పీ చందనా దీప్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని,హైకోర్టు జడ్జిలను కలిసి బొకేలు అందజేశారు.

## ఎసిబి వలలో చిక్కిన సబ్-రిజిస్ట్రార్



**ప్రజాపక్షం/గంగాధర:** కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో లంచం తీసుకుంటుండగా ఏసిబి వలలో చిక్కుకున్న ఘటనలు వరుసగా జరుగుతూనే కొనసాగుతున్నాయి. కరీంనగర్ జిల్లా గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎస్ఆర్‌వో (సబ్ రిజిస్ట్రార్)గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్ బాబు బాధితుల నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. గంగాధర మండల కేంద్రానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ ఆకుల అంజయ్య స్నేహితుడైన అజయ్‌కుమార్‌కు సంబంధించిన తన తండ్రి పేరిట ఉన్న ఆస్తిని గిఫ్ట్ డీడ్ ద్వారా చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ రూ.10 వేలు ఇస్తేనే గిఫ్ట్ డీడ్ చేస్తేమని చెప్పడంతో బాధితుడు అజయ్ కుమార్ ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. దీంతో బాధితుడు అజయ్ కుమార్ ఆకుల అంజయ్య మధ్యవర్తిత్వం ద్వారా ఆఫీసులో పనిచేస్తున్న సబార్డినేటర్ కొత్తకొండ శ్రీధర్ ద్వారా ఎస్ఆర్‌వోకు పదివేల రూపాయల లంచం ఇస్తుండగా అప్పటికే ఏసిబి అధికారులు వల పన్ని మాటు వేసి లంచం తీసుకుంటున్న ఎస్ఆర్ఓ సురేష్, సబార్డినేటర్ శ్రీధర్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంధర్భంగా ఏసిబి డిఎస్‌పి రమణమూర్తి మాట్లాడుతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన వీరిని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

## కాంగ్రెస్‌లోకి క్యూ..ఖాళీ అవుతున్న కారు

**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** గులాబీకోటకు సూర్యా పేట జిల్లాలో బీటలు పడుతున్నాయి. గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు తిరుగులేని శక్తిగా పటిష్టంగా ఉన్న రాష్ట్రంలో ఒక్క సారిగా అధికారం కోల్పోవడంతో గత పది సంవత్సరాలు ఆ పార్టీని అంటిపెట్టుకున్న నాయకులు, కార్యకర్తలు కారును దిగి కాంగ్రెస్ పార్టీలోకి క్యూ కడుతున్నారు. దీంతో కారు పార్టీ ఖాళీ అవుతున్న పరిస్థితి. పార్లమెంట్ ఎన్నికలవేళఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను చేర్చుకునేందుకు గేట్లు తెరిచామని ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఆయా పార్టీలను వీడి కాంగ్రెస్‌పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జ్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు కాంగ్రెస్ బలాన్ని మరింతగా పెంచేందుకు సూర్యాపేట జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో బిజెపికి ఉనికి లేకపోవడంతోప్రధానంగా బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను తమవైపుకు తిప్పుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోవడంతో బిఆర్‌ఎస్‌లో ఇక తాము కొనసాగడంతో ప్రయోజనం లేదని అనేక మంది ఆ పార్టీకి రాజీనామాలు చేసి కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కూడా పార్టీ వీడుతున్న వారిని కట్టడి చేయలేక చేతులు ఎత్తేసిన పరిస్థితి.కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు కారు పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు అనేకమంది ఆసక్తి చూపుతున్నా కాంగ్రెస్ పార్టీసూర్యాపేటనియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనదైన శైలిలో వ్యవహరిస్తూ ప్రజాబలం, మచ్చ లేని వారిని కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానిస్తున్నారు. కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో బిఆర్‌ఎస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాసన సభ్యులు ఉత్తమ్ పద్మవతి, మందుల సామేల్‌లు గులాబీ బడానేతల గుండెల్లో గుబులు పుట్టించే విధంగా చేరికలను ప్రోత్సహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్నాకొద్ది కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు బిఆర్‌ఎస్‌కు చెందిన ఎంపిపిలు, జెడ్ పిటిసిలు,మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లతో పాటు ద్వితీయశ్రేణి నేతలు కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు కొనసాగిస్తున్నారు. చేరికలతో కాంగ్రెస్ పార్టీ పై చెయ్యి సాధిస్తుందా... పార్లమెంట్ ఎన్నికల తరువాత బిఆర్‌ఎస్ మనుగడ నిలుస్తుందా అన్నది ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

## కాంగ్రెస్‌లో చేరిన మడుపు భూంరెడ్డి



ప్రజాపక్షం/కొండపాకః తెలంగాణ రాష్ట్ర మాజీ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో శనివారం రోజున హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం భూంరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో అందిస్తున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడునై పార్టీలో చేరానని పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి నీలం మధు గెలుపు కొరకై కృషి చేస్తారని గజ్వేల్ నియోజకవర్గంలో నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలోపేత అవుతుందని అన్నారు. పార్టీలో చేరిన వారు కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతి నరేందర్, కొండపాక ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు చింతల సాయిబాబా, మర్పడగా ఎంపీటీసీ పత్తి ఆంజనేయులు, తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, ఐలం యాదవ్, బూర్గుల సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో 316 ర్యాంక్ సాధించిన పృథ్వీరాజ్



ప్రజాపక్షం/రాయపర్తి : చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించే విధంగా మట్టిలోని మాణిక్యం కొండా పృథ్వీరాజ్ జెఇఇ మెయిన్స్ ఫలితాలలో 316 ర్యాంకు సాధించి అందరిని ఆకట్టుకున్నాడు. వివరాల్లోకెళ్తే రాయపర్తి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కొండా భాస్కర్ కోమల దంపతుల కుమారుడు పృథ్వీరాజ్ హనుమకొండలోని శివాని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్నాడు. ఎంపీసీబీ భాగంలో 1000 మార్కులకు గాను 980 మార్కులు సాధించి ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతోపాటు జెఇఇ మెయిన్స్ ఫలితాలలో 316 ర్యాంకు సాధించి అందరిని ఆకట్టుకున్నాడు. శివాని జూనియర్ కళాశాలలో జెఇఇ ఫలితాలలో పృధ్విరాజ్ అత్యున్నత మైన ర్యాంకు సాధించాడు. జెఇఇ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పృధ్విరాజ్‌కు శివాని జూనియర్ కళాశాల యాజమాన్యం అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు. పుట్టిన ఊరు కొత్తూరు గ్రామానికి చెందిన భాస్కర్ కుమారుడు పృథ్వీరాజ్ ను గ్రామస్తులు తల్లిదండ్రులు అభినందన తెలియజేశారు. భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పలువురు కోరుకుంటున్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ప్రజాపక్షం/సంగెం: మండలంలోని ఎల్గూర్ రంగంపేట గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జనగాం రమేశ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## మురికి నీటిని తొలగించిన అధికారులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/అల్లాదుర్గం : మూడు రోజుల క్రితం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన రోడ్డుపై మురికి నీరు అనే వార్తకు స్పందించిన అధికారులు. శుక్రవారం అల్లాదుర్గం బస్టాండ్ ఆవరణలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీటిని సెప్టిక్ క్లీనర్ మోటర్ సహాయం తో తొలగించి సమస్యను పరిష్కరించారు.

## రోజురోజుకు ఖాళీ అవుతున్న బిఆర్ఎస్



ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట మండలం పరిధిలోని చల్మెడ గ్రామంలో శనివారం రోజున గ్రామ మున్నూరు కాపు సంఘం ఫంక్షనాల్లో స్థానిక ముత్యం రెడ్డి అధ్యక్షతన 300 మంది బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది. ఎమ్మెల్యే రోహిత్ రావు హాజరై ఆయా గ్రామాల బిఆర్ఎస్ కార్యకర్తలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి చూసి టిఆర్ఎస్ బిజెపి పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీకి వస్తున్నారని ఇది రేపు జరగబోయే మెదక్ ఎంపీ అభ్యర్థి గెలుపుకు నాంది అని ఆయన అన్నారు. మూడు నెలల్లో తెరిపించడానికి కమిటీ వేసి ఫ్యాక్టరీ ఉన్న ప్రారంభానికి ప్రయత్నం సాగుతుందన్నారు. వచ్చిన మూడు నెలల్లోనే తండాలలో సిసి రోడ్లు వేసినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని ఆయన అన్నారు. మెదక్ అభ్యర్థి నీలం మధు ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ బడుగు బలహీన వర్గాల ఆయన తెలిపారు. దళితులకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకంగా కేంద్రంలో బిజెపి మతోన్మాద పార్టీ 400 సీట్లు వస్తే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని ఇందిరమ్మ కలలు కన్న పరిపాలన కొనసాగాలని ఇందిరమ్మ పథకాలు ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెప్పట ముత్యంరెడ్డి, గ్రామ తాజా మాజీ నరసింహారెడ్డి, ఎంపీపీ సిద్ధిరాములు, అబ్బా రెడ్డి, కర్ణాకర్ తుమ్మల రమేష్, కాకి రాజయ్య, లింగం గౌడ్, బాపురెడ్డి, నాతి లక్ష్మా గౌడ్, ఆకుల బాలయ్య, నసిరుద్దీన్, పరిపాటి రాజిరెడ్డి, జెల్లా లక్ష్మణ్,గుమ్ముల అజయ్, ఆయా గ్రామాల నాయకులు యాదగిరి, నాగరాజు, రవి నాయక్, బూదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి



ప్రజాపక్షం/టేకుమట్ల : వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతల కోసమై శనివారం టేకుమట్ల మండలం లోని గర్మిళ్లపల్లి చెక్ పోస్టును ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగ్ చెక్ పోస్టును తనిఖీ చేసారు.ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద రిజిస్టర్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచలను చేశారు. ఆయాన మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రూ.50వేల నగదు కంటే ఎక్కువగా ఉంటే సీజ్ చేయాలని సూచించారు. సరిహద్దు చెక్ పోస్టు వద్ద లిక్కరు అక్రమ రవాణా చేస్తే వెంటనే సీజ్ చేసి నిభందనల మేరకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసారు. చెక్ పోస్టులలో నియమించబడిన సిబ్బంది 24 గంటలు చెక్ పోస్టులో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# రేగొండలో రేవంత్‌రెడ్డి భారీ ర్యాలీకి ఏర్పాట్లు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి /రేగొండ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 30న భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండల కేంద్రంలో సిఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపు నిచ్చారు. శనివారం రేగొండ మండల కేంద్రంలోని ఎస్ఎల్ఎన్ గార్డెన్స్‌లో మండల పార్టీ అధ్యక్షులు యిప్పకాయల నరసయ్య అధ్యక్షతన ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీఎస్సార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 30 న రేగొండ మండల కేంద్రంలోని నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారని తెలిపారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని అన్నారు. ప్రధాని మోదీని ఓడించి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. పదేళ్ల పాలనలో రాష్ట్రానికి బిజెపి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని ఆ పార్టీ నాయకులను జిఎస్ఆర్ ప్రశ్నించారు. వరంగల్ ఎంపీగా పోటీ చేస్తున్న కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

**సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే**

ముప్పయిన రేగొండలో రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వెనకాల ఉన్న స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను వరంగల్ ఎంపి ఎన్నికల ఇన్చార్జి రేవూరి ప్రకాశ్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే జీఎస్సార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామ్ నరసింహారెడ్డి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు అ ప్పం కిషన్, ఎన్ఎస్ఆర్ సంపత్ రావు, పలువురు జిల్లా,మండల, గ్రామ స్థాయి నాయకులు ఉన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

### ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి




ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి : దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో పార్లమెంట్ లోక్‌సభ ఎన్నికలు 2024 స్వీప్ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులు, వయోవృద్ధులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనేది ఓటు హక్కు ద్వారా మాత్రమే సాధ్యమని, ఓటు హక్కు మన ప్రాథమిక బాధ్యత, విధి అని రానున్న ఎన్నికలలో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటు వేయడం అత్యంత ముఖ్యమని, ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నుకోబడే ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యం అంటారని, 100 శాతం పోలింగ్ జరిగినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యంగా పేర్కొనడం జరుగుతుందని, ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా పిడబ్ల్యూడి ఓటర్లు మహిళలకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడిఎస్ నోడల్ అధికారిణి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, లెనినా, స్వీప్ నోడల్ అధికారి , డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, సిడిపిఓ మల్లీశ్వరి, స్వాతి, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థంగా సేవలందిస్తా

### బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రాంరెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్ : తనకు డబ్బుపై ఎలాంటి ఆపేక్ష లేదని, నిస్వార్థంగా సేవలందించడానికే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు మెదక్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రాం రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తతో కలిసి ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల ఆర్థికాభివృద్ధికి మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రత్యేక కృషితో సస్యశ్యామలం చేసినట్లు స్పష్టం చేశారు. రైతుల సహకారంతో మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టు, రంగనాయక సాగర్ తదితర నిర్మాణాలు చేపట్టగా, ఇందులో అన్నదాతల త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. బాధిత రైతు కుటుంబాలకు తన సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందని, అయితే దేశంలో ఎక్కడా లేనివిధంగా వారికి వివిధ రకాల ప్యాకేజీలు వర్తింపజేసినట్లు గుర్తు చేశారు. గత పదేళ్ల వ్యవధిలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, చారిత్రాత్మక పథకాలతో కెసిఆర్ పేదల పెన్నిధిగా నిలిచినట్లు చెప్పారు. తనను దెబ్బతీసే విధంగా బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు దుష్ప్రచారం చేస్తుండగా, అబద్ధాలు ఎంత మాత్రం నిజం కాబోవని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు విస్మరించడంతో ప్రజలు ఆ పార్టీని విశ్వసించడం లేదని పేర్కొన్నారు. తన గెలుపు కోసం శ్రమిస్తున్న కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటానని, మెదక్ స్థానం నుండి తనను గెలిపించి బిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని, అలాగే పేదల కోసం రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి ఆదుకోనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వుడెం కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, రజిత గౌడ్, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గుప్త, లక్ష్మి కిషన్ రెడ్డి, వరలక్ష్మి కనకయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, మదర్సా చైర్మన్ హైదర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పాలనలోనే సంక్షేమ ఫలాలు

### ఎంఎల్ఎ దొంతి మాధవరెడి



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఇందిరమ్మ పాలనలోనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి అన్నారు. శనివారం ఖానాపురం మండలంలో ఏర్పాటుచేసిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశం ఖానాపురం మండలంలోని రెడ్డి పెద్ద రంగారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఖానాపురం మండలాధ్యక్షుడు శాఖమూరి హరిబాబు సభాధ్యక్షత వహించగా నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపి అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఖానాపూర్ మండలంలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి పాల్గొనడం జరిగింది. అనంతరం దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని ఈ ప్రాంతంలో మోడల్ స్కూల్‌లో, నేషనల్ హైవే 365తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు 100 రోజుల పని ఉపాధి హామీ పథకాన్ని యూపిఎ చైర్పర్సన్ సోనియా గాంధీ కల్పించిందని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన ఐదు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని అన్నారు. పంద్రాగస్టులో రెండు లక్షల రైతు రుణ మాఫీ అమలు చేసి తీరుతామని నర్సంపేట నియోజకవర్గం నుండి బలరాంనాయక్ అత్యధిక మెజార్టీని అందించి కేంద్రంలో కీలక భూమిక పోషించే విధంగా గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు, సొంటి రంజిత్‌రెడ్డి, నర్సంపేట పట్టణాధ్యక్షుడు పెండెం రామానంద్, కార్పొరేటర్లు వేముల సాంబయ్య గౌడ్, ఓర్సు తిరుపతి, శ్రీనివాస్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వేములపల్లి వెంకటప్రసాద్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కె ముస్తఫా, కందుల సాంబయ్య, ఎలగందుల రాజు, రంగు కుమార్, బిక్కి మురళి, జాటోతు పూల్యా, ఎంపిటిసి మూడు పూల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు హన్మకొండలో కెసిఆర్ రోడ్ షో

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నేడు హన్మకొండలో జరుగనున్న మాజీ సిఎం కెసిఆర్ బస్ యాత్ర, రోడ్ షోను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. శనివారం హన్మకొండోని రోడ్ షో జరుగునున్న ప్రాంతాలలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబుతో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమవీరుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ సాధన కోసం బయలుదేరి తెలంగాణ ప్రజలను ఏకం చేసి తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం టిఆర్ఎస్ స్థాపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి బంగారు తెలంగాణ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. రానున్న రోజుల్లోను తెలంగాణ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు నగుర్ల వెంకటేశ్వర్లు, సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/రాయపర్తి : రాయపర్తి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో వివిధ గ్రామాల పార్టీ ఇంచార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు సమీక్షా సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీక్షా సమావేశం రాబోయే వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ గారి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నేల 28న వరంగల్‌లో కెసిఆర్ బస్సు యాత్ర రోడ్డు షో ఉన్నందున మండలం నుండి భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొని రోడ్డు షోను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ పార్టీ ఇంచార్జిలు మాజీ స్పీకర్ మధుసుధన చారి, మెట్టు శ్రీనివాస్,మండల పార్టీ ఎన్నికల ఇంచార్జి గుడిపూడి గోపాల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు మునవత్ నర్సింహా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కొమ్ము దేవయ్య కుటుంబానికి న్యాయం చేయాలి




### ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి

ప్రజాపక్షం/కాజీపేట : వరంగల్ నగరపాలక సంస్థలో జవాన్‌గా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన కొమ్ము దేవయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధికారులను కోరారు. ఈ మేరకు కాజీపేటలోని వరంగల్ నగరపాలక సంస్థ సూపరిండెంట్ అనిల్ కుమార్‌కు ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ స్టఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ కాజీపేట రహమత్ నగర్ నివాసి అయిన కొమ్ము దేవయ్య విధి నిర్వహణలో ఉండగా కాజీపేట చౌరస్తాలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడని, మాదిక సామాజిక వర్గానికి చెందిన దేవయ్య నిరుపేద అని తెలిపారు. వరంగల్ నగరపాలక సంస్థ అధికారులు పని చేసే కార్మికులకు సరైన జాగ్రత్తలు, రక్షణలు కల్పించక పోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని, దేవయ్య కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఏఐటియూసి జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, మునిగాల బిక్షపతి, ఆర్. పున్నం చందర్,శంకర్ నాయక్, ఎన్.సాంబయ్య, లకావత్ బుజ్జి, ఈగ లావణ్య పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో బిఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ

### ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న నేతలు



ప్రజాపక్షం/గజ్వేల్ : గజ్వేల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ నుండి ఒక్కొక్కరు వైదొలుగుతున్న పుటికీ పట్టించుకోకపోవడంతో అధిష్ఠానం చేతులెత్తేసినట్లు అర్థమవుతుంది. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా పట్టుపట్టి పూర్వ కలెక్టర్ వెంకట్రాంరెడ్డిని రంగంలో దింపినప్పటి నుంచి పార్టీలో అసమ్మతి బుసలు కొడుతోంది. ఎన్నికలు సమీపించే కొద్ది కెసిఆర్ ప్రధాన అనుచరులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పార్టీ మారుతుండడంతో ఎన్నికల నాటికి ఎవరు ఉంటారో? ఎవరు పార్టీని వీడతారో? అర్థం కావడం లేదు. మొదటగా తూప్రాన్ మున్సిపల్ చైర్మన్, కొండపాక ఎంపిపిపై అవిశ్వాసంతో ప్రారంభమైన అలజడి బిఆర్ఎస్ అధిష్టానం కంటి పై కునుకు లేకుండా చేస్తోంది. ఇందుకు డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నేతృత్వం వహిస్తుండడం విశేషం. కెసిఆర్ ప్రదాన అనుచర వర్గంగా పేరున్న జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, సర్పంచుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మహిపాల్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఫుడ్ సొసైటీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి కాంగ్రెస్ తీర్థ పుచ్చుకోగా, అదే బాటలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ములుగు మండల పరిషత్ వైస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, జగదేపూర్ ఎంపీపీ బాలేశం గౌడ్, గజ్వేల్ కౌన్సిలర్ సమీర్ తో పాటు కొండపాక మండలానికి చెందిన ఎంపీపీ, పలువురు ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, తూప్రాన్ మాజీ సర్పంచ్ వీర కుమార్ గౌడ్ తదితరులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన ప్రధాన నేతలు, ఎంపిటిసిలు, తాజా మాజీ సర్పంచులు కాంగ్రెస్ లో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎన్నికల హామీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తా

### మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి హరీష్‌రావు గులాభి జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ 2001 ఏప్రిల్ హైదరాబాద్ జలదృశ్యంలో గులాబి జెండా ప్రస్తానం ప్రారంభమై నేడు దేశానికి ఆదర్శమైందన్నారు. కెసిఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రైతుబంధు పథకాన్ని కేంద్రంలో బిజెపి కాఫి కొట్టి అమలు చేసినట్లు తెలిపారు. కెసిఆర్ అభివృద్ధి ఆదర్శం ఉంటే.. రేవంత్‌రెడ్డి తిట్లలో ఆదర్శంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని తాను రాజీనామ చేస్తానన్న ముఖం చాటేసినట్లు తెలిపారు. తెలంగాణ కోసం రాజీనామా చేయలన్న కోరిన చేయకుండ ముఖం చాటేసిన వ్యక్తి కిషన్‌రెడ్డి అన్నారు. రాజీనామా కోసం జిరాక్స్ పేపర్ తెచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి.. తప్పించుకొని తిరిగిన వ్యక్తి కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి ఆరుగ్యారంటీలు, రుణమాఫి చేస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. స్పీకర్ పార్మాట్‌లో ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి పంపించి.. ఐదు నిమిషాల్లో తాను పంపిస్తానన్నారు. నాకు పదవుల కన్న రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలయ్యేవరకు తాను పోరాటం చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కెసిఆర్ ఏర్పాటు చేసిన జిల్లాలను తొలగిస్తానని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, సిద్దిపేట జిల్లాను ఊడగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. జిల్లాలు ఉండాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు. ఈకార్యక్రమంలో జడ్పి చైర్మన్ రోజా శర్మ, నాయకులు మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్సు, నాయకులు సంపత్‌రెడ్డి, సాయిరాం భూపేష్, నాగిరెడ్డిహ మోహన్‌లాల్, కౌన్సిలర్లుతదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌కు అన్యాయం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

### మెదక్ మాజీ ఎంఎల్ఎ పద్మా దేవేందర్ రెడ్డి



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం హయాంలో మెదక్‌కు 100 సీట్లతో మెడికల్ కాలేజీని మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎంఎల్ఎ రోహిత్ రావు 50 సీట్లకి మెడికల్ కాలేజీని కుదించడం ఏమిటని, మెదక్‌కు రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని అలా అయితే మెదక్ అభివృద్ధిని అడ్డుకున్నట్లే అవుతుందని మెదక్ మాజీ ఎంఎల్ఎ పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం మెదక్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎంఎల్ఎ పద్మా దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎంఎల్ఎ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, మాజీ ఎంఎల్ఎ శశిధర్ రెడ్డి తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మరో 50 సీట్లతో కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెడికల్ కాలేజీని ప్రారంభించడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ఎంతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ప్రజలకు నష్టం తెచ్చిందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ముందుకు వచ్చిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కార్యకర్తలకు ప్రజలకు సూచించారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలు కోరుకున్నా మార్పును కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గారెంటీలను హామీలను అమలు చేయడంలో విఫలమయిందని మండిపడ్డారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డినీ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు కృష్ణా రెడ్డి, మామిళ్ళ ఆంజనేయులు జయరాజ్, కిషోర్, బట్టి లలిత తోపాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ శిక్షణకు హాజరు కావాల్సిందే

### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : మే 1, 2, 7, 8 తేదీలలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడునని, ఎన్నికల విధు లు కేటాయించిన సిబ్బంది ప్రతి ఒక్కరు శిక్షణ హాజరు కావాల్సిందేనని, ఈ 28న వివి ఎంలపై శిక్షణ ఉంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూ రు ఆదేశించారు. జహీరాబాద్ పార్లమెంటు ని యోజకవర్గం పరిధిలో మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం నియమితులైన పోలింగ్ అధికారులు సహాయ పోలింగ్ అధికారులు ,ఇతర ఎన్నికల సిబ్బందికి మే 1, 2, 7, 8 తేదీలలో వారికి కేటాయించబడ్డ అసెం బ్లీ నియోజకవర్గ కేంద్రాలలో శిక్షణా కార్యక్రమాలు రెండు విడుతలలో ఏర్పాటు చేయనున్నట్లు శనివారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడ్డ ఉద్యోగులందరూ విధిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు. ఎన్నికల విదుల కేటాయించబడ్డ ఉద్యోగులందరూ శిక్షణ కార్యక్రమం కోసం స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శిక్షణకు హాజరు కానీ ఉద్యోగులకు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆదివారం 28న సంగారెడ్డిలోని పిఎస్ఆర్ గార్డెన్లో ఇవిఎం కమిషనింగ్ ఉదయం ఏడు గంటలకు ఏఆర్వోలు ,ఆర్వోలు, సెక్టోరియల్ అధికారులకు ఏఎల్ఎంటీలకు ఇతర సిబ్బందకి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణకు అవసరమైన సామాగ్రిని సైతం సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

**Format C-7**

(for political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates.

(As per the Commission's directions issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition (C) no. 2192 of 2018 in WP((A no.536 of 2011)

**Name of Political Party** :**INDIAN NATIONAL CONGRESS**
**Name of the Election** :**BYE-ELECTION TO LEGISLATIVE COUNCIL**
**Name of State/UT** :**TELANGANA STATE**

1) Name of the Constituency : Bye-Election to Legislative Council from Warangal-Khammam-Nalgonda Graduates Constituency to fill up the seat falling vacant due to resignation of Dr.Palla Rajeshwar Reddy

**Name of the candidate : TEENMAAR MALLANNA**

| **Sl. No.** | | | |
|---|---|---|---|
| **1** | **Criminal antecedents** | | |
| | a. | Nature of the offences | 1. S.353, 506,186,147 r/w149IPC<br>2. S.506, 353, 341 r/w 34IPC<br>3. S.506 IPC, 53(1), (r), (s),S.3(2)(Va)SC&ST Act<br>4. S.501(b), 505(2), 504 &506IPC<br>5. S.505(1)(b),505(2) IPC<br>6. S.505(1) (C), 506, 188,66CIT&S.54DMAct<br>7. S.505(1)(b)&188IPC,S.54 DMA<br>8. S.153, 153(A), 504 &505(2) IPC<br>9. S.504, 505(2), 153,153(A)<br>10. S.469, 509,505(2) IPC<br>11. S.504, 505(2), 505(1) (b)IPC<br>12. S.505(2)&504 IPC<br>13. S.505(1)(b)505(2),504,506&67 IT Act<br>14. S.341,186 &188 IPC&S.30PoliceAct<br>15. S.505(2)IPC<br>16. S.504 &S.171(G) IPC<br>17. S.504, 506 IPC S(3) ®(S),3(2)(Va) SC&STAct 15<br>18. S.420, 506, 386 r/w 120(b)(FIR249/21)<br>19. S.188, 505(1) (B) IPC(FIR1177/20)<br>20. S.469 & 505(2) IPC (FIR832/22)<br>21. S.504, 505(1) (C), 505(2)(FIR1547/22)<br>22. S.504, 505(2) (FIR270/23)<br>23. S.353,506IPC(FIR2041/22)<br>24.<br>25. S.505(2), 507 r/w 120(B)(FIR364/21)<br>26. S.504, 506, 507, 109(FIR699/21)<br>27. S.504 &S.505 IPC<br>28. S.504 &S.506 IPC<br>29. S.504 &S.505 IPC<br>30. S.504 &S.505 IPC<br>31. S.505(2), S.505(1) (C),504,506,189 IPC<br>32. S.505(2), S.505 (1) (C),504,506, 189 IPC<br>33. S.505(2), S.505 (1) (C),504,506, 189 IPC<br>34. S.505(2),504 &506IPC<br>35. S.503IPC<br>36. S.386r/w306IPC&504IPC<br>37. S.323, 341,506,120(B)r/w34 IPC<br>38. S.506, 509,354&67ITAct.<br>39. S.417, 420, 465, 471, 468IPC<br>40. S.504, 505(1)(C),505(2),506IPC<br>41. S.505(1)(C),506IPC,S.54 DMA<br>42. S.153,153(A), 504, 505(2)IPC<br>43. S.341,186 &188 IPC,S.30ofPoliceAct<br>44. S.504IPC<br>45. S.505(2)IPC<br>46. S.469, 505(2)IPC<br>47. S.505(1)(b),505(2)IPC<br>48. S.188, 143,290,341 r/w34IPC<br>49. S.469 &S.505(2) IPC<br>50. S.504, 506, 507 r/w 34IPC<br>51. S.153 A, 505(1) (C), 504IPC<br>52. S.505(2), 504, 505(1) (C)IPC<br>53. S.67IT Act,505(2),505(1)IPC<br>54. S.353,153(A),505(2),505(1)IPC<br>55. S.153(A),505 IPC<br>56. S.153, 189,504,506 r/w34IPC<br>57. S.505(1)(C),505(2),504,153,420 IPCSPA<br>58. S.505(2) &67ITAct<br>59. S.505(2) 509IPC<br>60. S. 504 &505(2) IPC<br>61. S.148,307,342,506,384,109r/w149 IPC<br>62. S.363, 342, 392, 332, 307r/w34 IPCS.7(1)ACCA<br>63. S.509,S.505(1)(C) IPC<br>64. S.505(1)(C),505(2),504,509 IPC<br>65. S.505(1)(b),505(2),504,509IPC<br>66. S.504&505 (2) IPC<br>67. S.153, 294 Br/w134 IPC |
| | b. | Case no. & Name of the Court | 1. IV ACMMLB Nagar, CC/10087/21, Stage: Summons<br>2. PS Medipally, LB Nagar (III MMLB Nagar) CC/10037/21 Summons<br>3. P.S. Medipally SC/70244/21 Investigation Pending (Charge Sheet Not Filed)<br>4. XVII ACM, Nampally CC/8267/20 Disposed<br>5. XIV ACM, Nampally CC/7029/20 Examination<br>6. Cyber, XIIACM, Nampally CC/8087/20 Examination<br>7. P.S. Jubilee Hons XVII ACM Nampally CC/18257/20 Examination<br>8. Armoor PS FIR/2020CC/90/21 Summons<br>9. II AJCJKPHBCC/1583/20 Summons<br>10. Cyber XII ACM Nampally CC/12517/21 Examination<br>11. Cyber XII ACM Nampally CC/12270/21 Examination<br>12. Cyber XII ACM Nampally CC/8477/21 Examination<br>13. Cyber XII ACM Nampally CC/9374/21 Examination<br>14. JCJ, Huzurnagar CC/414/19 Summons<br>15. IX ACM Nampally CC/2418/19 Disposed<br>16. JCJ, Narayankhed CC/37/19 Disposed<br>17. Spl. SC&ST, Nalgonda SC&ST/148/22 Summons<br>18. NZB IV Town PS I Add JFCMNZB CC/242/22 For Trial<br>19. Cyber XII Adl. Nampally CC/7664/22 Examination<br>20. Cyber XII ACM Nampally CC/4130/23 Examination<br>21. Cyber XII ACM, Nampally CC/4132/23 Examination<br>22. Cyber XII ACM, Nampally CC/4284/23 Examination<br>23. Cyber XII ACM, Nampally CC/9142/23 Examination<br>24. CC/1323/21 Disposed<br>25. XII ACM, Rajendranagar CC/1876/22 Summons<br>26. V Addl. MM, LB Nagar CC/3536/22 Appof Accused<br>27. P.S.Nallakunta,Hyd.1482/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>28. P.S. Jubileehills FIR.No. 207/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>29. P.S. Chatrinaka FIR.No. 429/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>30. P.S. Meerchowk FIR.No. 282/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>31. P.S. Gandhinagar FIR.No. 176/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>32. P.S. Kachiguda FIR.No. 274/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>33. P.S. Chatrinaka FIR.No. 268/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>34. P.S. Jawaharnagar FIR.No. 283/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>35. P.S.RGIA Airport FIR.No. 251/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>36. P.S. Chilakalaguda FIR.No. 197/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>37. P.S. Jagdhgirigutta FIR.No. 730/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>38. P.S. CyberCrime, Hyd FIR.No. 1323/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>39. P.S. Chilakalaguda FIR.No.471/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>40. P.S. Jubileehills FIR.No. 330/20 Investigation Pending (Charge Sheet Not filed)<br>41. P.S. Jubileehills FIR.No. 343/20 Investigation Pending (Charge Sheet Not filed)<br>42. P.S. Nandipet FIR.No. 78/20 Investigation Pending (Charge Sheet Not filed)<br>43. P.S. Mellacheruvu FIR.No. 155/ Investigation Pending (Charge Sheet Not filed)<br>44. P.S. Medipally FIR.No. 956/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>45. P.S. CyberCrime, Hyd FIR.No. 777/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>46. P.S. Cybercrime, Hyd FIR.No. 832/ Investigation Pending (Charge Sheet Not filed)<br>47. P.S. CyberCrime, Hyd FIR.No. 864/ Investigation Pending (Charge Sheet Not filed)<br>48. P.S. Hasanparthy FIR.No.165/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>49. P.S. CyberCrime, Hyd FIR.No.553/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>50. P.S. Ghatkessar FIR.No. 699/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>51. P.S. CyberCrime, Hyd FIR.No. 1966/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>52. P.S. CyberCrime, Hyd FIR.No. 1547/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>53. P.S. CyberCrime, Hyd FIR.No.1428/21 Investigation Pending (Charge Sheet Not filed)<br>54. P.S. CyberCrime, Hyd FIR.No. 2275/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>55. P.S. Suryapet-II Town FIR.No. 444/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>56. P.S. Vikarabad FIR.No. 362/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>57. P.S. Dichpally FIR.No. 266/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>58. P.S. CyberCrime, Hyd FIR.No. 1556/22 Investigation Pending (Charge Sheet Not filed)<br>59. P.S. CyberCrime, Hyd FIR.No. 530/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>60. P.S. CyberCrime, Hyd FIR.No. 270/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>61. P.S. Medipally FIR.No. 294/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>62. P.S. Medipally FIR.No. 299/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>63. P.S. L.B.Nagar FIR.No. 484/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>64. P.S. Shamshabad FIR.No. 165/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>65. P.S. Raidurgam FIR.No. 281/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>66. P.S. MiryalagudaIITown FIR.No. 89/23 Investigation Pending (Charge Sheet Not filed)<br>67. P.S. Husnabad FIR.No. 11/23 Investigation Pending (Charge Sheet Not filed) |
| | c. | Name of the Court | As above |
| | d. | Whether charges have been framed or not (Yes/No) | No |
| | e. | Date of conviction, if any | No |
| | f. | Details of punishment undergone, if any | No |
| | g. | Any other information required to be given | NIL |
| 2 | The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words) | | He is a well-known public figure. |
| 3 | Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words) | | As per wishes of the congress workers of the constituency. |

**T.KUMAR RAO**
Sr. Vice President
Authorized Signatory

## కార్మికుల ప్రాణాలు కాపాడిన సాయిచరణ్ ధైర్యం గొప్పది



**ప్రజాపక్షం/కొత్తూరు:** కార్మికుల ప్రాణాలను కాపాడిన సాయిచరణ్ ధైర్య సహాసాలు గొప్పవని నందిగామ తహసీల్దార్ ఎ.రాజేశ్వర్ అన్నారు. శనివారం నందిగామ మండల కేంద్రంలోని ఆల్విన్ ఫార్మసీ పరిశ్రమ వద్ద సాయిచరణ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వర్ మాట్లాడుతూ శుక్రవారం నందిగామ మండల కేంద్రంలోని ఆల్విన్ ఫార్మసీ పరిశ్రమలో చోటు చేసుకున్న సంఘటనలో తాడు సహాయంతో కార్మికుల ప్రాణాలను సాయిచరణ్ రక్షించాడన్నారు. సాయిచరణ్ ధైర్యసాహసాలు యువతకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.లక్ష్మయ్య, ఆర్ఐ కుమారి రోజా, ఎఆర్ఐ వి.శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

## ఉపాధిపనులు వేగవంతం చేయాలి : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/యాచారం :** ఉపాధి పనులను వేగవంతం చేయాలని యాచారం మండలాధికారి నరేంధర్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని చిన్న తూండ్ల, గడ్డమల్లాయగూడ గ్రామాల్లో అయన పర్యటించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఉదయం వేళల్లో వెళ్లి పనులు చేయాలన్నారు. వడదెబ్బ తగులకుండా తగిన జాగ్రత్తలు తీసుకొవాలన్నారు. ఉదయం వెళల్లో పనులు చేయడం ద్వారా వడ్డ దెబ్బ రాకుండా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మతాల మధ్య చిచ్చుపెడుతున్న బిజెపి

### షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మతాల మధ్య చిచ్చుపెట్టి దేశ దోపిడికి పాల్పడుతున్న నరేంద్రమోదీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలందరు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్‌లో నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, శివశంకర్ గౌడ్, చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, వీరేష్, కృష్ణారెడ్డి, రాజు, మహ్మద్ ఇబ్రహీం, రఘు, బాబర్‌ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, అందె మోహన్, ఖధీర్, అశోక్‌లు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేసి చూపిస్తాం

### ఎఐసిసి సెక్రటరీ, ఎన్నికల ఇన్‌చార్జి సంపత్‌కుమార్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణలో దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా అమలు చేసి తీరుతామని ఏఐసిసి సెక్రటరీ, పాలమూరు పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి సంపత్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంపత్‌కుమార్ మాట్లాడుతూ వరుసగా ఎన్నికల కోడ్ కావడం వల్లనే కొంత జాప్యం జరుగుతుందన్న మాట వాస్తమేనని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోసమే మాజీ మంత్రి హరిష్‌రావు రాజీనామ డ్రామా అడుతున్నారని, ఒక ఆర్థిక మంత్రిగా పని చేసి సగం దిమాక్‌తో రాజీనామకు సిద్ధం అనడం విడ్డూరంగా ఉందని సంపత్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి విజయం సాధించడం ఖాయయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, యాదయ్య, సింగిల్‌విండో చైర్మెన్ దామోదర్ రెడ్డి, అందె మోహన్, మహ్మద్ ఇబ్రహీం, విశ్వం, బాల్‌రాజ్ గౌడ్, రవికుమార్ గుప్తా, బాబర్‌ఖాన్, అశోక్, సత్తయ్య, ఖదీర్ పాల్గొన్నారు.

## మేడిపల్లిలో పోలీసుల కవాత్



**ప్రజాపక్షం/యాచారం :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యలో శనివారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో గ్రీన్ ఫార్మాసిటి పోలీస్‌స్టేషన్ సిఐ కె. నర్సింహ్మారావు ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసులు కవాత్ నిర్విహించారు. ఈ సంధర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పార్లమెంటు ఎన్నికలు జరుపుకోవాలన్నారు. పార్టీల నాయకులందరు సమన్వయంగా ఉండి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలు జరుపుకోవాలన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణపురం డివిజన్‌లోని గ్రీన్ హిల్స్ కాలనీలో గడపగడపకు పాదయాత్ర చేస్తూ ఓటును అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఇప్పటికే పలు గ్యారెంటీలు అమలు అవుతున్నాయని, రానున్న రోజుల్లో ఇచ్చిన అన్ని గ్యారెంటీలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమం ధనరాజ్ గౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో అద్భుత ఫలితాలు సాధించిన రెసొనెన్స్ కళాశాలలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెసొనెన్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభతో ఆల్ ఇండియా జెఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో చరిత్ర సృష్టించారు. హైదరాబాద్‌లోని రెసొనెన్స్ జూనియర్ కాలేజీలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆల్ ఇండియా జెఈఈ మెయిన్స్ ఫలితాలలో 100 శాతం, 336 మంది విద్యార్థులు 99 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. మాదాపూర్‌లోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో రెసొనెన్స్ కేంద్రాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఉపాధ్యాయులతో కలిసి జెఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారి తల్లి దండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన జెఈఈ పరీక్షలో దేశం నలుమూలల నుండి 5912 మంది రెసొనెన్స్ విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అర్హులు కాగా ఒక్క హైదరాబాద్ నుండి 750 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అర్హత సాధించడం గర్వకారణమన్నారు.

# కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

### ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికులు ఏకతాటిపైకి వచ్చి మెరుగైన పని పరిస్థితులు, న్యాయమైన వేతనాలు, ఇతర కార్మిక హక్కులను డిమాండ్ చేస్తూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ పిలుపునిచ్చింది.హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రూపొందించిన మేడే పోస్టర్‌ను యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కార్మిక ఉద్యమ విజయాలను జరుపుకోవడానికి, పని పరిస్థితులలో మరింత మెరుగుదల కోసం పిలుపునిచ్చేందుకు కవాతులు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలను కార్మిక సంఘాలు మేడే సందర్భంగా నిర్వహిస్తాయన్నారు. హైదరాబాద్ నగరంలో రవాణా రంగ కార్మికులు వాడవాడలా ఘనంగా మేడేను నిర్వహించాలని కమతం యాదగిరి పిలుపునిచ్చారు. ఎఐటియుసి ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొంరెల్లి బాబు మాట్లాడుతూ అనేక రకాల సమస్యలను ఎదుర్కొనే కార్మికుల ఐక్యతకు మేడే నిదర్శనమన్నారు. యూనియన్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. జంగయ్య మాట్లాడుతూ వేలాదిమంది కార్మికుల రక్తార్పణంతో జరిగిన కార్మిక ఉద్యమమన్నారు. నగరంలో ఉన్న ఆటో కార్మికులందరూ ఆటోస్టాండ్‌లలో ఎర్రజెండాలు ఎగురవేసి మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.బిక్షపతియాదవ్, జె.శ్యంలాల్ నాయక్, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మతంపేరుతో రాజకీయం చేస్తున్న బిజెపిని ఓడించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** దేవుడు, మతంపేరుతో రాజకీయం చేస్తూ మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నా బిజెపిని ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సిపిఐ బాలాపూర్ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో పది సంవత్సరాల బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేక మతవిద్వేషాలు రెచ్చగొట్టి రాముని పేరుతో ఓట్లు అడ్డుకొని మరొకసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. బిజెపి అవకాశవాద రాజకీయాలను, నమ్మడానికి ప్రజల సిద్ధంగా లేరని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీకి తగిన బుద్ధి చెప్తారని రవీంద్ర చారి అన్నారు. మరోసారి బిజెపి గెలిస్తే అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి వేస్తారన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని, బ్యాంకులో దాచిపెట్టిన నల్ల డబ్బు రూ.15 లక్షలు పేదల అకౌంట్లో వేస్తామని చెప్పి మోసం చేశారని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా వస్తువుల మీద పన్నులు వేసి ప్రజలపై మోయలేని భారం మోపారని ఇలాంటి బిజెపి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లు వేయాలని రవీంద్రచారి ప్రశ్నించారు. గత పది సంవత్సరాలుగా ప్రజలపై మోయలేని బాణాలు మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని పీడ విరగడ చేసేందుకే దేశంలో ఇండియా కూటమిని గెలిపించాలని, అందుకు తెలంగాణలో సిపిఐ ఒక్క సీట్లు ఇవ్వకున్న కాంగ్రెస్ పార్టీకి బేశరతుగా మద్దతు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాలాపూర్ మండల పార్టీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు దేరంగుల శంకరయ్య, దశరథ, శివ, యాదమ్మ, అంజయ్య, శత్రునాయక్, రామస్వామి పాల్గొన్నారు.

## 'హిందీ' గొంతు మూగబోయింది

### 'హిందీ మిలాప్' దిన పత్రిక సంపాదకులు వినయ్ వీర్ కన్నుమూత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణాదిలో హిందీ జెండాను ఎగురవేసిన ప్రముఖ జర్నలిస్ట్, 'డెయిలీ హిందీ మిలాప్' దిన పత్రిక సంపాదకులు వినయ్ వీర్ శనివారం కన్నుమూశారు. ఆయనకు 72 ఏళ్లు. తన ఎడిటింగ్, నిర్వహణ శైలితో హిందీని సుసంపన్నం చేసిన వీర్ హిందీని కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు. దక్షిణాదిలో హిందీకి అభివృద్ధి గురించి మాట్లాడినప్పుడల్లా, వినయ్ వీర్ పేరు గుర్తుకు వస్తుంది. స్వాతంత్ర్య సమరయోధుడు యుధ్వీర్, సీతా యుధ్వీర్ కుటుంబంలో జన్మించిన వినయ్ వీర్ నిరంతర పోరాటయోధుడు. సీతా కాంగ్రెస్ నుంచి రాజ్యసభ సభ్యురాలుగా ఉన్నారు. వినయ్ వీర్ బద్రుకా కాలేజీలో విద్యను అభ్యసించారు. వీర్ సీనియర్ జర్నలిస్టు మాత్రమే కాకుండా మంచి ఫోటోగ్రాఫర్ కూడా. ఆయన తన తండ్రి జ్ఞాపకార్థం సృష్టించిన యుధ్వీర్ ఫౌండేషన్‌కు కార్యదర్శిగా కూడా ఉన్నారు. తమ రంగంలో విజయ పతాకాన్ని ఎగురవేసిన వ్యక్తులకు ఈ ఫౌండేషన్ అవార్డులను అందజేస్తోంది.

#### నేడు అంత్యక్రియలు

వీర్ అంత్యక్రియలు ఆదివారం ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్‌లో మహా ప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీర్ అంతిమ యాత్ర ఉదయం 9 గంటలకు కట్టల్‌మండిలోని ఆయన నివాసం నుండి ప్రారంభమవుతుంది.

#### ముఖ్యమంత్రి సంతాపం

హిందీ మిలాప్ పత్రిక ఎడిటర్ వినయ్ వీర్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పత్రికా ప్రపంచానికి తీరని లోటని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్‌గా ఆయన హిందీ మీడియాకు అందించిన సేవలను సిఎం గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే విధంగా వినయ్ వీర్ మృతి పట్ల రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమీషనర్ హనుమంతరావు సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రాజకీయాలకతీతంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతు

### సంగీతారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** సార్వత్రిక ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ లోని ప్రజలంతా రాజకీయాలకతీతంగా బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి వెంటే ఉంటారని ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హోటల్ దస్‌పల్ల లో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సంగీతా రెడ్డి మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉండే నాయకుడని అన్నారు. చేవెళ్ల ప్రాంతంలోని ప్రజలంతా తమ తమ పార్టీలను పక్కనపెట్టి వ్యక్తిగతంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతునిస్తున్నారని చెప్పారు. విద్యావంతులు, మహిళలు భారతీయ జనతాపార్టీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికలో అర్బన్ ప్రాంత ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొనాలని సంగీతారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలంతా తమ కోసం, తమ పిల్లల భవిష్యత్తు కోసం నరేంద్ర మోడీని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, మేధావులు, ఐటీ నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతకు మార్గనిర్దేశం చేసిన బిజెపి

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నార్సింగి:** సంస్కృతి, సాంప్రదాయాల పట్ల యువతకు మార్గ నిర్దేశం చేసిన పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం శంషాబాద్‌లోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన బిజెపి యువ మోర్చా యువ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఎంతోమంది యువతీ, యువకులకు ఉపాధి మార్గాలు చూపిందన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోడీ సర్కారును అబాసు పాలు చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మోడీ వెంట యువత నిలబడాలని విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో బొక్క నరసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.





#### మైనార్టీ, మహిళలు, విద్యావంతుల మద్దతు మాకే

**శేరిలింగంపల్లి:** ముస్లిం, మైనార్టీవర్గాల్లోని విద్యావంతులు, మహిళలు భారతీయ జనతాపార్టీకి మద్దతు తెలుపుతున్నారని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని ఎన్నికల్లో న్యాయబద్ధంగా కాంగ్రెస్ ఎదుర్కోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో రవికుమార్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, హరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సిఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో : మధుయాస్కీ



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** ఆదివారం సాయంత్రం వనస్థలిపురంలో నిర్వహించే సిఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోను జయప్రదం చేయాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాస్కీగౌడ్ కోరారు. శనివారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న కార్నర్ మీటింగ్, రోడ్ షోలను ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్గిరి పార్లమెంట్‌లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి అతన్ని కేసీఆర్ బలిచేశాడని పేర్కొన్నారు. సొంతపార్టీ ఎంఎల్‌ఎ మాజీ మంత్రి మల్కాజ్గిరిలో ఈటల రాజేందర్ గెలుస్తాడంటూ స్వయంగా బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ చామకూరి మల్లారెడ్డి చెప్పడం వెనుక బిజెపి, బిఆర్ఎస్‌ల తెరచాటు ఒప్పందానికి నిదర్శనం అన్నారు. పదేళ్ల దుర్మార్గ పాలనను అంతమొందించిన ప్రజలు.. రేపు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 15 సీట్లు ఎంపీగా పక్కా సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో 118 జీవో ద్వారా ప్రజలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మోసం చేశారని, రెగ్యులరైజేషన్ ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని సుందరీకరణ చేసి కాలుష్యాన్ని నివారించాలన్న లక్ష్యంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఐదు న్యాయ గ్యారెంటీలతో దేశంలో అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పనిచేస్తుందని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్ గౌడ్, కుట్ల నరసింహ యాదవ్, ముకుటం సదాశివుడు, లింగాల కిషోర్‌గౌడ్, రజినిరావు, రాజేశ్వరి, విద్యారెడ్డి, శ్రీనివాస్, చెరుకు భవాని, బత్తుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నేతలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బిఆర్ఎస్ పార్టీ నేత కట్టా వెంకటేష్ గౌడ్ సొంత గూటి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన కట్ట వెంకటేష్ గౌడ్‌తో పాటు వారి అనుచర వర్గాన్ని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్, మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హస్తం గుర్తు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సమన్వయం పని చేసి చల్లా వంశీచంద్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రాజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ విశ్వం, బస్వమప్ప, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ గౌడ్‌లు పాల్గొన్నారు.



# ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** చేవేళ్ళ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని,ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.శశాంక తెలిపారు.శనివారం లోక్ సభ ఎన్నికలను పురస్కరించుకుని చేవేళ్ళకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా,పోలీస్ అబ్జర్వర్ రాజీవ్ చావ్రాలు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో చేవేళ్ళ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఎఆర్ఓలు, పోలీస్ అధికారులు, నోడల్ ఆఫీసర్లతో భేటీ అయ్యారు. రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పరిశీలకులతో భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్,కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి రిటర్నింగ్ అధికారి శశాంక అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్,శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ సేహ్న, వికారాబాద్ అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, ఉమా హారతి, ఎఆర్ఓలు,నోడల్ అధికారులు, డిసిపిలు, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

#### ఫిర్యాదులకు పరిశీలకులను సంప్రదించవచ్చు

ఫిర్యాదులు,సూచనలకై పరిశీలకులను సంప్రదించవచ్చు నని చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శశాంక అన్నారు. చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయదలచిన వారు జనరల్ అబ్జర్వర్ ను సెల్ నెంబర్ 7032666271 ద్వారా సంప్రదించవచ్చని, సూచించారు. పోలీసు పరిశీలకులుగా కాలురామ్ రావత్ వ్యవహరిస్తున్నారని, సెల్‌నెంబర్ 7032666272, ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.వ్యయ పరిశీలకులుగా,రాజీవ్ చావ్రా,పి.సెంథిల్ కుమార్, వ్యవహరిస్తున్నారని, రాజీవ్ చావ్రా సెల్ నెంబర్ 7032666274,పి. సెంథిల్ కుమార్ సెల్ నెంబర్ 7032666273 ద్వారా వ్యయ అబ్జర్వర్లను సంప్రదించవవచ్చని సూచించారు.

## అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై దాడి

### ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిరూపించలేని తప్పుడు కేసులతో సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి జైలుకు పంపడం ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై ప్రధాని మోదీ ప్రభుత్వం దాడులు చేయడమేనని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో బెంగళూరుకు చెందిన ఆప్ కార్యకర్త, స్విగ్గి డెలివరీ బాయ్ మనోజ్‌కుమార్ యాదవ్ చేపట్టిన దేశవ్యాప్త బైక్ యాత్ర శనివారం హైదరాబాద్ చేరుకుంది. హైదరాబాద్ లిబర్టీ, ఆప్ రాష్ట్ర కార్యాలయం వద్ద డాక్టర్ దిడ్డి సుధాకర్, ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్ తదితరులు మనోజ్‌కుమార్ యాదవ్‌కు ఘనస్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మనోజ్‌కుమార్ యాదవ్ బైక్ యాత్ర చేపట్టడం, అందులో భాగంగా ప్రజాస్వామ్య రక్షణ కోసం 'ఇండియా' కూటమిని గెలిపించాలని ప్రజలను కోరడం అభినందనీయమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అడ్డగోలుగా గెలవడానికి ప్రతిపక్ష పార్టీలను బలహీనపరిచేందుకు బిజెపి చేస్తున్న కుట్రలలో భాగమే అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అన్నారు. ఎలెక్టోరల్ బాండ్స్ ద్వారా బిజెపి బలవంతపు వసూళ్లకు పాల్పడి ఎన్నికలు తారుమారు చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర ప్రతినిధులు జావేద్ షరీఫ్, విజయ్ మల్లంగి, దర్శనం రమేశ్, సోహేల్, అహసాన్, శివాజీ, మౌనిక పాల్గొన్నారు.

## మార్నింగ్‌వాక్‌లో మల్లురవి ప్రచారం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కాంగ్రెస్‌పార్టీ ఎంపి ఎన్నికలప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి డాక్టర్‌మల్లురవిని గెలిపించాలని వాలీబాల్ ప్లేయర్స్, కరాటేకోచర్‌తో,బస్టాండులో ఆర్‌టిసిడ్రైవర్లు , కండక్టర్లు, ప్రయాణికులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మల్లురవితో పాటు పట్టణంలోని మాజీ ఎంఎల్‌ఏ మోహన్‌గౌడ్, టిపిసిసి సభ్యులు వల్లభరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు భగవంత్‌రెడ్డి, జడ్చర్లమాజీ మార్కెట్‌కమిటిచైర్మన్ రమేష్‌రెడ్డి, జిల్లా జిల్లాముస్లిం మైనార్టీజిల్లా అధ్యక్షులు పార్లమెంట్ ఇంచార్జీ ఎండి హబీబ్‌రెహమాన్, తెలకపల్లి మాజీ జడ్పిటిసి నారాయణగౌడ్, 24వవార్డు కౌన్సిలర్ నిజాముద్దిన్, 13వవార్డు కౌన్సిలర్ కావలిశ్రీనివాసులు ప్రచారం నిర్వహించారు.

## 'సి–విజిల్' ద్వారా ఫిర్యాదు చేయండి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లయితే ప్రజలు ఎన్నికల కమీషన్ ప్రత్యేకంగా రూపొందించిన సివిజిల్ యాప్‌ద్వారా ఫిర్యాదు చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరభ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఏదైనా అభ్యంతరాలు ఫిర్యాదులుంటే కమాండ్ కంట్రోల్‌రూమ్ గ్రీవెన్స్ పోర్టల్, 1950కి సంప్రదించాలన్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల కలెక్టరేట్ కార్యాలయాల్లో సివిజిల్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు, బహుమతులు, మద్యంపంపిణీ, అనుమతిలేకుండా ప్రైవేట్ ఆస్తులపై పోస్టర్లు, ప్రచారం ఓటర్లకు బెదిరింపులు , రాత్రి 10గంటల తర్వాత ప్రచారం తదితర వాటిపై సివిజిల్‌యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మనదగ్గర ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్‌ప్లేస్టోర్,యాపిల్‌స్టోర్‌నుంచి సివిజిల్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని అందులో మన వివరాలతో లాగిన్ అవ్వాలి. ఆతర్వాత ఎక్కడైనా డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీగాని, సరఫరాకాని జరిగినట్లు గుర్తిస్తే వాటిని రహస్యంగా సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీసి వాటిని సివిజల్‌యాప్‌లో అప్‌లోడ్ చేసి వివరాలు వెల్లడించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

## మేడే ఘనంగా నిర్వహించాలి

### ఎఐటియుసి పిలుపు




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** 138వ మేడే దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారిభవనంలో జరిగిన ఎఐటియూసి జిల్లాకౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా నగరం హేమార్కెట్‌లో 1886 మే 1న సమ్మె చేయాలని నిర్ణయించిన ప్రపంచకార్మికసంఘాల సమైక్య సోషలిస్టు కార్మికసంఘాల సమ్మె హే మార్కెట్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల సందర్భంగా 8గంటల పనిదినంకై కార్మికులు కదంతొక్కారన్నారు. పెట్టుబడిదారులు వారిగుండాలు పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎంతోమంది చనిపోయారన్నారు. ఆపోరాటానికి గుర్తుగా మే 1న నిర్వహించే మేడేను అమరవీరుల మరణానికి శ్రద్ధాంజలిఘటిస్తూ ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా అధ్యక్షుడు తప్పెటకిరణ్‌కుమార్, ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, బాలపీరు, భీమయ్య, ఎఐటియూసి జిల్లా కౌన్సిల్‌మెంబర్స్ యాదయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, వెంకటస్వామి, రవీందర్, చంటి, ప్రదీప్ పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలను అవమానించడం దారుణం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానించేలా వ్యాఖ్యలుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ బిఆర్‌ఎస్‌పార్టీ ఎంపి అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బిఆర్‌ఎస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పార్టీజిల్లా కార్యాలయంలో జెండా ఎగరవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ అమరవీరుల స్థూపం మోసాలకు చిరునామా అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడమంటే అమరవీరులు వారి కుటుంబాలను అవమానించడమేనన్నారు. ఇంద్రవెల్లిలో ఆదివాసీలపై కాల్పులుజరిపి చంపింది, బాబ్రీమసీదు కూల్చివేసింది కాంగ్రెస్‌పార్టీ హయాంలోనేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరుగ్యారంటీల అమలుపై బడ్జెట్‌ను ఎలా కేటాయిస్తారో తెలపాలన్నారు. రాజ్యాంగాన్ని రద్దుచేస్తానన్న బిజెపి దేశాన్ని పాలించే అర్హతలేదన్నారు. బిజెపికి అభ్యర్థులు కరువయ్యారన్న ఆయన తెలంగాణలో బిజెపిబలపడే అవకాశం లేదన్నారు.ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌చేస్తున్న మోసాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీజిల్లా అధ్యక్షులు గువ్వలబాలరాజు, మాజీ ఎంఎల్‌ఏ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీసర్పంచ్‌లు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వెల్దండ , కల్వకుర్తి మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం కెసిఆర్‌గార్డెన్‌లో ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్లురవి, ఎంఎల్‌ఏ కసిరెడ్డినారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో వెల్దండ మండలానికి చెందిన మాజీసర్పంచులు రాములు భక్యానాయక్, బిఆర్‌ఎస్ నాయకులు వజీర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్‌పార్టీకండువాకప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని భారీమెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు కృషిచేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

## ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న బిఆర్‌ఎస్



**ప్రజాపక్షం/జడ్చర్ల :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, పార్టీ అధ్యక్షుడు రఘుపతి, యాదయ్య కేక్ కట్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల గుండెల్లో స్థిరంగా ఉన్న పార్టీ బిఆర్‌ఎస్ పార్టీ అన్నారు. తెలంగాణ అన్ని వర్గాలను ఏకం చేసిన బిఆర్‌ఎస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మి , కౌనిసిలర్స్, రమేష్, దేవా, చైతన్య, ఉమాశంకర్ గౌడ్, పిట్టల మురళి, మూఢ డైరెక్టర్స్ ఇమ్ము. శ్రీకాంత్, శంకర్ నాయక్, ప్రణీల్ చందర్, రేణుక, బాలు, కరాటే శ్రీను, 6, పార్టీ ప్రజా ప్రతినిధులు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### పాలమూరును గోస పెట్టి

# మొసలి కన్నీరు ఎందుకు?

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** పాలమూరును గోస పెట్టి ఇప్పుడు మొసలి కన్నీరు ఎందుకు కారుస్తున్నావు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు తెలంగాణ ఉద్యమాన్ని బ్రతికించడమే కాదు కెసిఆర్‌కు రాజకీయ భిక్ష కూడా పెట్టిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత ముఖ్యమంత్రి అయినటువంటి కేసీఆర్ తనకు భిక్ష పెట్టిన పాలమూరును తుంగలో తొక్కి, పాతిక లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పాలమూరు రంగారెడ్డి ని నిర్వీర్యం చేసి, కాలేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్ల రూపాయలు పెట్టి మొదటి ద్రోహం చేశారని ఆయన మండిపడ్డారు. ఏ కృష్ణ నది నీరు కోసం అయితే ఉద్యమాలు జరిగాయో, ఏ పోతిరెడ్డిపాడు కోసం పాలమూరు ప్రజలు గొంతెత్తి తెలంగాణ రాష్ట్ర రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటన్నింటిని కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తో కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడి మన పాలమూరు ప్రజలను నిలువునా మోసం చేశారని అని ఆయన అన్నారు. 93 వేల క్యూసెక్కుల నీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోతిరెడ్డిపాడు నుంచి దొంగచాటుగా దోచుకుపోతుంటే జగన్మోహన్ రెడ్డితో చీకటి ఒప్పందం కుదుర్చుకుని ఆంధ్రప్రదేశ్ లోని ఎంపీ సీట్ల లాలూచీ పడి టీఆర్‌ఎస్ పార్టీని బిఆర్‌ఎస్‌గా మార్చింది కెసిఆర్ స్వార్థం కాదా అని ఆయన ప్రశ్నించారు. భిక్ష పెట్టిన పాలమూరును సస్యశ్యామలం చేస్తా వేలకొద్ది కంపెనీలు తెచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని కాకమ్మ కబుర్లు చెప్పి పది సంవత్సరాల కాలంలో ఒక్క సాగునీరు ప్రాజెక్టు పూర్తి చేయలేదని, పట్టుమని పది కంపెనీలు కూడా పాలమూరుకు తేలేదు కాని, తన సొంత జిల్లా అయినా మెదక్‌కు మాత్రం వందల కొద్ది కంపెనీలను తెచ్చి అక్కడ అభివృద్ధి చేయడం జరిగింది. ఆయన స్పష్టం చేశారు. అందుకే మన పాలమూరు ఓటర్లు చాలా విజ్ఞత తోటి గత అసెంబ్లీ ఎన్నికలల్లో ఏకంగా 14 సీట్లకు గాను 12 సీట్లను ఇచ్చి ముఖ్యమంత్రి స్థానంలో మన పాలమూరు బిడ్డ గౌరవనీయులు రేవంత్‌రెడ్డి ని కూర్చోబెట్టారని ఆయన చెప్పారు. పాలమూరు పర్యటనలో న్ని రుణమాఫీని గురించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని కేసీఆర్ అంటే హాస్యాస్పదంగా ఉందని, నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 ఎన్నికల వాగ్దానంలో ఏకకాలంలో లక్ష రుణమాఫీ చేస్తా అని వాగ్దానం చేసి రెండు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ, ప్రజలు, రైతులు పోరాటం చేస్తే కానీ రెండు సంవత్సరాల తర్వాత మొదటి విడతగా కేవలం 25 వేల లోపు రైతు రుణం కలిగిన 3 లక్షల మందికి మాత్రమే రుణ మాఫీ చేసిన చరిత్ర మీదని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపితో ఉన్నటువంటి లోపాయికారి ఒప్పందంతో పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించలేదని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోతుందని కనీసం డిపాజిట్ కూడా దక్కదని తెలిసి కొత్త నాటకాలకు బిఆర్ఎస్ పార్టీ తెర లేపుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, ఎన్‌పి వెంకటేశ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, సిజె బెనహర్, ఐఎన్‌టియుసి రాములు, లక్ష్మణ్ యాదవ్, ఏర్పుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

### కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంకా గోపాల్ డిమాండ్



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండలంలో కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటటే కొనాలని, కేంద్రాల వద్ద రైతులకు వసతులు కల్పించాలని సిపిఐ అనుబంధ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంకా గోపాల్ డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో బొల్లారంలో ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వారం రోజుల క్రితం తెచ్చిన ధాన్యం ఇంకా కొనుగోలు చేయలేదన్నారు. తీవ్రమైన ఎండలు ఉన్నాయని , 2 రోజుల్లో ప్రభుత్వం నిర్ధేశించిన 17 శాతం తేమ వస్తుందన్నారు. వారం రోజుల పాటు రైతులను పడిగాపులు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. కొన్ని గ్రామాల్లో ఇంకా కేంద్రాలను తెరవలేదని వెంటనే తెరవాలని , ధాన్యం తెచ్చిన చోట ఇంకా కొనలేదని, వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. కొన్న ధాన్యం వెంటనే మిల్లలకు తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచాలన్నారు. బొల్లారంలో నిన్న ధాన్యం కొన్న ఇప్పటికి వాహనాలు లేక తరలించలేదన్నారు. ధాన్యం కొన్న రెండు రోజుల్లో రైతుల అకౌంట్లో డబ్బులు వేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి వసతులు లేవన్నారు. నీళ్లు, నీడ, ఓఆర్‌ఎస్ పాకెట్లు ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వసతులు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. సిపిఐ జిల్లా నాయకులు చల్మారెడ్డి, ఎం. కుర్మయ్య, మండల నాయకులు ఎండి అమీర్ , దగడపల్లి కురుమయ్య, చింతకుంట గోవిందు, తూళ్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ నుండి బిజెపిలోకి ముఖ్య నాయకులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలంలోని పాలెం గ్రామంలో టీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీ పార్టీలోకి వెళ్లిన టీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో బీజేపీ కండువా కప్పుకొని రాణి రుద్రమదేవి పార్టీల్లోకి వచ్చిన అందరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరు నరేంద్రమోడీకి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. రావుల రవీంద్రనాథ్ రెడ్డి, కొండ ప్రశాంత్‌రెడ్డి, డోకూర్ పవన్ కుమార్, భరత్ భూషణ్, నాయకులు పాలెం గ్రామ నాయకులు పాల్గొన్నారు.




## జడ్చర్ల మున్సిపల్ సిబ్బంది స్వీప్ ర్యాలీ

**ప్రజాపక్షం / జడ్చర్ల :** శనివారం నాడు జడ్చర్ల మున్సిపాలిటీ, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో స్వీప్ ర్యాలీ నిర్వహించబడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జడ్చర్ల లో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమీషనర్ రాజయ్య, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ నేతృత్వంలో ర్యాలీ లో పలు నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా కళాబృంద వారు చౌరాస్తాలో ప్రజలను చైతన్య పరుస్తూ పలు గీతాలు ఆలపించారు. స్వీప్ నోడల్ అధికారి డా. శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ ఓటరు చైతన్యం కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా మహిళా సంఘాలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ సిబ్బంది తప్పక తమ తమ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ రాజయ్య మాట్లాడుతూ ఓటు చాలా విలువైనదని, మే 13 వ తేదీన నిర్వహించబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటేయాలని, ఏ ఒక్కరి ఓటు కూడా వ్యర్థం కాకుండా, అందరూ ఓటింగ్ లో పాల్గొనాలని అన్నారు. 18 సం. దాటిన ప్రతీ ఓటరు తమ ఓటు భక్కును సద్వినియోగం చేసుకొవడానికి కృషి చేయాలని అన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో పలు నినాదాలిచ్చారు. 1. బుల్లెట్ కన్న, బ్యాలెట్ మిన్న 2. ఎన్నికల పర్వం. దేశానికి గర్వం 3. నిర్భయంగా ఓటేద్దాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం. 4. ఓటేసే బాధ్యత. మనందరి బాధ్యత 5. ఓటరు చైతన్యం. ప్రజాస్వామ్య ప్రభంజనం 7. ఓటు హక్కు. ప్రజల హక్కు వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత బృందంచే పలు ఆకర్షణీయమైన పాటలు, గీతాలాపనతో ఆకట్టుకున్నారు. ఓటర్లందరూ ఓటింగ్ లో పాల్గొనేలా తమ బంధువులు, సమీప ఓటర్లను ఓటింగ్ చైతన్యం చేయాలని పాటలతో, గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేష్, మెప్మా జడ్చర్ల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సునీత, లక్ష్మి , మాసూం బాబా, సాధిక్, 200 మందికి పైగా మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పల్లెల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌కి ఓటేయాలి

పజాపక్షం / కొత్తకోట : కొత్తకోట మండలంలోని రాణిపేట గ్రామంలో పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలుపుకై ఇంటింటి ప్రచారంలో భాగంగా కొత్తకోట మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి , మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి మాట్లాడుతూ చల్లా వంశీచందర్ రెడ్డి గెలుపుకోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని మన పాలమూరు బిడ్డా చల్లా వంశీచంద్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అంతేకాకుండా ఉపాధి కూలీలు చేసేవారి దగ్గరకు వెళ్లి గతంలో జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టింది. కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితే శ్రామిక న్యాయం పథకం కింద రోజువారి వేతనం 400లు ఉంటుందని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ పంచ న్యాయాలు యువకులకు, నిరుద్యోగులకు, రైతులకు, మహిళలకు , కార్మికులకు పెద్దపీట వేసిందన్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్లమెంట్ అభ్యర్థి, చల్లా వంశీచందర్‌రెడ్డికి చెయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీజేపీకి, బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్పాలని ఇంటింటి ప్రచారంలో అన్నారు.

## వృషభరాజల బండలాగుడు పోటీలు

### ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**పజాపక్షం / వనపర్తి టౌన్ :** శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం గోపాల్ పేట మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభరాజ బండలాగుడు పోటీలను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఉత్సవాల్లో సందర్భంగాల్లో గ్రామాల్లో నిర్వహించే బండలాగుడు పోటీల కార్యక్రమంతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంటుందని, బండలాగుడు పోటీలు ప్రత్యేక ఆకర్షణగానిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణులకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట కాంగ్రెస్ నాయకులు సత్యశీలా రెడ్డి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు మంగదొడ్డి నాగేశేషు యాదవ్ , యూత్ అధ్యక్షుడు ఎండి బాలపీరు, మాజీ ఎంపిటీసీ మేస్త్రీ బాలయ్య, కోదండం, వార్డు మెంబర్ వెంకటయ్య, బుచ్చన్న నాయక్ , మెకానిక్ శంకర్ , మేస్త్రీ శివ, కొంకలి కృష్ణయ్య, ధన్వాడ , నాగరాజు, పార్థసారథి, ఉప్పరి యాదగిరి, తెలుగు బాలయ్య, శివాలు, కిషోర్ , శివుడు వెంకటేష్ , అనంతరాములు వెంకట్‌రెడ్డి, మల్లేష్ , వెంకటేష్ , రవి, శంకరయ్య, కోదండం, చరణ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులదే





**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులదేనని భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుకుమార్ నారాయణ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వామపక్ష, దళిత బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'భారతదేశంలో ప్రజాస్వామ్యం ,రాజ్యాంగ విలువలకు సవాళ్లు: పౌరులు, పౌర సంస్థల బాధ్యత' అనే అంశంపై ఒయులోని ఆర్ట్స్ కళాశాలలోని రూమ్ నంబర్ 121లో శనివారం చర్చ నిర్వహించారు. ఈ చర్చకు డాక్టర్ ఆమంచి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ సుకుమార్ నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత భారత ప్రజాస్వామ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉ ందన్నారు. భారత గణతంత్రం పౌరులకు సామాజికఆర్థిక సమానత్వం అందించాల్సిన బాధ్యతను వారు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య రాజ్యాంగ విలువలను విచ్ఛిన్నం చేసేందుకు అధికారంలో ఉన్న పాలకులు చేసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజికఆర్థిక అసమానతలను పరిష్కరించేందుకు కుల గణన అత్యవసరమన్నారు. సమానత్వం, సంపద పంపిణీ, బలమైన ప్రతిపక్ష పార్టీలు , చట్టం నిష్పాక్షికత,రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండటమే ప్రజాస్వామ్యమని వివరించారు. ప్రజల సంక్షేమానికి సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం అనివార్యమన్నారు. రాజ్యాంగ,ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జరిగే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఇటువంటి ఉద్యమాల పట్లకు అవగాహన పెంచి, మద్దతు కూడగట్టడంలో సోషల్ మీడియా కీలక పాత్రను వారు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కుతాడి అర్జునరావు, వైస్ ప్రిన్సిపాల్ బీనవేని రామ్ షెపర్డ్, డాక్టర్ కొండా నాగేశ్వరరావు, డాక్టర్ సమున్నత, డాక్టర్ వంశీధర్ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



## బిఆర్‌ఎస్ అధినేతకు భారీ షాక్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మహబూబ్‌నగర్ పర్యటన ముగించుకున్న తరువాతి రోజే బిఆర్‌ఎస్ కార్యకర్తలు పార్టీ అధినేతకు భారీ షాక్ ఇచ్చారు. శనివారం 200 మంది బిఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, కౌన్సిలర్ పాపారాయుడు, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షులు మల్లు నర్సింహరెడ్డి, ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ మున్సిపాల్ పరిధిలోని 35 వార్డు, 17వ వార్డు, గ్రామీణ మండల పరిధిలోని బొక్కలోనిపల్లి , తెలుగు గూడెం, ఒబులాయిపల్లి తాండ, రాంచంద్రపూర్, ధర్మాపూర్ గ్రామాలు నుంచి భారీ ఎత్తున బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు , కార్యకర్తలకు ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం కలిసి వస్తున్న మీ అందరికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజలకు భరోసా కల్పించేందుకు పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఎన్‌పి వెంకటేశ్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, కౌన్సిలర్ మోయిన్ అలి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, జాజిమొగ్గ నర్సింహులు, పాపారాయుడు, మల్లు నర్సింహరెడ్డి, ఖాజాపాషా పాల్గొన్నారు.

## డికె అరుణకు మద్దతుగా ప్రచారం



**ప్రజాపక్షం/నర్వ:** నర్వ మండలం రాంపూర్ గ్రామంలో బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన మహిళలు బిజెపి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ కి మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించడం జరిగింది. గ్రామంలోని మహిళలు గ్రామ సమస్యల గురించి బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. మీరు అడిగిన సమస్యలు త్వరలోనే తీరుస్తాను అని హామి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కుర్వ సత్యం, జిల్లా నాయకులు వావిళ్ల నరేందర్ రెడ్డి, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వావిళ్ల రవి కుమార్ రెడ్డి, మండల నాయకులు నాగేశ్వర్ రెడ్డి , యాదవ్ రెడ్డి, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సతీష్, గడ్డం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల పరిధి లోని సంగినేనిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు డా. ఇంద్రకంటి వెంకటేష కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో గతవారం అనారోగ్యంతో మృతి చెందిన మైలారం బాలయ్యకుటుంబానికి రూ. 5వేలు , అదేవిధంగా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ వార్డు సభ్యులు మీసాల రాజుకు రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు డా. ఇంద్రకంటి వెంకటేష్ , వికలాంగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మీసాల మోహన్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేస్తూ వారిని ఆదుకోవడంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఎప్పుడు ముందుంటారని కొనియాడారు. ఈ సందర్భంగా వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల కురుమయ్య ఉడుత కురుమయ్య, గోవుల నాగరాజు, సగణమోని జగదీష్ , మీసాల రాజు పాల్గొన్నారు.

## హరీశ్‌రావు రాజీనామా ప్రజలు నమ్ముతున్నారు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హరీశ్‌రావు రాజీనామా సవాల్‌ను ప్రజలు నమ్ముతున్నారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి. వివేకానంద అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటె, తన రాజీనామా పత్రాన్ని తనకు ఇకిష్టమైన వ్యక్తి వద్ద పెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో హరీష్ రావు ను తిట్టించే బదులుగా గ్యారంటీలు, రుణ మాఫీపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.

## గోడం నగేష్‌పై సిఇవోకు ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎన్నికల అఫిడవిట్ ఫారంలో బిజెపి ఆదిలాబాద్ ఎంపి అభ్యర్థి గోడం నగేష్ పూర్తి వివరాలను నింపలేదని బిఆర్‌ఎస్ నాయకులు సిఇవో వికాస్‌రాజుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌తో పాటు ఆశీష్ సిఇవోకు లేఖ అంద జేశారు. అనంతరం దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ఈ అంశంపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బిజెపి అభ్యర్థి దరఖాస్తును తిరస్కరించి, అధికారిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా బిజెపికి అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు.

## పాలీసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలీసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకునే గడువును ఆదివారం వరకు పెంచినట్టు హైదరాబాద్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రాజేశ్వరి దేవి తెలిపారు. పూర్తి వివరాలకు http://polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.100 ఆలస్య రుసుముతో ఈనెల 30వ తేదీ వరకు, రూ.300ల ఆలస్య రుసుముతో మే 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించినట్టు ఆమె తెలిపారు.

## కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు

### కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మైనార్టీల ఓటు బ్యాంకును అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండాపూర్ డివిజన్‌లోని మార్తాండనగర్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు చేసి అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. హాఫీజ్‌పేటలోని మార్తాండ నగర్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కొండాపూర్ మీదుగా కొత్తగూడ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇండియా కూటమిలో ప్రధానమంత్రి ఎవరో చెప్పుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. మైనార్టీల జపం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ తన పార్లమెంటు స్థానాన్ని విడిచిపెట్టి పారిపోయి కేరళలో పోటీ చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడ మైనార్టీలు ఎక్కువ ఉంటే అక్కడ నుండి పోటీ చేసి గెలవాలని రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని కొండా విమర్శించారు. కార్యక్రమంలో సమావేశంలో శేరిలింగంపల్లి బిజెపి నాయకులు రవికుమార్ యాదవ్‌తో పాటు పలువురు బిజెపి సీనియర్ నాయకులు, విశ్వేశ్వర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## రైలులో తరలిస్తున్న అక్రమ మద్యం స్వాధీనం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** రైలులో అక్రమంగా రవాణ చేస్తున్న అక్రమ మద్యంపై ఆర్‌పిఎఫ్ పోలీస్, ఎక్సైజ్ పోలీస్ అధ్వర్యంలో వస్కోడిగమ రైల్‌లో గోవ నుండి జైషిడ్ వెళ్ళే రైల్‌లో అక్రమంగా తరలిస్తున్న 32 బాటిల్ అక్రమ మద్యం పట్టుకోని ఆర్‌పిఎఫ్ సిఐ రాజేంద్రప్రసాద్ ఎక్సైజ్ ఎస్‌సిఐకి అంజనేయులుకు అప్పగించడం జరగింది అని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సీజ్ చేసిన మద్యం విలువ సుమరుగా 37,632 మార్కెట్ విలువ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## రెండవ విడత ర్యాండమైజేషన్ పూర్తి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ సిబ్బందికి సంబంధించిన రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు అభిషేక్ ఆగస్త్య, విజయేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, డిఇఒ విజయ కుమారి ఇతర సంబంధిత అధికారులతో కల్సి నిర్వహించిన రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి,ఉప్పల్ అసెంబ్లీ సెంగ్మెంట్లకు సంబంధించి 2425 పోలింగ్ కేంద్రాలకు గాను 12230 మంది సిబ్బందిని ఎంపిక చేసారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ వినియోడిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను 2861 బృందాలు ఉన్నాయన్నారు.

## పెద్ద చెరువులో పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పెద్ద చెరువులో వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వెస్ట్ మారెడ్‌పల్లికి చెందిన బత్తుల కుమార్(45) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరిన కుమార్ బొల్లారం చెరువు దగ్గర ఉన్నానని ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు ఫోన్‌చేసి చెప్పాడు. కుటుంబీకులు బొల్లారం చెరువు వద్దకు వెతికారు. ఫలితం లేకపోవడంతో శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. చెరువు పరిసర ప్రాంతాల్లో వెతకగా ఫోన్, చెప్పులు, లభించాయి. మృతదేహం కోసం గాలించగా మృతదేహం లబించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి



**ప్రజాపక్షం/నవాబుపేట్:** ప్రజలు తమ అమూల్యమైన ఓటు కాంగ్రెస్‌కే వేయాలని ఆర్కతల మాజీ సర్పంచ్ వడ్డె రాములు అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం ఆర్కతల గ్రామంలో బీ బ్లాక్ అధ్యక్షులు మధుసుధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వడ్డె రాములు, ఎంపిటిసి యాదయ్య, ఉప సర్పంచ్ సంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మతతత్వ పార్టీలు ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రజలు వారికి ఓటుతో బుద్ది చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ కార్యకర్తలు తిరిగి ప్రచారం చేసి రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శేఖర్, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మ రెడ్డి, గోపాల్, వెంకటయ్య, యాదయ్య, దేవయ్య, మాణేయ్య, రాములు, బాగయ్య, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను చెల్లించిన చైర్మన్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/నాగారం:** మున్సిపాలిటీ ప్రజలందరూ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,కమిషనర్ రాజేందర్‌కుమార్ అన్నారు. ఆర్థిక సంవత్సరం 2024–25 ఆస్తి పన్నును మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి రాయితీతో చెల్లించారు.మరో మూడు రోజులలో 5 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆస్తి పన్నును చెల్లించాలని వారు అన్నారు.ఇంటి పన్నును సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ ఆభివృద్ధికి సహకరించాలన్నారు.ఆదివారం కూడా కార్యాయంలో కౌంటర్ అందుబాటులో ఉంటుందన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సహకరిస్తాం

### సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి సత్యం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సునీతారెడ్డి విజయానికి తమ పార్టీ సహకరిస్తూ ప్రచారం చేసి బిజెపి, బిఆర్ఎస్‌లను తరిమికొడతామని సిపిఎం మేడ్చల్ జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి పి.సత్యం పేర్కొన్నారు. దీనిలోని భాగంగా అనుసరించాల్సిన విధి విధానాలను చర్చించేందుకు గాను సోమవారం అణుపురం కమ్యునిటీ హాలులో సాయంత్రం ఆరు గంటలకు పార్లమెంట్ స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు జరిగే ఈ సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతా రెడ్డి పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి వినాశకర విధానాల కారణంగా ధరలు విపరీతంగా పెరిగి పోయాయని, నిరుద్యోగం తీవ్రంగా పెరిగి పోయిందన్నారు. ప్రజల జీవన పరిస్థితులు గత పదేళ్ల బిజెపి పాలనలో దిగజారి పోయిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా ఉన్న కార్మిక వర్గం అంతా సంఘటితంగా కార్మికులకు తీరని అన్యాయం చేసిన మోడీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలన్నారు. పార్టీ శ్రేణులంతా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## రాగిడి విజయం తథ్యం

### మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిగా రాగిడి లక్ష్మారెడ్డి ప్రజల అభిమానంతో భారీ మెజారిటీతో విజయం తథ్యమని మల్కాజిగిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆల్వాల్‌లోని ఈ సేవా సమీపంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పదేళ్ల పాటు తమ ప్రభుత్వం అందించిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో సాధించిన ప్రగతి అభ్యర్థి విజయానికి దోహదపడుతాయన్నారు. ఈ క్యాక్రమంలో మెంకటాపురం కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్, ఆల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి, సీనియర్ నేతలు నందికంటి శ్రీధర్, అనిల్ కిషోర్, డోలి రమేష్ తదితరులు సమీప ప్రాంతాల్లో ఇంటింటి ప్రచరం నిర్వహించారు.

## పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

### తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కార్మికులకు బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో సిఐటియు మండల కమిటి అధ్యక్షుడు కిష్టప్ప ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతి కార్మికులకు గత ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మే డే సందర్బంగా కార్మికులందరు కార్యాలయం ముందు జెండా ఎగురవేయాలని కోరారు. అనంతరం జరిగే సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతి నాయకులు నర్సింహా, ఆరోగ్యం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# రంజిత్‌రెడ్డి గెలుపు కోసం శ్రమించాలి

### శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్




**ప్రజాపక్షం/బంట్వారం :** రంజిత్‌రెడ్డిని భారీ మేజార్టీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజు రాత్రి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... నా గెలుపు కోసం ఎంత కష్ట పడ్డారో అంతకు రెట్టింపు కష్ట పడి భారీ మెజారిటీతో గడ్డం రంజిత్ రెడ్డిని ఎంపిగా గెలిపించాలన్నారు, ఇది ఎన్నికల సమరం కాదు...ధర్మానికి అధర్మానికి జరుగుతున్న సమరం అని, బిజెపి పార్టీ పేద ప్రజలను మరింత నిరుపేదలుగా మారుస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే మన మత పరమైన రాజాకీయలు మొదలవుతయన్నారు. మతం పేరుతో రాజాకీయం చేస్తున్నా బిజెపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదని ప్రజ ధనాన్ని దోచుకోవడంలో ముందుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్టీ హయంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు, రోడ్లు పాఠశాలలు మరేన్నో అభివృద్ధి పనులు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజుల్లోనే 4 గ్యారంటీలను అమలు చేయడం జరిగిందని, ఎన్నికల కోడ్ ముగిసిన వేంటనే ఆగష్టు 15 తేదిలోగా రైతు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. చేవేళ్ళ పార్లమెంటు నియోజకవర్గ ఎంపి అభ్యర్థి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... హస్తం గుర్తుకు ఓటువేసి తనని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మేమిద్దరం కలిసి చేవేళ్ళ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొట్ట మొదటి స్థానానికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బంట్వారం, కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేషం, నర్సింగ్ నాయక్, ఎంపిపి షాదిపురం ప్రభాకర్, జెడ్‌పిటిసి కోటపల్లి సంతోషరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు రాజు , శాసన సభాపతి కుమార్తె యువ నాయకురాలు అనన్యచేతన్, బంట్వారం, కోట్‌పల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

**కష్టపడి పని చేద్దాం.. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిద్దాం**

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ ముఖ్య కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని, దీనికోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని అన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలిపించినందుకు అత్యధిక నిధులు కేటయించారిని అన్నారు. ఎలక్షన్ ముగిసిన తర్వత వికారాబాద్ నియోజకవర్గంలో అనేక పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## వీఎన్ఆర్ విజెఐఇటి కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. హుమానీస్ అండ్ సైన్సెస్ విభాగం, సిఎస్ఇ, ఆర్టిఫిషిల్ ఇంటిలిజెన్సీ, డాటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అప్లైడ్ మేథామేటిక్స్ అండ్ అడ్వాన్స్ డేటా ఎనాలిటిక్స్ ఫర్ ఇండస్ట్రీ పేరిట అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గణిత శాస్త్రం, డాటా సైబర్ భద్రత తదితర రంగాల్లో చోటుచేసుకుంటున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి, అవకాశాల గురించి దేశ విదేశాలకు చెందిన విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ ప్రసంగాల ద్వారా విజ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. మిసిసిపి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆరన్ డిడ్‌లేక్ మాట్లాడుతూ అధిక పనితీరు కంప్యూటింగ్‌ను ఉపయోగించం అనే అంశంపై వివరించారు. గ్రీన్స్ బోరో విశ్వవిద్యాలయం గణిత శాస్త్రం విభాగాధిపతి ప్రొఫెసర్ సత్ నారాయణ గుప్త మాట్లాడుతూ గణిత శాస్త్రాన్ని ఉపయోగించి కొలతల్లో లోపాలను సవరించడం పై సవివరంగా వివరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రొఫెసర్‌లు సుబ్రన్యాయ శాస్త్రి, సాయికృష్ణ, దయాసాగర్, సత్యనారాయణ, తివారి, ముకేశ్ సింగ్, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# సునీత మహేందర్‌రెడ్డిని గెలిపించాలి



**ప్రజాపక్షం/దుండిగల్ :** పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మల్కాజ్గిరి నియోజికవర్గం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీమతి పట్నం సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ పార్లమెంట్ ఎన్నికల ఆబ్జర్వర్ శోభారాణి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, పున్నారెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడీ, బి బ్లాక్ అధ్యక్షులు బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నవీన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్ బొంగునూరి కిషోర్ రెడ్డి, కౌన్సిలర్ రాము గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా కొలన్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్గిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి సెల్ నాయకులు, ఎస్‌టి సెల్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమన్వయంతో విధులు నిర్వహించాలి

### మేడ్చల్ జిల్లా జనరల్ అబ్జర్వర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎన్నికల విధులు నిర్వహించే అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పని చేయాలని మేడ్చల్ జిల్లా జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అబ్జర్వర్లు రామేశ్వర్‌సింగ్, వ్యయ పరిశీలకులు మనోజ్ అలోయిస్ లక్రా, ధృవ్ భోళా, జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతంలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతం పవర్ పాయింట్ ప్రజంటేష్ ద్వారా జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లను తెలియచేశారు. ఎన్నికలు సజావుగా జరిపేందుకు ఎస్ఎస్‌టిఎఫ్ ఎస్‌టి, వివిఎస్‌టి, అకౌంటింగ్ బృందాలు, ఎంఎంసి, ఎక్సైజ్ సభ్యులు సమర్థవంతంగా తమకు కేటాయించిన బాధ్యతలు నిర్వహించాలని అబ్జర్వర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా ఆదేశించారు. పార్లమెంటు పరిధిలో 37,79,596 మంది ఓటర్లు ఉన్నారని, జిల్లాలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు రేయింబవళ్లు పర్యవేక్షిస్తారని జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చేసే వ్యయ సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయ్యాలన్నారు. రాచకొండ కమీషనరేట్ డిసిపి పద్మ తమ శాఖకు సంబంధించి విధులు నిర్వహించే సిబ్బందికి విధి విధానల పట్ల అవగాహన కల్పించామని తెలిపారు.ఎన్నికలకు సంబంధించి పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆయా పోలీస్ స్టేషన్ పరిధుల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు.

## నిజాంపేట్‌లో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/దుండిగల్ :** మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంట్రన్స్ కమాన్ నుండి భారీ బైక్ ర్యాలీగా ప్రచారం కార్యక్రమం నిర్వహించిన మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హనుమంత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నాయకులు పున్నారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు ఈ సందర్భంగా సప్తపది గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, గెలుపునకు కృషి చేయాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేసే వ్యక్తి సునీత మహేందర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి సీనియరు నాయకులు భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు రైతుల కండ్లల్లో సంతోషం చూశాడని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచుతున్నారని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలో బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్బంగా రైతులు సిఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డుల ద్వార తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతరం ఎండిన వరికంకులను చూపిస్తు రైతులు మంత్రికి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్బంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు రైతులకు రైతు బంధు, రైతుబీమా, సాగునీరు, సకాలంలో ఎరువులు, పంటనష్టపరిహారం, వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయంలో మెళకువలు నేర్పించడానికి రైతువేదికలు ఏర్పాటు చేసిన ఘనత సిఎం కేసిఆర్ దేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవక ముందే కరువు కాటకాలు తాండవిస్తున్నాయని, కరెంట్ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన చెందారు. రైతులు పండించిన దాన్యాన్ని కొనేవారే లేరని ఎద్దెవ చేశారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉంటుందని కాంగ్రెస్, బిజెపికి డిపాజిట్‌లు కూడ రావని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. ఈటెల రాజేందర్ ఈ ప్రాంతానికి ఏమి అభివృద్ధి చేయలేదని ఆయనకు ఓటు వేయడం వృధా అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మూడుచింతలపల్లి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, జగ్గంగూడ మాజి సర్పంచ్ విష్ణువర్దన్‌రెడ్డి, ప్రదాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, మాజి ఎంపిటిసి వీరాస్వామి, నాయకులు మురళిగౌడ్, రవీందర్‌రెడ్డి, నాగరాజుగుప్త, సరసం మోహన్ రెడ్డి, కోఆప్షన్ గౌస్‌పాష తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న నువ్వే గెలుస్తావ్..**

ఇటీవల ఓ ఫంక్షన్‌లో మల్లారెడ్డికి ఎదురుపడిన బిజెపి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి ఆలింగనం చేసుకుని నువ్వే గెలుస్తావ్ రాజన్న అని అన్నారు. దీంతో ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై మంత్రి మల్లారెడ్డిని స్థానిక విలేకరులు ప్రశ్నించగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఈటెల నాకు మంచి సన్నిహితుడని నేను ఆయన కలిసి ఒకే పార్టీలో పనిచేశానని అన్నారు. రాజన్న నువ్వే గెలుస్తావ్ అని అన్న దీనిని అనవసరంగా సోషల్ మీడియాలో రాద్ధాంతం చేస్తున్నారని ఈటలను తాను ఆశీర్వదించానని తెలిపారు. శుభాకాంక్షలు చెప్పడంలో తప్పు లేదని ఈ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్‌కు డిపాజిట్‌లు రావని బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తాడని చెప్పారు.

# కాంగ్రెస్‌ను గెలిపిద్దాం.. అభివృద్ధి చేసుకుందాం..



**ప్రజాపక్షం/కొడంగల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించుకుని అభివృద్ధి చేసుకోవాలని కొడంగల్ ఎంనిపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్ , మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలు అన్నారు. శనివారం పర్సాపూర్, పెద్దనందిగామ, చిన్ననందిగామ, బూర్హ్జాఖాన్‌పల్లి, హూసేన్‌పూర్ తదితర గ్రామాలలో పాలమూర్ ఎంపి అభ్యర్థి చల్లా వంశి చంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా వారు ఆయా గ్రామాలలో ప్రజలను చైతన్య పరుస్తూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కొడంగల్ నుంచి ఎంఎల్ఎగా గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం మనకు ఎంతో గర్వకారణమని ప్రస్తుతం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి కాకుండా దేశానికి ఆదర్శంగా కావాలంటే మనందరం చేయి చేయి కలిపి రేవంత్‌రెడ్డిని మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి మన నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం వచ్చిందని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత మనందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాయని ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆగష్టు 15లోగ రైతులకు 2 లక్షల రుణ మాఫీ జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను చైతన్య పరుస్తూ రేవంత్‌రెడ్డికి జై కోడుతున్నారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ ఉషా రాణి, పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నయ్యాం, వర్కింగ్ ప్రెసిడెంట్ ధాము, పర్సాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జేడ్పీటీసీ ఎనుగుల భాస్కర్, మురారీ వశిష్ట, సయ్యద్ మునీర్, అశ్వక్‌లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యం

### కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/దుండిగల్ :** మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యమని బిజెపి కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ సారథ్యంలో మరోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కాంక్షిస్తూ సుస్థిరమైన సమర్థవంతమైన పాలన మోదీతోనే సాధ్యం అవుతుందని అన్నారు. ఒక గొప్ప నాయకులు తెలంగాణ ఉద్యంమలో కీలకనేత స్నేహశీలి మృధుస్వభావి అన్నా అంటే నేనున్నానని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు ఈటల రాజేందర్ మన అభ్యర్థి కావడం శుభ పరిణామం కావున ప్రతి ఒక్కరూ కులం, మతం, ప్రాంతం బేధం లేకుండా మే 13వ తేదీ బిజెపి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డి.ప్రభాకర్ రెడ్డి, డి.సీతారాంరెడ్డి, వై.శ్రీనివాస్ రెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నేడు భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. జిల్లా కార్యాలయంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ పార్టీ పతాకాన్ని ఎగురవేశినా అనంతరం మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా ఆవిర్భవించి. సుదీర్ఘ పోరాటం అనంతరం గమ్యాన్ని ముద్దాడిన తెలంగాణ రాష్ట్ర సమితి. ఇటీవల భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుని మరో వసంతంలోకి అడుగుపెట్టిందని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేపి వివేకానంద కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, డివిజన్ ప్రెసిడెంట్స్, ప్రజా ప్రతినిధులు, మహిళ నాయకురాలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరైన పత్రాలతో వచ్చి వాహనాలు తీసుకెళ్లండి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వాహనాలను సరైన పత్రాలుతో వచ్చి వాహనాలను తీసుకెళ్లాలని కుషాయిగూడ ట్రాఫిక్ సిఐ సైదయ్య తెలిపారు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఉన్న 16 దిచక్ర వాహనాలను సంబంధిత పత్రాలను చూపించి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని అన్నారు.ఇతర వివరాలకు 04027853535, 8712662429,7901118853 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## క్రీడ

# పోరాడి ఓడిన ముంబయి..



### ఢిల్లీ ఖాతాలో ఐదో విజయం

**న్యూఢిల్లీ :** ఐపిఎల్17లో ఢిల్లీ ఐదో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ముంబయితో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. 258 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ముంబయి 9 వికెట్ల నష్టానికి 247 పరుగులకే పరిమితమైంది. తిలక్ వర్మ (63; 32 బంతుల్లో 4స4, 4స6) అర్ధశతకంతో పోరాడినా ఫలితం లేకపోయింది.
ఓపెనర్లు ఇషాన్ కిషన్ (20), రోహిత్ శర్మ (8) నిరాశపరిచారు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (26; 13 బంతుల్లో 3X4, 2X6), కెప్టెన్ హార్దిక్ పాండ్య (46; 24 బంతుల్లో 4X4; 3X6), టిమ్ డేవిడ్ (37; 17 బంతుల్లో 2స4, 3స6) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో రసిక్ దార్, ముకేశ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. ఖలీల్ 2 వికెట్లు తీశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫ్రేజర్ (84; 27 బంతుల్లో 11X4, 6X6), అభిషేక్ పోరెల్ (36, 27 బంతుల్లో 3X4, 1X6) శుభారంభాన్నిచ్చారు. వరుస ఫోర్లు, సిక్సర్లతో ముంబయి బౌలింగ్‌ను ఊచకోత కోశారు. ఇద్దరూ కలిసి తొలి వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని పీయూష్ చావ్లా విడగొట్టాడు. భారీ షాట్‌కు ప్రయత్నించిన ఫ్రేజర్.. నబీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే మరో ఓపెనర్ పోరెల్ కూడా నబీ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హోప్ (41; 17 బంతుల్లో 5స6), రిషభ్‌పంత్ (29; 19 బంతుల్లో 2X4, 2X6), స్టబ్స్ (48*; 25 బంతుల్లో 6స4, 2స6), అక్షర్ పటేల్ (11; 6 బంతుల్లో 1X6) ముంబయి బౌలింగ్‌ను ఉతికి ఆరేసేశారు. దీంతో ఢిల్లీ 257 పరుగుల భారీ స్కోరు చేసింది. ముంబయి బౌలర్లలో వుడ్, బుమ్రా, పీయూష్ చావ్లా, నబీ తలో వికెట్ తీశారు.

# టి20 హిస్టరీలో పంజాబ్ అరుదైన రికార్డు



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2024లో రికార్డుల వర్షం కురుస్తోంది. గతంలో గొప్పగా భావించే 200+ స్కోరు ఇప్పుడు కామన్ అయిపోయింది. ఐపిఎల్ హిస్టరీలో అత్యధిక స్కోరు రికార్డు ఈ సీజన్‌లో రెండు సార్లు బద్ధలైంది. శుక్రవారం కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లో అత్యధిక పరుగుల ఛేజింగ్ రికార్డు కూడా క్రియేట్ అయింది. కెకెఆర్ నిర్దేశించిన 262 పరుగుల టార్గెట్‌ని పంజాబ్ కింగ్స్ అలవోకగా ఛేదించేసింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు టి20 క్రికెట్ హిస్టరీలో టాప్ 5 రన్ ఛేజింగ్ మ్యాచ్‌లు ఏవో తెలుసుకుందాం.

* 243: 2023 పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జల్మీపై ముల్తాన్ సుల్తాన్స్ భారీ విజయం అందుకుంది. సయీమ్ అయూబ్ 33 బంతుల్లో 58, బాబర్ అజామ్ 39 బంతుల్లో 73 పరుగులు చేయడంతో పెషావర్ 20 ఓవర్లలో 242/6 స్కోరు సాధించింది. అనంతరం రిలీ రొసోవ్ 51 బంతుల్లో 121 రన్స్‌తో చెలరేగడంతో, కీరన్ పొలార్డ్ 25 బంతుల్లో 52 పరుగులు చేయడంతో 5 బంతులు ఉండగానే ముల్తాన్ సుల్తాన్స్ లక్ష్యాన్ని ఛేదించింది.

* 244 : 2018లో మరో ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. న్యూజిలాండ్ వర్సెస్ ఆస్ట్రేలియా మ్యాచ్‌లో తొలుత న్యూజిలాండ్ 243 పరుగులు చేసింది. మార్టిన్ గప్టిల్ 54 బంతుల్లో 105 పరుగులు, కొలిన్ మున్రో 33 బంతుల్లో 76 పరుగులు చేయడంతో ఈ భారీ స్కోరు సాధించింది. అనంతరం ఆసీస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ 24 బంతుల్లో 59, షార్ట్ 44 బంతుల్లో 76 పరుగులు చేయడంతో, చివరిలో గ్లెన్ మాక్స్‌వెల్ 14 బంతుల్లో 31*, మార్కస్ స్టోయినిస్ 14 బంతుల్లో 36 మెరుపులతో ఆసీస్‌ను 7 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది.

* 253 : 2023లో టి20 బ్లాస్ట్‌లో సర్రే వర్సెస్ మిడిల్‌సెక్స్ మధ్య ఈ హైయెస్ట్ రన్ ఛేజ్ నమోదైంది. విల్ జాక్స్ 45 బంతుల్లో 96, లారీ ఎవాన్స్ 37 బంతుల్లో 85 పరుగులు చేయడంతో సర్రే 20 ఓవర్లలో 252/7 స్కోరు సాధించింది. మిడిల్‌సెక్స్ కెప్టెన్ స్టీఫెన్ ఎస్కినాజీ 39 బంతుల్లో 73, మాక్స్ హోల్డెన్ 35 బంతుల్లో 68*, ర్యాన్ హిగ్గిన్స్ 28 బంతుల్లో 48 బాదడంతో నాలుగు బంతులు మిగిలి ఉండగానే గెలుపు అందుకుంది.

* 259 : 2023 ఇంటర్నేషనల్ టీ20లో వెస్టిండీస్ నిర్దేశించిన 259 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా ఛేదించింది. ఇది ఇప్పటికీ అంతర్జాతీయ టీ20ల్లో హైయస్ట్ రన్ ఛేజ్‌గా మిగిలిపోయింది. జాన్సన్ చార్లెస్ 46 బంతుల్లో 118, కైల్ మేయర్స్ 27 బంతుల్లో 51 పరుగులు చేయడంతో విండీస్ 258/5 భారీ స్కోరు చేసింది. అనంతరం క్వింటన్ డికాక్ 44 బంతుల్లో సెంచరీ, రీజా హెండ్రిక్స్ 28 బంతుల్లో 68 పరుగులు, ఐడెన్ మార్‌క్రమ్ 21 బంతుల్లో 38 పరుగులు చేయడంతో 7 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా టార్గెట్ రీచ్ అయింది.

* 262 : ఐపిఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ సెట్ చేసిన 262 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ ఛేదించింది. సాల్ట్ 37 బంతుల్లో 75, సునీల్ నరైన్ 32 బంతుల్లో 71 పరుగులతో చెలరేగడంతో కెకెఆర్ 20 ఓవర్లలో 261/6 స్కోర్ చేసింది. కొండంత లక్ష్యంతో ఛేజింగ్‌కు దిగన పంజాబ్‌కు ప్రభ్‌సిమ్రాన్ సింగ్ శుభారంభం ఇచ్చాడు. 20 బంతుల్లోనే 54 రన్స్ కొట్టాడు. మరో ఓపెనర్ జానీ బెయిర్ స్టో 48 బంతుల్లో అద్భుత సెంచరీ 108* సాధించాడు. శశాంక్ సింగ్ 28 బంతుల్లో 68 పరుగులతో వీరవిహారం చేయడంతో 8 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ లక్ష్యాన్ని అందుకుంది.




## రీల్

# జూన్ 27న 'కల్కి' 2898ఎడి రిలీజ్

ప్రస్తుతం ఇండియా అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న అవైటెడ్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా దీపికా పదుకోణ్ అలాగే దిశా పటాని అలాగే యూనివర్సల్ హీరో కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ లాంటి దిగ్గజాల కలయికలో నటిస్తున్న చిత్రం కల్కి 2898ఎడి అని చెప్పాలి. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇండియా నుంచి పాన్ వరల్ లెవెల్ హంగులతో ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ కోసమే గత కొన్ని వారాలుగా అభిమానులు యావత్తు పాన్ ఇండియా ఆడియెన్స్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.
అందరి నిరీక్షణకు తెర దించుతూ ఈ చిత్రంని ప్రపంచ వ్యాప్తంగా సరిగ్గా మరో రెండు నెలల్లో అంటే జూన్ 27 న విడుదల చేస్తున్నట్టుగా ప్రభాస్, దీపికా అమితాబ్ లపై ఓ క్రేజీ పోస్టర్ తో ఇప్పుడు మేకర్స్ రివీల్ చేశారు. మరి ప్రపంచ వ్యాప్తంగా కల్కి ర్యాంపేజ్ అయితే ఆరోజు నుంచి ఉంటుంది అని చెప్పాలి. ఇక ఈ భారీ ప్రాజెక్ట్ కి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా వైజయంతి మూవీస్ వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం వహించారు.

# రవితేజ, అనుదీప్ ప్రాజెక్ట్‌కి టైటిల్

మాస్ మహారాజ రవితేజ హీరోగా ఇప్పుడు మిస్టర్ బచ్చన్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమా తర్వాత తన కెరీర్ బెంచ్ మార్క్ ప్రాజెక్ట్ 75వ సినిమా అయితే మరింత ప్రతిష్టాత్మకంగా మారింది. మరి ఈ చిత్రాన్ని జాతి రత్నాలు డైరెక్టర్ అనుదీప్ కేవీ తో ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. మరి చాలా కాలం తర్వాత రవితేజ నుంచి ఓ సాలిడ్ ఎంటర్టైనర్ అయితే ఈ సినిమాతో ఉంటుంది అని అంతా ఆశిస్తున్నారు. అయితే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి ఓ ఇంట్రెస్టింగ్ టైటిల్‌ని ఫిక్స్ చేసినట్టుగా ఇపుడు సమాచారం. మరి దీని ప్రకారం మేకర్స్ దొంగ పోలీస్ అనే టైటిల్‌ని పెట్టారట. మరి దీనితో ఇదేమన్నా క్రైమ్ కామెడీ నేపథ్యంలో ప్లాన్ చేస్తున్నారా అనేది చూడాలి. ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ చిత్రాన్ని దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తుండగా ఇది హిందీ చిత్రం రైడ్‌కి రీమేక్‌గా తీస్తున్నారు. అలాగే ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తున్నారు.



# ఇంట్రెస్టింగ్ గా అనుపమ పరదా కాన్సెప్ట్ వీడియో!



బబ్లీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది టిల్లు స్క్వేర్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్‌ను సాధించింది. ఈ బ్యూటీ ఇప్పుడు మరొక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయిపోయింది. అనుపమ పరమేశ్వరన్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ కాన్సెప్ట్ వీడియోను మేకర్స్ నేడు రిలీజ్ చేయడం జరిగింది. ఈ వీడియోతో పాటుగా ఇంట్రెస్టింగ్ టైటిల్ పరదాను ప్రకటించారు మేకర్స్. రిలీజ్ చేసిన వీడియో ఆసక్తికరంగా ఉంది. ఇదొక డిఫెరెంట్ సబ్జెక్ట్‌లా అనిపిస్తుంది. ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో దర్శన రాజేంద్రన్, సంగీత తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్ పై విజయ్ దొంకడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# నా కోసం దేశం ఎదురుచూస్తోంది

### అమేథీలో పోటీపై రాబర్ట్ వాద్రా

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ అల్లుడు, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా ఎన్నికల్లో పోటీచేసే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఆయన యూపీలోని అమేథీ నియోజకవర్గం నుంచి పోటీపై పదే పదే మాట్లాడటం అందుకు ఊతమిస్తోంది. తాజాగా మరోసారి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. తాను క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని దేశం మొత్తం కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. ''నిత్యం ప్రజల మధ్య ఉండే నేను క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని దేశం మొత్తం కోరుకుంటోంది. తాను ఎప్పుడూ వారి ప్రాంతంలోనే ఉండాలని ఆశిస్తున్నారు. 1999 నుంచి నేను అమేథీలో ప్రచారం చేస్తున్నాను. సిటింగ్ ఎంపీ స్మృతి ఇరానీ తానిచ్చిన హామీలను నెరవేర్చలేదు'' అని అన్నారు. అమేథీ నుంచి మీ పోటీ ఉంటుందా? అని అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. రెండు దశల పోలింగ్ సరళిని గమనించిన తర్వాత బీజేపీ కంటే కాంగ్రెస్ ముందంజలో ఉందన్నారు. '' ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీని వదిలించుకోవాలని అనుకుంటున్నారు. రాహుల్, ప్రియాంక శ్రమిస్తున్న తీరును చూసిన వారు గాంధీ కుటుంబానికి అండగా ఉన్నారు'' అని వాద్రా వ్యాఖ్యానించారు. గతంలో కూడా ఆయథీతోనే ఉండాలని భావిస్తున్నా. ఆ నియోజకవర్గ ప్రజలు కూడా గాంధీనెహ్రూ కుటుంబసభ్యులే కావాలని కోరుకుంటారు'' అని అన్నారు. అమేథీ నియోజకవర్గానికి సుదీర్ఘకాలం పాటు రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. అయితే, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీపై ఓటమి పాలయ్యారు. అయితే రాహుల్ అక్కడ పోటీ చేస్తారా లేదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే స్మృతిఇరానీ అభ్యర్థిత్వాన్ని బీజేపీ ఖరారు చేసింది. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

# ఎమ్మెల్యేగా హేమంత్ సోరెన్ భార్య పోటీ

**రాంచి:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం పార్టీ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. గండీ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికల్లో ఆమె జేఎంఎం అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఈ మేరకు జేఎంఎం పార్టీ అమెను తమ అభ్యర్థిగా ప్రకటించింది. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ ఇటీవల రాజీనామా చేయడంతో గండీ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. దాంతో ఆ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నిక కోసం జేఎంఎం అభ్యర్థిగా కల్పనా సోరెన్ పేరు ఖరారైంది. భూకుంభకోణం కేసులో ఆమె భర్త హేమంత్ సోరెన్ జైలుకు వెళ్లడంతో పార్టీకి అన్నీ తానై ఆమె వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా బరిలో దిగి ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారు. కల్పనా సోరెన్ ఒడిశాలో పుట్టి పెరిగారు. మయూర్‌భంజ్ జిల్లాలో ఆమె పాఠశాల విద్య అభ్యసించారు.

# అమెరికా పోలీస్ దాష్టీకం

### మరో నల్లజాతీయుడు మృతి

**వాషింగ్టన్ :** అమెరికా ఒహియోలో పోలీసుల దాష్టీకం కారణంగా మరో నల్లజాతీయుడు మరణించారు. 2020లో కోవిడ్ సమయంలో జార్జ్ ఫ్లాయిడ్ ను పోలీసులు రోడ్డుమీద అదిమిపెట్టి చంపిన ఈ ఘటన తరహాలోనే గురువారం ఒహియో రాష్ట్రం కాంటన్‌లో చోటుచేసుకుంది. ఒక కారు ప్రమాదం కేసులో పారిపోయి ఒక బార్‌లో దాక్కున్నాడు ఫ్రాంక్ టైసన్. అతడి వయసు 53 సంవత్సరాలు. పోలీసులు అతడిని వెంటాడుతూ బార్‌లోకి ప్రవేశించారు. తనను చంపడానికి వస్తున్నారంటూ టైసన్ కేకలు పెట్టాడు. ఐతే ఒహియో పోలీసుల వద్ద శరీరాలకు ఉన్న కెమెరాలు (బోడీ కెమెరాలు) ఈ ఘటనను రికార్డు చేశాయి. పోలీసులు టైసన్‌ను పట్టుకుని నేలపై తొక్కిపెట్టారు. అతడి చేతికి బేడీలు వేశారు. ఈ క్రమంలోనే అతడితో పోలీసుల వాగ్వాదం కొనసాగింది. ఆ దశలో తనకు ఊపిరి ఆడటంలేదని చచ్చిపోతాననీ టైసన్ గట్టిగా అరిచినాగానీ అధికారులు పట్టించుకోలేదు. అతడిలో చలనం లేకపోవడంతో పోలీసులు కంగారు పడి ఆసుపత్రికి తరలించారు. చివరకు చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే కన్నుమూశాడు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు ఎవ్వరూ ఇప్పటివరకూ స్పందించలేదు.

# ధరలు తగ్గించి 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

### పేదలపైనే మా దృష్టి : అసోం ర్యాలీలో ఖర్గే భరోసా

### మోదీ ఒక అబద్ధాల ఫ్యాక్టరీ : దోచుకుంటున్నారు



**బార్‌పేట (అసోం) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక అబద్ధాల ఫ్యాక్టరీ అని, ఆ అసత్య ప్రచారం ఎల్లకాలం పనిచేయదని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అసోంలోని బార్‌పేట జిల్లా కాయకుచిలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. దేశంలో పేదల కష్టాలు, వారి బాధల గురించి తెలియని వారికి అధికారంలో కొనసాగే హక్కు లేదని ఆయన అన్నారు. దేశంలో నిరుద్యోగం అతిపెద్ద సమస్యగా ఉందని ఆయన ఆ విషయం పక్కకునెట్టేశారని అన్నారు. చదువుకున్న 65 శాతం మంది యువకులకు ఉద్యోగాలు లేవని అన్నారు. ''కేంద్రంలో అధికారంలోకి రాకుండా బిజెపి ని 'ఇండియా కూటమి' అడ్డుకుంటుంది, కూటమి కచ్చితంగా కేంద్రంలో అధికారంలోకి వస్తుంది, పెరుగుతున్న ధరలను తగ్గిస్తుంది, యువకులకు ఉద్యోగాలు ఇస్తుంది'' అని ఖర్గే చెప్పారు. బిజెపి ఓటమి తప్పదని ఆయన అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీనిఆయన అబద్ధాల రారాజుగా అభివర్ణించారు. ఆయన నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే చెబుతున్నారన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని దేశంలో యువకులకు ఆయన వాగ్దానం చేశారనీ, ప్రతి పౌరుడికీ రూ.15 లక్షలు పంచిపెడతామనీ, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనీ పెద్ద పెద్ద వాగ్దానాలు చేశారనీ కానీ వీటిల్లో ఏ ఒక్క వాగ్దానాన్నీ ఆయన నెరవేర్చలేదని ఖర్గే విమర్శించారు. ''మోదీ ఒక అబద్ధాల ఫ్యాక్టరీ. అది ఎల్లకాలం పనిచేయదు. ఆయన కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను ముస్లిం లీగ్ ఎన్నికల ప్రణాళికతో పోల్చారు, దాని గురించి అన్నీ అబద్ధాలే చెప్పారు'' అని ఖర్గే మండిపడ్డారు. బిజెపి దేశంలో సంపదనంతా దోచుకుంటున్నదని, ఆ సందపను ధనవంతులకు పంపెడుతోందనీ అన్నారు. ''ప్రధామంత్రి తనకున్న కొద్దిమంది ధనిక స్నేహితులకు రూ.16 లక్షల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేశారు. దేశంలో ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారు. పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. కానీ కాంగ్రెస్‌పార్టీ ఏనాడూ బిజెపిలాగా ఆర్‌ఎస్‌ఎస్ లాగా దోచుకోలేదు, దేశాన్ని మతం పేరుతో విభజించలేదు, కులాలమధ్య చిచ్చు పెట్టలేదు'' అని విమర్శించారు. మణిపూర్ రాష్ట్రంలో గడచిన ఏడాది మే నెల నుండీ ఇప్పటివరకూ హింస అస్థిర పరిస్థితులూ కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకూ ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించలేదని విమర్శించారు. రాహుల్‌గాంధీ తన భారత్ జోడో యాత్రను దేశమంతా చేపట్టారనీ, కానీ మోదీ మాత్రం భారత్ తోడో (దేశాన్ని విభజించడం) యాత్ర చేస్తున్నారని ఖర్గే విమర్శించారు. ''కాంగ్రెస్‌పార్టీ దేశంలో 55 ఏళ్ళు అధికారంలో ఉంది, దేశంలో సంపద సృష్టించింది, కానీ మీరు ఈనాడు ఆ సంపదను అమ్ముకుంటున్నారు, ధారాదత్తం చేస్తున్నారు, దేశంలో అన్నింటినీ నాశనం చేస్తున్నారు'' అని ఖర్గే తీవ్రస్థాయిలో మోదీపై విరుచుకుపడ్డారు.

# ఇడి దుర్మార్గపు ఎత్తుగడ

## మద్యం పాలసీ కేసులో సుప్రీంకు తెలిపిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ:** మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 'అత్యంత ఎత్తుగడ'తో వ్యవహరించిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ కేసులో తన అరెస్టును సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై దాఖలు చేసిన ఈడీ ప్రత్యుత్తర అఫిడవిట్‌కు ప్రతిస్పందనగా దర్యాప్తునకు తాను ఎప్పుడూ సహకరిస్తున్నానని కేజ్రీవాల్ చెప్పారు. తొమ్మిదిసార్లు సమన్లు పంపినప్పటికీ దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరు కాకపోవడం తన అరెస్టుకు కారణమని ఈడీ తెలిపిందని, అటువంటి సందర్భంలో కస్టోడియల్ ఇంటరాగేషన్ నిందితులను 'మరింత సమర్థవంతంగా' ప్రశ్నించడానికి దారితీస్తుందని తన సమాధానంలో చెప్పిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన తన సమాధాన అఫిడవిట్‌లో వివరించారు. 'పైన పేర్కొన్న కాలవ్యవధి, ప్రత్యుత్తరంలోని విషయాలు చట్టబద్ధమైన ప్రక్రియకు అవమానకరమైన రీతిలో ఈడీ అత్యంత ఎత్తుగడతో వ్యవహరించిందనడంలో ఎలాంటి సందేహం లేదు' అని తెలిపారు. తన ప్రత్యుత్తరంలో ఈడీ వైఖరి, దాని విచారణా ప్రవర్తన కఠోరమైన అసత్యాన్ని' బహిర్గతం చేస్తోందని పేర్కొన్నారు. కీలకమైన వివరాలు, సమాచారాన్ని కోరుతూ తనకు జారీ చేసిన ప్రతి సమన్లకు తగిన విధంగా స్పందించినట్లు రికార్డు వెల్లడిస్తుందన్నారు. 'అధీకత ఏజెంట్ ద్వారా పిటిషనర్‌ను (కేజ్రీవాల్) పిలవకపోవడం లేదా అతని నుంచి రాతపూర్వకంగా లేదా వర్చువల్ పద్ధతిలో సమాచారం లేదా పత్రాలు కోరడంలో ఆవశ్యకత ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు. జైలు నుంచి విడుదల కావడానికి తాను అర్హుడనని కేజ్రీవాల్ తెలిపారు. ఈడీ తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో మార్చి 21న ఈడీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీ కింద తీహార్ జైలులో ఉన్నారు. ఏప్రిల్ 15న అత్యున్నత న్యాయస్థానం కేజ్రీవాల్ అభ్యర్థనపై ప్రతిస్పందన కోరుతూ ఈడీకి నోటీసు జారీ చేసింది. మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్టును హైకోర్టు ఏప్రిల్ 9న సమర్థించింది. 2021 22 సంవత్సరానికి సంబంధించి ఢిల్లీ ప్రభుత్వ మద్యం పాలసీని రూపొందించడంలో, అమలు చేయడంలో అవినీతి, మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో తర్వాత ఆ పాలసీని రద్దు చేశారు.

# హెలికాప్టర్‌లో పడిపోయి మళ్లీ గాయపడ్డ మమతా బెనర్జీ

**కోల్ కతా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం దుర్గాపూర్ లో హెలికాప్టర్లో పడిపోయారు. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. భద్రతా సిబ్బంది ఆమెను సకాలంలో కాపాడారు. ఆ తర్వాత ఆమె మళ్లీ అసనోల్‌కు తన పయనాన్ని కొనసాగించారు. ఆమె ఎన్నికల ర్యాలీకై కుల్టీ వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. తర్వాత ఆమె కుల్టీకి వెళ్లి ర్యాలీలో ప్రసంగించారు. అక్కడ టిఎంసి అసన్ సోల్ అభ్యర్థి శత్రుఘ్న సిన్హా కు మద్దతుగా ప్రచారం చేశారు. ఆమె గాయపడ్డం ఆరు వారాల్లో ఇది రెండో సారి. ఇదివరలో మార్చి 14 ఆమె తన ఇంట్లో పడిపోయి గాయపడ్డారు. 'ముఖ్యమంత్రి హెలికాప్టర్ లో కూర్చోబోయే ముందు బ్యాలెన్స్ తప్పి పడ్డారు. ఆమె ప్రస్తుతం బాగానే ఉన్నారు' అని ఆమెతో పాటు వెళుతున్న సీనియర్ అధికారి ఓ వార్తా సంస్థకు తెలిపారు.

# రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం

### జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ :** దేశంలో ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిల రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమనీ, కానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రం ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తున్నారనీ కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివార ఆయన ఒక వీడియో ద్వారా ప్రకటన విడుదల చేశారు. కొద్ది రోజులుగా మోడీ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ప్రణాళిక పేరుచెప్పి ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంతోపాటు కాంగ్రెస్‌పార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని రాగం అందుకున్నారని విమర్శించారు. దేశంలో 1950 నుండీ విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి, కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ తరపున ప్రధానమంత్రులు అధికారంలో కొనసాగినప్పుడు మాత్రమే ఇది సాధ్యమైంది అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి పదే పదే కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిలకు వ్యతిరేకమని దుష్ప్రచారం చేస్తున్నారు, ఇది పూర్తిగా అబద్ధం, వాస్తవ విరుద్ధం అని ఆయన ఖండించారు. దేశంలో బిఆర్ అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇతర కాంగ్రెస్ నాయకుల కారణంగానే దేశ రాజ్యాంగం ద్వారా వెనుకబడినవారికి రిజర్వేషన్లు ఇవ్వడానికి ఏర్పాటు జరిగిందన ఆయన గుర్తు చేశారు. 1994లో నాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు మొదటిసారి ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారన జైరామ్ రమేశ్ గుర్తుచేశారు.

# ఉత్తరాఖండ్‌లో కార్చిచ్చు..

**నైనిటాల్ :** ఉత్తరాఖండ్ అడవుల్లో కార్చిచ్చు చెలరేగింది. నైనిటాల్ నగరం వరకు మంటలు వ్యాపించాయి. మంటల కారణంగా పొగలు కమ్ముకున్నాయి. మంటలు నైనిటాల్ హైకోర్టు కాలనీ వైపు విస్తరిస్తున్నాయి. దీంతో అప్రత్తమైన ఉత్తరఖండ్ ప్రభుత్వం మంటలు ఆర్పడానికి ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సాయం కోరింది. దీంతో మంటలు ఆర్పడానికి ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ రంగంలో దిగింది. ఆర్మీ అధికారులు హెలికాప్టర్ల సాయంతో చెలరేగతున్న మంటలపై నీటిని వెదజల్లుతూ ఆర్పుతున్నారు. నైనిటాల్ లేక్‌లో బోటింగ్ సేవలు నిలిపిస్తున్నట్లు అధికారాలు తెలిపారు. ఇప్పటివరకు హైకోర్టు కాలనీకి ఎటువంటి నష్టం వాటిల్లలేదని అధికారులు తెలిపారు. కానీ మంటలు ప్రమాదకారంగా పలు భవనాలకు సమీపంగా చేరుకుంటుందని హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రాటర్ తెలిపారు. నైనిటాల్ జిల్లాలోని లారియా కాంటా అడవుల్లో కూడా మంటలు వ్యాపించగా.. అక్కడి ఐటిఐ భవనం పాక్షికంగా దెబ్బతింది. శుక్రవారం రుద్ర ప్రయాగ్‌లో అడవులకు నిప్పుపెట్టేందుకు యత్నిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అడవుల్లో మంటలను అరికట్టేందుకు ఏర్పాటైన బృందం అరెస్టు చేసినట్లు రుద్రప్రయాగ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అభిమన్యు తెలిపారు. జఖోలిలోని తడియాల్ గ్రామానికి చెందిన నరేష్ భట్ అనే గొర్రెల కాపరి తన గొర్రెలకు మేత కోసం కొత్త గడ్డిని పెంచడానికి నిప్పు పెట్టినట్లుగా గుర్తించారు. ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి అడవుల్లో చెలరేగిన మంటలపై శనివారం సమీక్ష నిర్వహించారు. మంటలు ఆర్పడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గడిచిన వారం రోజుల్లో అడవుల్లో కార్చిచ్చు ప్రమాదాలు వేగంగా విస్తరిస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో సుమారు 31 కొత్త అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

## మండుటెండలో జొన్న రైతుల నిరసన



**ప్రజాపక్షం/బోథ్ :** మండుటెండలో జొన్న రైతులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం బోథ్ మార్కెట్‌లో వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రభుత్వం జొన్న పంటను కొనుగోలు చేయనందుకు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణం అనుకూలించి ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్లు జొన్న దిగుబడి వచ్చిందని కానీ ప్రభుత్వం ఎకరానికి 8 క్వింటాళ్ల 85 కిలోలు మాత్రమే కొనుగోలు చేయడం సరికాదని అన్నారు.మిగితా పంట అమ్ముకోవడానికి దళారుల దగ్గర మోసపోతున్నామని అన్నారు. గత ప్రభుత్వం పోయిన ఏడాది ఎకరానికి 13 క్వింటాళ్లు కొనుగోలు చేసిందని పేర్కొన్నారు.

## మేడేను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం / మెట్ పల్లి :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మికుల తో కలిసి ఏఐటీయూసి అధ్యర్యంలో 138వ మేడే సందర్భంగా మే డే వాల్ పోస్టర్, కరపత్రాలు విడుదల చేశారు, అనంతరం ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు ఎండి ఉస్మాన్ ఆయన మాట్లాడుతూ 4లేబర్ కోడ్ లు రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలి. మున్సిపల్ కార్మికులను అవుట్సోర్సింగ్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి. అలాగే గ్రామపంచాయతి కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి. గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి ఆటో, హమాలి, ట్రాన్స్పోర్ట్ కార్మికులను సమగ్ర సంక్షేమ చట్టానికి తేవాలి భవన నిర్మాణ కార్మికులకు 10 లక్షల ప్రమాద బీమా ప్రకటించాలి, 5000 పెన్షన్ చెల్లించాలి డిజిటల్ పెట్రోల్ నిత్యవసర ధరలపై జిఎస్టి తగ్గించాలి ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ సెక్రటరీ రామిల్ల రాంబాబు, మున్సిపల్ కార్మికులు శ్రీకాంత్, లక్ష్మ ణ్, మహేష్, రాజశేఖర్, శంకరమ్మ, గంగారం, సురష్, రాకేష్, తదితరులు పాల్గోన్నారు.

## సింగరేణి కార్మికుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/మందమర్రి :**మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీలో మేడ మహేష్ (55) అనే సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మద్యానికి బానిసైన మహేష్ కూర విషయంలో భార్య, కొడుకుతో శుక్రవారం గొడవ పడ్డాడు. దీంతో ఇంటి బయట కుటుంబ సభ్యులు ఉండగా గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహ్యత్య చేసుకున్నాడని తెలిపారు. ఘటనా స్థలాన్ని సిఐ శశిధర్ రెడ్డి పరిశీలించారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## కార్మికులు రక్షణ సూత్రాలు పాటించాలి



**ప్రజాపక్షం/కాసిపేట :** సింగరేణిలో వివిధ డిపార్ట్‌మెంట్‌లలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, అధికారులు రక్షణ సూత్రాలను పాటిస్తూ ముందుకు సాగాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ సూచించారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట గని ఉద్యోగులకు రక్షణ సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతున్నందున ఇంటి నుండి బయటకు వచ్చే కార్మికులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలని, ప్రతి కార్మికుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, గని కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై కళాజాత ప్రదర్శన

**ప్రజాపక్షం/రామగిరి :** ప్రతి ఒక్కరూ ఓటు వేసి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కొంద్ర వెంకన్న కళా బృందంచె అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్‌ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన సదస్సును శనివారం రామగిరి మండలంలోని నాగెపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలని భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కునువినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఓటు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉపయోగించే ప్రజల చేతిలో వజ్ర ఆయుధమని సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి పైన ఉందని పాట మాట రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జన గామ రాజనర్సు ఈదునూరి పద్మ బుర్ర శంకర్ గౌడ్, సలెంద్ర రాజన్న దీకొండ శ్రావణ్, జిన్న రమ అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చకచక రోడ్డు పనులు



**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని , ఓడేడ్ ప్రధాన రహదారి ఇసుక లారీల రవాణా తో రోడ్లు గుంతలు గా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులతో అటువైపు ప్రయాణం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కానీ మంత్రి శ్రీధర్ బాబు మొట్టమొదటిసారిగా ముత్తారం మండలానికి శనివారం వస్తున్న సమాచారం తెలుసుకున్న అధికారులు గుంతలు గా మారిన మంథని ఓడేడ్ ప్రధాన రహదారి గుంతలను భారీ జెసిబి యంత్రంతో పూడ్చడం పట్ల ప్రయాణికులు మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ కుటుంబాలకు అండ



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆర్మడ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ డి. మల్లయ్య ఏ ఆర్ హెచ్ సి కెనాల్ నీటిలో మునిగి మరణించగా ఆయన భార్య హేమలత , కుమార్తె శ్రీజ లకి భద్రత ఎక్స్గ్రేషియా చెక్ 8లక్షలు మరియు గోదావరిఖని 2టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ గుండెపోటు తో మరణించిన బి. సోమరాజు హెడ్ కానిస్టేబుల్ భార్య శోభరాణి, కుమార్తె సాయి ప్రియ లకు లకి భద్రత ఎక్స్గ్రేషియా 15,99,160 లక్షల చెక్ ను ఈ రోజు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజీ ) వారికి అందజేయడం జరిగింది.మరణించిన కానిస్టేబుల్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను సీపీ అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసేవిదంగా చూస్తామని తెలియజేశారు. పోలీస్ సిబ్బంది కుటుంబాలకి అండగా ఉంటామని సీపీ అన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఏఓ అశోక్ కుమార్, సూపరింటెండెంట్ సంధ్య పాల్గొన్నారు.

# రెండు పార్టీలు శవ రాజకీయం చేస్తున్నాయి

### కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌మున్షి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** బిజెపి బిఆర్ఎస్ పార్టీలు సిరిసిల్లలో శవ రాజకీయం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సిరిసిల్లలోని డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో పద్మశాలి కమ్యూనిటీ ని రాజకీయాల కోసం వాడుకుంటున్న బిఆర్ఎస్,బిజెపికార్మికులను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నూలుపై 12 శాతం జీఎస్టీ విధించిందని టిఆర్ఎస్ బతుకమ్మ చీరల బిల్లులు బకాయి పెట్టిందని తెలిపారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం నుండి కార్మికులకు కొత్త పాలసీ తీసుకొస్తామన్నారు.కార్మికులనుఆదుకునేందుకు



అన్ని రకాలుగా ముందుంటామని పరిశ్రమను ఆధునికరిస్తామని స్పష్టం చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జీవో నెంబర్ ఒకటి ద్వారా గతంలో కంటే ఎక్కువ పనిచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సిరిసిల్ల వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్లలో ఉన్న మూడంచల వ్యవస్థలో కార్మికులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకునేందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. నేతన్నలు అధైర్య పడద్దని కోరారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు శివ రాజకీయం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బాధితనేతా కార్మిక కుటుంబాన్ని కాంగ్రెస్ నేతలు పరామర్శించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ రోహిత్ చౌదరి, సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్రావు, పలు నాయకులు పాల్గొన్నారు.

### నేత కార్మిక కుటుంబానికి పరామర్శ

తంగళ్ళపల్లి ఇందిరానగర్‌కు చెందిన నేత కార్మికుడు ఆంకారపు మల్లేశం ఇటీవల ఆత్మహత్య చేసుకోగా అతని కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఇంచార్జ్ దీపా దాస్ మున్షి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇల్లంతకుంట ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్



అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. దీపా దాస్ మున్షీ మాట్లాడుతూ నేత కార్మికులకు ప్రభుత్వ అండగా ఉంటుందన్నారు.తంగళ్ళపల్లి జెడ్పిటిసి పూర్మాని మంజుల రామలింగారెడ్డి, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు జె ప్రవీణ్, వైద్య శివప్రసాద్, తంగళ్ళపల్లి మాజీ సర్పంచ్ ఆసాని సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కటకం రాజశేఖర్, లింగాల భూపతి,మచ్చ శ్రీనివాస్,గడ్డం మధుకర్,చుక్క రాజశేఖర్, ఎగుర్ల ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

### రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా సమృద్ధిగా సరఫరా చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మిషన్ భగీరథ శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రవరం ఇంటెక్ వెల్, అగ్రహారం నీటి శుద్ధి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, మిషన్ భగీరథ ఈఎన్సి కృపాకర్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్య మానేరు జలాశయం శ్రీ రాజ రాజేశ్వర జలాశయం లో నీటి నిలువ పూర్తి స్థాయి సామర్థం 27.50 టీఎంసీ గాను ప్రస్తుతం 5.90 టీఎంసీ కి తగ్గడం వలన ఈ వేసవి లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. మిషన్ భగీ



రథ నీటి అవసరాలు, ప్రస్తుతం జలాశయంలో అందుబాటులో ఉన్న నీటి లభ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రస్థుతం ఈ వేసవి కాలం మిషన్ భగీరథకు మూడు నెలల కాలానికి 0.36 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని, ప్రస్తుతం జలాశయంలో త్రాగు నీటి కోసం మొతం 4 టిఎంసీల వరకు లభ్యత ఉందని తెలిపారు. ప్రతి గ్రామమునకు అవసరమైన మేరా సమృద్ధిగా త్రాగునీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. అలాగే అగ్రహారం లోని నీటి శుద్ధి కేంద్రమును సందర్శించారు. అనంతరం వేములవాడలోని రాజన్న ఆలయాన్ని సందర్శించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మిషన్ భగీరథ శాఖ ముఖ్య కార్యదర్శి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్ గౌతమి లతో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు.స్వామి వారిని దర్శించుకున్న అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనము చేశారు. ఆలయ పర్యవేక్షకులు శేష వస్త్రము, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ పర్యటనలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వెంట అదనపు కలెక్టర్ గౌతమి పూజారి, మిషన్ భగీరథ, సిఇ అమరేంద్ర, ఎస్ఈ రవీందర్, ఈఈలు విజయ్ కుమార్, జానకి, ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, స్థానిక తహసిల్దార్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తి మార్చుకోండి

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ ప్రతినిధి :**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయం, పెంపు పూర్తిగా అరికట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పి కె. సురేష్ కుమార్ అన్నారు. శనివారం ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులు, గంజాయి కేసులో దొరికిన వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ గంజాయిని పూర్తిగా నివారించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలలో అనుమానం వచ్చిన ప్రదేశాలలో సోదా చేపట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి నిర్మూలనకు వాహనాల తనిఖీలు, రైల్ తనిఖీలు, సస్పెక్ట్ స్థలాల్లో, పాత నేరస్తుల ఇండ్లను సోదా చేయడానికి ప్రత్యేక టీములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వాహనాల తనిఖీలకు (వన్జీరి, సిర్పూర్ టౌన్ పోలీస్ స్టేషన్, శివాజీ చౌక్ చింతలమానపల్లి పిఎస్) పరిధిలో మూడు ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా ట్రైన్ చెకింగ్ కోసం (కాగజ్ నగర్ రైల్వే స్టేషన్, సిర్పూర్ రైల్వే స్టేషన్ )లలో



రెండు చెక్ పోస్ట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీటితో పాటుగా అనుమానాస్పద స్థలాలు, పాత నేరస్తుల ఇండ్లలో సోదాలు చేయడానికి ప్రత్యేక టీం లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు జిల్లాలో 7 కేసులలో 11 మంది నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందని, 6 కేసులలో 3.112 కేజీ గంజాయి పట్టుబడిందని, దీని విలువ 77050 రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి వారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలు అయినట్లయితే వారి యొక్క వివరాలను 8712670523 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

## మేడే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** 138వ మే డే వేడుకలను సింగరేణి వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు ఘనంగా జరుపుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. శనివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఏర్పాటు చేసిన ద్వారా సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అమెరికా లోని చికాగో నగరంలో ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కార్మిక వర్గం పోరాటం నిర్వహిస్తున్న తరుణంలో అక్కడున్నటువంటి ప్రభుత్వం కార్మికులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపితే కార్మికులు చిందించిన రక్తంలో తడిసిన తమ చొక్కాలని ఎర్రజెండాగా చేసి ప్రపంచ కార్మిక వర్గం అంతా ఎర్రజెండా నేతృత్వంలో హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వాలు వాటికి విరుద్ధంగా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నారని, కార్మిక వర్గం అంతా చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఆ చట్టాలకు వ్యతిరేకంగా



పోరాటాలు నిర్వహించాలని అన్నారు. సింగరేణిలో నూతన అండర్ గ్రౌండ్ బావుల కోసం, సొంత ఇంటి అమలు కోసం, పెర్క్స్ పై ఐటి మినహాయింపు కోసం భవిష్యత్తులో కార్మిక వర్గం హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం గతంలో టిబిజికెఎస్ లో పనిచేసిన 30 మంది కార్మికులు సీతారామయ్య సమక్షంలో ఎఐటియుసి పోరాటాలకు ఆకర్షితులై యూనియన్ లో చేరారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, మోతె లచ్చన్న, అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, నల్లపు సత్తయ్య, మోహన్‌రెడ్డి, గండి సతీష్,మల్లెత్తులశ్రీనివాస్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిః** పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఆశీస్ సంగ్వాన్,ఎస్పీ జానకి షర్మిల తో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నారు.ఈవిఎంలు,ఎన్నికల విధుల నిర్వర్తించే అధికారుల రవాణా కోసం బస్ లను ఏర్పాట్లు చేయాలని అన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ బందోబస్తును ఏర్పాటు చేయాలనీ సూచించారు.అధికారులంతా సమన్వయంతో పని చేయాలని అన్నారు.ఎండల తీవ్రత ఎక్కవగా ఉన్నందున ఓటర్లను ఉదయం నుంచే ఓటు వేసే విధంగా ప్రోత్సహించాలని అన్నారు.జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత అవగహణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లకు



సహాయం చేసేందుకు స్కౌట్లు,ఎస్ సీసీ విద్యార్థుల వంటి వారిని వాలింటర్లుగా నియమించుకోవాలని సూచించారు.ఎన్నికల్లో డబ్బు,మద్యం పంపిణీ,విద్వేష ప్రసంగాలను,నివారించుటకై స్.ఎస్.టి,వి.ఎస్.టి,వివిటి,ఎఫ్.ఎస్.టి టీంలను సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.అంతర్ రాష్ట్ర,జిల్లా చెక్ పోస్ట్‌ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసి అక్రమ డబ్బు,మద్యం సరఫరాను అరికట్టాలన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ,అవగహణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,డీఆర్వో భుజంగ్ రావ్,ఆర్డీవో రత్నకళ్యాణి,రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్,డీఈవో రవీందర్ రెడ్డి,డీఎస్పీ గంగారెడ్డి,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నుండి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి :** ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్న, నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు కావాలన్న దేశంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని, దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజలను రక్షించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం 138 మేడే వాల్ పోస్టర్లను ఆసిఫాబాద్‌జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో విడుదల చేశారు.ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో పౌర ప్రజాసౌమ్య పాలన అంతంచేసి పెట్టుబడిదారి విధానంను పోత్సహిస్తూ, కార్మిక వర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు 29 చట్టాలను సమూలంగా రద్దుచేసి




పెట్టుబడుదాలకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తెచ్చింది బిజెపి ప్రభుత్వం అని విమర్శించారు. పెన్షన్ చట్టాలను అమలు చేయాలని, హమాలి, ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, భవన నిర్మాణ కార్మికుల మరణానికి 10లక్షలు చెల్లించాలని, ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, సింగరేణి కాంటాక్ట్ కార్మికులను, ఆర్‌టిసిలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లను పర్మనెంట్ చేయాలని, సింగరేణిలో గుర్తింపు పత్రం ఇవ్వాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల సిసిఎస్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం కార్మికులకు 26,000 కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ విధానాన్ని సవరించి పెండింగ్లో ఉన్న జీతాలను చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు 600 రూపాయలు చెల్లించాలని అన్నారు. జిల్లాలోని కార్మికులు కర్షకులు అందరూ మేడే ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, హేమాజి, కిషన్, సురేష్, రాజు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## హామీలన్నీ అమలు చేసి చూపిస్తాం

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిః** డిసిసి క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం పీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి,నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు విలేకరుల సమావేశం లో మాట్లాడారు.శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల సమయంలో ఏ రకంగానైతే కష్టపడి పని చేసి అధికారంలోకి తీసుకొచ్చారో అదే రకంగా పార్లమెంట్ ఎన్నికలలో గెలుపునకు కృషి చేయాలి. శాసనసభ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన మూడు రోజుల నుండిఅమలుచేయడంప్రారంభించాం మహిళలకు ఉచిత బస్సు సర్వీసు, ఉచిత కరెంటు,500కి గ్యాస్ సిలిండర్ విజయవంతంగా అమలు చేస్తున్నాం. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఆగస్టు 15వ తేదీ



లోగా రైతులకు రుణమాఫీ అమలు చేసి తీరుతామన్నారు.మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్,నిర్మల్ ఎపీపీ కొరిపల్లి రామేశ్వర రెడ్డి,జెడ్పిటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్,గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎర్రవోతూరాజేందర్,మున్సిపల మాజీ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి,పట్టణ అధ్యక్షులు నందేడపు చిన్ను,మాజీ ఎంపీపీ సాదా సుదర్శన్,మాజీ ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ,దిలావర్పూర్ పార్టీ అధ్యక్షులు సాగర్ రెడ్డి,అల్లూరి మల్లరెడ్డి,కౌన్సిలర్లు కత్తి నరేందర్,పత్తి విజ్ఞతేజ,అద్ప శ్రీకాంత్,ఈటల శ్రీనివాస్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేక మేడల్లాంటి బ్రిడ్జి కట్టిన ఘనత బిఆర్ఎస్‌దే

### రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజా పక్షం/ముత్తారం :** పేక మేడల్లాంటి బ్రిడ్జీ కట్టిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇటీవల నేలకూలిన ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామ సమీపంలో గల నిర్మాణంలో ఉన్న వంతెనను ఆయన శనివారం సందర్శించి, పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని కొంత మంది అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ అధికారులను బెదిరించి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని అన్నారు. కాంట్రాక్టర్లను బెదిరించి నాణ్యత లేకుండా వంతెన నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. చట్టాన్ని చుట్టంగా మార్చుకుని అధికారాన్ని అడ పెట్టుకుని నడిరోడ్డుపైన మర్డర్లు చేశారని అన్నారు. శనివారం మంథని డివిజన్లోని ముత్తారం మండలం మచ్చుపేట గ్రామం నుండి ముత్తారం వరకు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల కోట్లు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారెజీ పిల్లర్లు కుంగిపోగా, నేడు ఓడేడ్ మానేరు నిర్మాణంలో



ఉన్న వంతెన కూలిపోవడం గత బి ఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పాలనకు నిదర్శనమని అన్నారు. ఆనాటి నాయకులు కాంట్రాక్టర్ల నుండి కమీషన్లు తీసుకోవటంతోనే నాణ్యత లేకుండా వంతెన నిర్మాణం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ప్రజాధనా న్ని దుర్వినియోగం చేసిన వారిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల అనంతరం విచారణ చే పట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో నాలుగు నెలల్లో మంత్రి వర్గ విస్తరణ కూడా చేయలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నాలుగు నెలల్లో మేము ఏమి చేశాం అన్నది ప్రజలకు తెలుసన్నారు. గత ఎన్నికల్లో తనను ఆశీర్వదించిన విధంగా మంథని నియోజక వర్గ ప్రజలు పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## కెజిబివి విద్యార్థుల ప్రతిభ అద్భుతం

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిః**కేజీబీవీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించడం అభినందనీయం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంతోషం వ్యక్తం చేశారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోఇంటర్‌ఫలితాల్లో ప్రథమ సంవత్సరం 88.42 శాతం,ఇంటర్ రెండవ సంవత్సరం 93.06 శాతంతో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.కలెక్టర్ మాట్లాడుతూ,రాష్ట్ర స్థాయిలో జిల్లా కేజీవీబీల విద్యార్థులు మొదటి స్థానం సాధించడం ఎంతో గొప్పవిషయమని కొనియాడారు.విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ,సిలబస్ ను కూడా సకాలములో పూర్తి చేయడం వలన రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన కెజిబివి స్పెషల్ ఆఫీసర్, పిజిసిఆర్టి లను అభినందించారు.విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు వారి ఎదుగుదలను ప్రోత్సహించాలని,ముమ్మందు మరింత మెరుగైన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.అలాగే ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు మే 13న పోలింగ్ రోజున తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,డీఈవో రవీందర్ రెడ్డి,కేజీబీవీకళాశాలల ప్రత్యేక అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

